www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 2-6-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 64 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 2.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రేవతి రా. 1.40 తదుపరి అశ్వని
వర్జ్యం: మ. 2.28-3.57; దుర్ముహూర్తం: సా. 4.58-5.50; అమృతఘడియలు: రా. 11.25-12.55; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టోర్నీ పూర్తి షెడ్యూల్ ఆదివారం అనుబంధంలో..

నేటి మ్యాచ్‌లు | **స్టార్ స్పోర్ట్స్‌లో..**

అమెరికా X కెనడా
వేదిక: డాలస్ ఉ. 6 నుంచి

వెస్టిండీస్ X న్యూగిని
వేదిక: గయానా రా. 8 నుంచి

వచ్చేసింది క్రికెట్ తుఫాన్!

నేటి నుంచే టీ20 వరల్డ్‌కప్

20	జట్లు..
55	మ్యాచ్‌లు..
29	రోజులు

ఈనెల 29న ఫైనల్


బాబర్


మార్ష్


విలియమ్సన్


బట్లర్


హసరంగ


రషీద్

ఎప్పటిలాగే ఫేవరెట్లు.. అంచనాలను తలకిందులు చేసే అండర్ డాగ్‌లు.. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని ఇట్టే మార్చేసే పవర్ హిట్టర్లు.. కీలక సమయంలో తడబడే చోకర్లు.. తమదైన వేళ మేటి జట్లకు షాకులిచ్చే పసికూనలు.. ఆఖరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠ.. అనూహ్య ఫలితాలు.. పట్టరాని భావోద్వేగాల మహా సంగ్రామం టీ20 వరల్డ్‌కప్ వచ్చేసింది. అంతగా ఆదరణలేని అమెరికాలో.. బేస్‌బాల్ గోడలను బద్దలుకొట్టి.. క్రికెట్ జెండాను పాతే 20 జట్ల దండయాత్ర ఆదివారం ఆరంభం కానుంది.

న్యూయార్క్: ప్రపంచకప్ టైటిల్‌కు చేరువగా వచ్చి.. అంతలోనే దూరమవుతున్న భారత జట్టు ఈసారి కప్పుతోనే తిరిగి వెళ్లాలనుకొంటుండగా.. మరో ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకొని అరుదైన రికార్డును దక్కించుకోవాలని ఆస్ట్రేలియా ఉవ్విళ్లూరుతోంది. పాకిస్థాన్, వెస్టిండీస్‌లు అనిశ్చితికి చెక్ పెట్టాలనుకొంటుండగా.. డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్, సౌతాఫ్రికా కూడా ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగుతున్నాయి. క్లాసెన్, మిల్లర్, డికాక్, రబాడ లాంటి ఆటగాళ్లున్న సఫారీ జట్టు.. ఈసారి ఎలాగైనా తమ 'చోకర్స్' ముద్రను తొలగించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇక, టీ20 ప్రపంచకప్‌లో 20జట్లు తలపడడం ఇదే తొలిసారి కాగా.. అందునా అమెరికాలో ఎంట్రీ ఇస్తుండడం ఈసారి మరింత ప్రత్యేకం. 29 రోజులపాటు సాగే ఈ పొట్టి కప్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరగనున్నాయి. 16 మ్యాచ్‌లు యూఎ్‌సలో జరగనుండగా.. ఫైనల్ సహా 39 మ్యాచ్‌లు వెస్టిండీస్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 20 జట్లు 4గ్రూపులుగా విడిపోయి తలపడుతున్నాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్స్ ఈనెల 26, 27న, ఫైనల్ 29న జరుగుతాయి.

భారత్‌కు పరీక్ష: 2013లో చివరిసారి ఐసీసీ ట్రోఫీ సాధించిన భారత్‌కు ఇది విషమ పరీక్ష. పైగా గత 12 నెలల్లో రోహిత్ కెప్టెన్సీలో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే వరల్డ్‌కప్ టైటిల్ ఫైట్‌లో టీమిండియా తుది మెట్టుపై చతికిలపడింది. అంతేకాకుండా గత రెండు పొట్టి కప్‌ల్లో కాలం చెల్లిన వ్యూహాలను అమలు చేసి ఘోరంగా విఫలమైంది. మరోసారి అలాంటి తప్పిదాలు తావులేకుండా చూసుకోవాలనుకొంటోంది. ఇటీవలే జరిగిన ఐపీఎల్‌లో బ్యాటర్లు సృష్టించిన విధ్వంసాన్ని స్ఫూర్తిగా తీసుకొని టీమిండియా చెలరేగాల్సి ఉంది. ఇక, స్పిన్నర్లకు సహకరించే కరీబియన్ పిచ్‌లపై ఎలా ఆడాలో మనోళ్లకు అవగతమే.

9న హై వోల్టేజ్

ప్రపంచకప్ అనగానే అందరికీ గుర్తొచ్చేది భారత్, పాక్ పోరు. టోర్నీకే హైలైట్‌గా నిలిచే ఈ హైవోల్టేజ్ ఫైట్ ఈనెల 9న న్యూయార్క్‌లోని నసౌ స్టేడియంలో జరగనుంది.

3

ఈ టోర్నీలో మూడు సిక్సర్లు బాదితే.. అంతర్జాతీయ క్రికెట్ (మూడు ఫార్మాట్లలో కలిపి)లో 600 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా రోహిత్ ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు.


ట్రోఫీతో రోహిత్

అందరికీ సవాలే..

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఈ ప్రపంచకప్ ఆఖరిదన్న వార్తలు వినిపిస్తుండడంతో.. ఇద్దరికీ ఈ టోర్నీ కీలకం కానుంది. అలాగే, ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్‌కు కూడా ఈ టోర్నీ ఎంతో ముఖ్యం. వన్డే వరల్డ్‌కప్ దారుణ ప్రదర్శనను మరువాలంటే.. ఇంగ్లండ్ ఈ టోర్నీలో అదరగొట్టాలి. అయితే, ఇంగ్లిష్ జట్టుకు భారత్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. ఆసీస్ కొత్త కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు ఈ టోర్నీ అతి పెద్ద పరీక్ష కాగా.. వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్ సొంతగడ్డపై సత్తా చాలనుకొంటోంది. అనిశ్చితికి మారుపేరైన పాకిస్థాన్ జట్టు బ్యాటింగ్ ఈసారి ఆందోళన కలిగిస్తోంది. న్యూజిలాండ్ ఎప్పుడూ అండర్‌డాగ్ కాగా.. అఫ్ఘానిస్థాన్, నమీబియా, నెదర్లాండ్స్ టీమ్‌లు సంచలనం కోసం ఎదురుచూస్తున్నాయి. మొత్తంగా చూస్తే అంచనాలకు అందని టీ20 వరల్డ్ కప్.. థ్రిల్లింగ్ మ్యాచ్‌లతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించడం ఖాయం.

15 కేజీలు తగ్గాడు



టీ20ల్లో నెంబర్‌వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ గతంలోకన్నా ఇప్పుడు పర్ఫెక్ట్ ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. వాస్తవానికి అతను ఆమధ్య హెర్నియా సర్జరీ తర్వాత బరువు పెరిగాడు. ఆ తర్వాత జాతీయ క్రికెట్ అకాడమీలో చేరి కఠినమైన డైట్‌తో పాటు నిరంతర శిక్షణ తీసుకున్నాడు. ఈ కారణంగా ఏకంగా 12 నుంచి 15 కేజీలు తగ్గాడట. గతేడాది డిసెంబరు నుంచి క్రికెట్‌కు దూరమై ఈ ఐపీఎల్‌లో అడుగుపెట్టిన సూర్య.. తాజా ప్రపంచకప్‌నకు నూతనోత్సాహంతో బరిలో దిగుతున్నాడు.

ఈ రికార్డులు బద్దలవుతాయా..?



టీ20 ప్రపంచ కప్‌లో ఓవరాల్‌గా విరాట్ కోహ్లీ చేసిన పరుగులు 1141. ఇక, ఓ ఎడిషన్‌లో అత్యధికంగా కోహ్లీ 319 రన్స్ కొట్టాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ ఓవరాల్‌గా 47 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంక బౌలర్ అజంత మెండిస్ (6/8) అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. అత్యధిక జట్టు స్కోర్లలో శ్రీలంక (260/6)దే రికార్డు. నెదర్లాండ్స్ అత్యల్పంగా 39 పరుగులకే ఆలౌటైంది. అత్యధికంగా క్రిస్ గేల్ రెండు సెంచరీలు బాదగా.. హాఫ్ సెంచరీల్లో కోహ్లీ (14) ముందున్నాడు.


కరీబియన్లకు కనీస పోటీ ఇస్తారా..?


న్యూగిని జట్టు ఆటగాళ్లు


పావెల్

గయానా: సరికొత్తగా కనిపిస్తున్న ఆతిథ్య వెస్టిండీస్ జట్టు మూడో టైటిల్ కోసం తమ వేటను ఆరంభించనుంది. గ్రూప్ 'సి'లో భాగంగా ఆదివారం రాత్రి పసికూన పపువా న్యూగినియాతో తమ తొలి మ్యాచ్‌లో తలపడనుంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించి ఊపు మీదున్న రోవ్‌మన్ పావెల్ సారథ్యంలోని విండీస్‌కు పపువా నుంచి కనీస పోటీ అయినా ఎదురవుతుందా? వేచి చూడాల్సిందే. కీలక ఆటగాళ్లు లేకపోయినా ఇటీవలే దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌ను సాధించిన విండీస్ ఈసారి తమ హార్డ్‌హిట్టర్లతో ప్రత్యర్థులను బెదరగొట్టాలనుకుంటోంది. 2016 ఫైనల్లో ఇంగ్లండ్‌పై ఆఖరి ఓవర్‌లో బ్రాత్‌వైట్ నాలుగు వరుస సిక్సర్లతో జట్టుకు రెండో టైటిల్ అందించాడు. కానీ ఆ తర్వాత కరీబియన్లు పేలవ ప్రదర్శనతో నిరాశపర్చగా, 2022 టోర్నీలోనైతే గ్రూప్ దశ నుంచే వెనుదిరిగింది. మరోవైపు 'గ్రూప్ ఏ'లో ఉన్న ఆతిథ్య యూఎస్ జట్టు కెనడాతో ఆదివారం ఉదయం తలపడనుంది. 184 ఏళ్ల తర్వాత ఇరు జట్ల మధ్య అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరుగబోతుండడం విశేషం. అలాగే రెండు జట్లకిదే తొలి టీ20 వరల్డ్‌కప్.

క్రికెట్‌కు దినేశ్ వీడ్కోలు



న్యూఢిల్లీ: వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ రెండు దశాబ్దాల క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. ఇటీవలే ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన తను భారత జట్టు తరఫున ఆఖరిసారి 2022 టీ20 వరల్డ్‌కప్‌లో ప్రాతినిధ్యం వహించాడు. 'కొన్ని రోజులుగా అన్ని వైపుల నుంచి నాపై అభిమానం, ఆప్యాయత, మద్దతు కనబరుస్తున్నారు. ఇక అన్ని రకాల క్రికెట్ నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తూ, జీవితంలో కొత్త అధ్యాయానికి తెర తీయాలనుకుంటున్నా. ఈ సుదీర్ఘ జీవితంలో నాకు తోడ్పడిన కోచ్‌లు, కెప్టెన్లు, సహచరులకు అలాగే కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఎక్స్‌లో కార్తీక్ పోస్ట్ చేశాడు. ఎంఎస్ ధోనీ జోరులో పెద్దగా అవకాశాలు సాధించలేకపోయిన తను 2004లో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు. ఆడిన 26 టెస్టుల్లో 1025, 94 వన్డేల్లో 1752, 60 టీ20ల్లో 686 పరుగులు చేశాడు.

ప్రాక్టీస్ అదిరింది

వామప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్ సన్నాహకంగా జరిగిన ఏకైక వామప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లోనూ రాణించి బంగ్లాదేశ్‌పై 60 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు సాధించింది. కీపర్ పంత్ (53 రిటైర్డ్ అవుట్)తో పాటు హార్దిక్ పాండ్యా (40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. సూర్యకుమార్ (31), రోహిత్ (23) ఫర్వాలేదనిపించగా.. ఓపెనర్ శాంసన్ (1) విఫలమయ్యాడు. ఆ తర్వాత భారీ ఛేదనలో బంగ్లా 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసి ఓడింది. మహ్మదుల్లా (40 రిటైర్డ్ అవుట్) టాప్ స్కోరర్. దూబే, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

ప్రీక్వార్టర్స్‌లో సబలెంకా, రిబకినా

ఫ్రెంచ్ ఓపెన్


సబలెంకా

పారిస్: గ్రాండ్‌స్లామ్ విజేతలు అర్యానా సబలెంకా, ఎలెనా రిబకినా, నాలుగో సీడ్ జ్వెరెవ్, ఐదో సీడ్ మెద్వెదెవ్ ఫ్రెంచ్ ఓపెన్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా 7-5, 6-1తో బడోసాపై, నాలుగో సీడ్ రిబకినా 6-4, 6-2తో 25వ సీడ్ ఎలైస్ మెర్టెన్స్‌పై సునాయాసంగా విజయం సాధించారు. అయితే మరో మూడో రౌండ్‌లో అన్‌సీడ్ అవనేసిన్ 3-6, 6-3, 7-6 (6)తో ఏడో సీడ్ క్వినెన్ జాంక్‌కు షాకిచ్చింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో నాలుగో సీడ్ జ్వెరెవ్ 3-6, 6-4, 6-2, 4-6, 7-6 (3)తో 26వ సీడ్ గ్రీక్‌స్పూర్‌ని, ఐదో సీడ్ మెద్వెదెవ్ 7-6 (4), 7-5, 1-6, 6-4తో మెకాక్‌ని, 11వ సీడ్ డిమినార్ 4-6, 6-4, 6-3, 6-3తో స్త్రఫ్‌ని ఓడించి ముందంజ వేశారు. అలాగే మూడో సీడ్ అల్కారజ్, 9వ సీడ్ సిట్సిపాస్, 21వ సీడ్ అలియాసిమో కూడా నాలుగో రౌండ్ చేరారు.

బాలాజీ తొలిసారి..: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. రెండో రౌండ్‌లో బాలాజీ/మిగ్వెల్ ఏంజెల్ (మెక్సికో) ద్వయం 6-4, 3-6, 6-2తో ఫ్రాన్స్ జోడీ డాన్/థియో జోడీపై విజయం సాధించి రొలాండ్ గారోస్‌లో తొలిసారి ప్రీక్వార్టర్స్‌కు చేరింది.

మనుకు స్వర్ణం

న్యూఢిల్లీ: తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్‌లో భారత జావెలిన్ త్రోయర్ డీపీ మను స్వర్ణం సొంతం చేసుకొన్నాడు. శనివారం జరిగిన పోటీలో మను 81.58 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. మహిళల 100 మీ. హర్డిల్స్‌లో నిత్య రామరాజ్ రజతం, మహిళల 400 మీ. ఫైనల్లో విస్మయ కాంస్యం దక్కించుకున్నారు.

ప్రపంచ చాంపియన్‌కు భారత హాకీ జట్టు షాక్

లండన్: ఎఫ్ఐహెచ్ ప్రో హాకీ లీగ్ లండన్ లెగ్‌లో వరల్డ్ చాంపియన్ జర్మనీకి భారత్ షాకిచ్చింది. శనివారం జరిగిన ఈ పోరులో భారత్ 3-0తో జర్మనీపై గెలిచింది. హర్మన్‌ప్రీత్ (16వ), సుఖ్‌జీత్ (41వ), గుర్జంత్ సింగ్ (44వ) గోల్స్ చేశారు.

గాయత్రి జోడీకి నిరాశ

సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ పోరాటానికి ముగింపు పడింది. శనివారం జరిగిన సెమీస్‌లో గాయత్రి ద్వయం 21-23, 11-21తో మత్సుయమ-షిడా (జపాన్) చేతిలో ఓడింది.

బిజినెస్

సీడాక్ నుంచి మాస్‌చిప్‌కు రూ.509 కోట్ల కాంట్రాక్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మాస్‌చిప్ టెక్నాలజీస్.. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) నుంచి రూ.509.37 కోట్ల విలువైన కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ప్రకటించింది. కాంట్రాక్టులో భాగంగా 5 ఎన్ఎం (నానో మీటర్) టెక్నాలజీని వినియోగించటం ద్వారా హై-పెర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) ఎస్ఓసీ (సిస్టమ్ ఆన్ ఏ చిప్)ను డిజైన్, అభివృద్ధి చేయటంతో పాటు డెలివరీ చేయాల్సి ఉంటుందని తెలిపింది. సెమీకండక్టర్ ఇన్నోవేషన్‌లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంది. కాగా దేశీయంగా, అంతర్జాతీయంగా మరిన్ని మార్కెట్ అవకాశాలను చేజిక్కించుకోవటానికి ఈ కాంట్రాక్టు ఎంతగానో దోహదపడుతుందని మాస్‌చిప్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,550 ▼	66,550 ▼	98,000 ▼
ముంబై	72,356 ▲	66,278 ▲	92,449 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ



హైదరాబాద్	505	విజయవాడ	490
వరంగల్	507	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	145	గోదావరి	149
వరంగల్	145	విజయవాడ	149
కరీంనగర్	145	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	149
విశాఖపట్నం	135		

గత నెల జీఎస్‌టీ ఆదాయం రూ.1.73 లక్షల కోట్లు

వార్షిక ప్రాతిపదికన 10% వృద్ధి ..ఏపీ వసూళ్లు రూ.3,890 కోట్లు.. తెలంగాణలో రూ.4,986 కోట్లు



నికర వసూళ్లు రూ.1.44 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మే నెలకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 10 శాతం వృద్ధితో రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా ఆదాయం పెరగడంతో పాటు దిగుమతులు తగ్గడం ఇందుకు దోహదపడిందని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఎకానమీలో ఆర్థిక కార్యకలాపాలు, వృద్ధి జోరు కొనసాగింపునకు ఇది సంకేతమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతనెలకు తెలంగాణ నుంచి జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం పెరిగి రూ.4,986 కోట్లుగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి వసూళ్లు 15 శాతం వృద్ధితో రూ.3,890 కోట్లుగా నమోదయ్యాయి.

మే నెల జీఎస్‌టీ ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) వాటా రూ.32,409 కోట్లుగా, స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) వాటా రూ.40,265 కోట్లుగా, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) వాటా రూ.87,781 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.12,284 కోట్లు వసూలైంది. సాధారణ సెటిల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా రూ.67,204 కోట్ల నికర ఐజీఎస్‌టీ ఆదాయంలో రూ.38,519 కోట్లను సీజీఎస్‌టీలో, రూ.32,733 కోట్లను ఎస్‌జీఎస్‌టీలో జమ చేసింది. అనంతరం సీజీఎస్‌టీ ఆదాయం రూ.70,928 కోట్లకు, ఎస్‌జీఎస్‌టీ ఆదాయం రూ.72,999 కోట్లకు చేరుకుంది.

స్థూల వసూళ్లలో రిఫండ్లు మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.1.44 లక్షల కోట్లుగా ఉందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ ఏప్రిల్ 1తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో గడిచిన రెండు నెలలకు జీఎస్‌టీ స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.3 శాతం పెరిగి రూ.3.83 లక్షల కోట్లుగా ఉంది. రిఫండ్లను మినహాయించగా, రెండు నెలలకు నికర వసూళ్లు రూ.3.36 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

లోకేష్ మెషిన్స్‌కు నార్తర్న్ కమాండ్ నుంచి ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ సైన్యానికి చెందిన నార్తర్న్ కమాండ్ నుంచి రూ.4.26 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు లోకేష్ మెషిన్స్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా నార్తర్న్ కమాండ్‌కు యాక్సెసరీస్‌తో పాటు సబ్‌మెషిన్ గన్స్ 9X19 ఎంఎం మెషిన్ పిస్టల్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు 28 నాటికి ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

మార్కెట్ పుకార్లపై 24 గంటల్లో స్పందించాల్సిందే..

టాప్ 100 లిస్టెడ్ కంపెనీలకు సెబీ కొత్త నిబంధన • ఈ నెల 1 నుంచే అమల్లోకి..

న్యూఢిల్లీ: మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) పరంగా దేశంలోని టాప్-100 లిస్టెడ్ కంపెనీలు మార్కెట్ పుకార్లపై ప్రధాన మీడియాలో వచ్చిన కథనాలపై 24 గంటల్లోగా స్పందించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కంపెనీ తమపై వచ్చిన పుకారును ధ్రువీకరించడం లేదా తిరస్కరించడం లేదా స్పష్టతనివ్వాల్సి ఉంటుంది. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రవేశపెట్టిన ఈ కొత్త నిబంధన శనివారం నుంచే అమల్లోకి వచ్చింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాప్-250 లిస్టెడ్ కంపెనీలకు ఈ నిబంధన డిసెంబరు 1 నుంచి అమల్లోకి రానుంది. కంపెనీల షేర్ల విలువను ప్రభావితం చేసే సమాచారాన్ని లీక్ చేసే అనైతిక విధానాలను సెబీ కొత్త నిబంధన నిరోధిస్తుందని కార్పొరేట్ కంప్లయన్స్ సంస్థ ఎంఎంజేసీ అండ్ అసోసియేట్స్ వ్యవస్థాపకులు మకరంద్ ఎం జోషి అన్నారు. మార్కెట్ పుకార్ల ధ్రువీకరణ నియమావళిని పటిష్ఠపరుస్తుందన్నారు.



వేగం తగ్గిన వాహనం

- మే నెలలో నెమ్మదించిన విక్రయాల వృద్ధి
- లోక్‌సభ ఎన్నికలు, హై బేస్ ఎఫెక్టే కారణం


న్యూఢిల్లీ: వరుసగా రెండో నెలా ప్యాసింజర్ వాహన (పీవీ) విక్రయాలు నెమ్మదించాయి. మే నెలకు గాను పీవీల టోకు విక్రయాల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాహన గిరాకీ మందగించడంతో పాటు హై బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది ఇదే నెల అమ్మకాల్లో భారీ వృద్ధి నమోదవడం) ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. గత నెలలో వాహన తయారీ కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయిన మొత్తం పీవీల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 4 శాతం వృద్ధితో 3,50,257 యూనిట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెల్లో కంపెనీలు తమ డీలర్లకు 3,35,436 యూనిట్ల వాహనాలను సరఫరా చేశాయి. దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు మే నెలలో అతి స్వల్ప పెరుగుదలతో 1,44,002 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత ఏడాది మే నెలతో పోలిస్తే మారుతి ఎంట్రీలెవెల్, కాంపాక్ట్ మోడళ్ల అమ్మకాలు గత నెలలో తగ్గాయి. బ్రెజ్జా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, వంటి యుటిలిటీ వాహనాల సేల్స్ మాత్రం పెరిగాయని కంపెనీ వెల్లడించింది. "హై బేస్ ఎఫెక్ట్ కారణంగా ఈ ఏడాది ప్యాసింజర్ వాహన విక్రయాల వృద్ధి రెండంకెల దిగువకే పరిమితం కావచ్చు. కాగా, లోక్‌సభ ఎన్నికలు, అధిక ఉష్ణోగ్రతలు గతనెల సేల్స్‌పై ప్రతికూల ప్రభావం చూపాయ"ని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. ఏప్రిల్‌లోనూ వాహన పరిశ్రమ టోకు విక్రయాల వృద్ధి స్తబ్దుగా (1.5 శాతం)నే నమోదైంది.

- గత నెలకు హ్యుండయ్ మోటార్ ఇండియా టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన ఒక శాతం వృద్ధితో 49,151 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది పీవీల విక్రయాల వృద్ధి ఐదు శాతానికి దిగువకే పరిమితం కావచ్చని హ్యుండయ్ మోటార్ సీఓఓ తరుణ్ గార్గ్ అభిప్రాయపడ్డారు.
- టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన (ఎలక్ట్రిక్ వెహికిల్స్ సహా) టోకు అమ్మకాలు 2 శాతం పెరిగి 47,075 యూనిట్లుగా నమోదుకాగా.. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) హోల్‌సేల్స్ మాత్రం ఏకంగా 31 శాతం వృద్ధితో 43,218 యూనిట్లకు పెరిగాయి.
- టయోటా కిర్లోస్కర్ టోకు అమ్మకాలు 24 శాతం వృద్ధి చెంది 25,273 యూనిట్లకు చేరుకోగా.. కియా ఇండియా సేల్స్ 4 శాతం పెరిగి 19,500 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎంజీ మోటార్ అమ్మకాలు మాత్రం 5 శాతం తగ్గి 4,769 యూనిట్లకు పరిమితం అయ్యాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 2-6-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 64 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

తూరుపున పొడుస్తున్న ఎర్రనిపొద్దు..
చల్లని చిరుజల్లుల నీలిమేఘం..
పసుపు పుప్పొడుల తంగేడులు..
విచ్చుకున్న పాలపిట్ట రెక్కల జిలుగులు..
మోదంతో విరగబూసిన మోదుగు పూలు..
నిగనిగల గునుగు కొసల మిసమిసలు..
పచ్చని జమ్మి చెట్టు లేలేత చిగుళ్లతో
దశాబ్ది ఉత్సవాల తెలంగాణపై
విరిసి మురిసిన సింగిడి
రాష్ట్రమంతటా సంబురాల సందడి!



ఉద్విగ్న క్షణాలకు పదేళ్లు

నేటితో 'దశాబ్ది తెలంగాణ'.. అవతరణ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

అమరవీరుల స్తూపానికి నివాళులతో మొదలు.. ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర గీతం ఆవిష్కరణ

సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఫ్లాగ్‌మార్చ్.. 650 మంది అమరుల కుటుంబాలకు ఆహ్వానం

తొలి, మలిదశ ఉద్యమ భాగస్వాములకూ పిలుపు.. ట్యాంక్‌బండ్‌పై అందెశ్రీ, కీరవాణిలకు సన్మానం

నేటితో ఉమ్మడి రాజధానిగా కాలం చెల్లు.. ఇక తెలంగాణ పూర్తి అధీనంలోకి హైదరాబాద్

హైదరాబాద్/కవాడిగూడ/అడ్డగుట్ట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన ఉద్విగ్న క్షణాలకు పదేళ్లు. తొలి, మలిదశ ఉద్యమాల్లో ఎన్నో త్యాగాలు, బలిదానాలతో భారతాన అవతరించిన తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని చాటుకుంటూ.. అగ్రపథాన పయనిస్తూ.. దశాబ్ద కాలాన్ని దాటుతోంది. ఆత్మగౌరవ పోరాటం ఫలించిన క్షణాలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాలకు ముస్తాబైంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలని నిర్ణయించింది. గొప్పగొప్ప నాయకులను ఆహ్వానిస్తూ.. తెలంగాణ కోసం అమరులైన వారి కుటుంబాలకు సముచిత స్థానం కల్పిస్తూ ఉత్సవ నిర్వహణకు సకల ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు గన్‌పార్కు వద్ద అమరులకు నివాళులర్పించడంతో మొదలు పెట్టి.. 10 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో పతాకావిష్కరణతో సగర్వంగా, సమున్నతంగా 'దశాబ్ది తెలంగాణ' ఆవిష్కృతం కానుంది. రాత్రి బాణసంచాతో వెలుగులు విరజిమ్ముతూ కార్యక్రమం ముగియనుంది. రోజంతా నిర్వహించే ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున

మిగతా 9వ పేజీలో...

మోదీ మ్యాజిక్!

తిరుగు లేని మెజారిటీతో కేంద్రంలో మూడోసారి ఎన్డీయే!

ఎన్డీయేకు 350కు పైనే అంటున్న ఎగ్జిట్‌పోల్స్.. 400కు పైన రావచ్చంటున్న 3 సంస్థలు

కేరళలో ఖాతా తెరవనున్న కాషాయ దళం.. తమిళనాడు, ఏపీ, తెలంగాణల్లో విస్తరణ

ఒడిసాలో అధికారం దిశగా.. బెంగాల్లో బలంగా.. ఢిల్లీ సహా ఉత్తరాదిపై గట్టి పట్టు

200 సీట్లు కూడా దాటని ఇండియా కూటమి

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ కొట్టబోతున్నారా!? కేంద్రంలో వరుసగా మూడోసారి కూడా బీజేపీయే తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి రాబోతోందా!? ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్డీయే ప్రభంజనమేనా!? టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించనుందా!? తెలంగాణలో కాషాయ సునామీ రానుందా!? అత్యధిక సీట్లలో బీజేపీ ఘన విజయం సాధించనుందా!? ఈ ప్రశ్నలు అన్నిటికీ 'ఔను' అనే అంటున్నాయి మెజారిటీ ఎగ్జిట్ పోల్స్! దేశవ్యాప్తంగా ఎన్డీయే సునామీని అత్యధిక పోల్స్ అంచనా వేశాయి. ఎన్డీయే 400కుపైగా సీట్లు సాధించే అవకాశం ఉందని ఇండియా టీవీ - సీఎన్ఎక్స్; టుడేస్ చాణక్య; ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా సర్వేలు తేల్చి చెప్పాయి. ఇండియా కూటమి డబుల్ డిజిట్‌కే పరిమితమయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేమని టుడేస్ చాణక్య సర్వే తెలిపింది. ఏడు దశల సార్వత్రిక సమరం శనివారం ముగిసింది! ఏడో దశ పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వాటిలో అత్యధిక సంస్థలు తిరుగు లేని మెజారిటీతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ఎన్డీయేకు 350కిపైగా స్థానాలు వస్తాయని ఇండియా టుడే, ఇండియా న్యూస్ - డి డైనమిక్స్, జన్ కీ బాత్, రిపబ్లిక్

మిగతా 10వ పేజీలో...



కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద జపం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రజలు ఎన్డీయే ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారని నమ్మకంగా చెప్పగలను. మా పనితీరు కారణంగా తమ జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందని పేదలు, బడుగు, బలహీన వర్గాల వారు గుర్తించారు.

\- ప్రధాని మోదీ

295 పక్కా

మా కూటమికి 295 సీట్లు వస్తాయి. ఒక్కటి కూడా తగ్గదు. మా కూటమి నాయకులందరి నుంచీ వివరాలు సేకరించాకే ఈ నిర్ధారణకు వచ్చాం. ప్రజలు మా నాయకులకు చెప్పిందే, మేము మీకు చెబుతున్నాం.

\- ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

తెలంగాణలో నువ్వా నేనా!

కాంగ్రెస్-బీజేపీ మధ్య పోటాపోటీ.. అయినా, బీజేపీదే పైచేయి

బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాకపోవచ్చు.. ఎగ్జిట్ పోల్స్ అంచనా

కాంగ్రెస్‌కు 7-8, బీజేపీకి 8-9 సీట్లు.. ఇది ఆరా సర్వే

ఇరు పార్టీలకు 7-9 చొప్పున అని ఏబీపీ సీఓటర్ లెక్క

హస్తానికి 4-6, కమలానికి 11-12 సీట్లన్న ఇండియా టుడే

10

ఏపీలో టీడీపీ కూటమిదే
విజయం!

మెజారిటీ సర్వే సంస్థల మాట ఇదే

111-135 అసెంబ్లీ సీట్లన్న 'పల్స్'

103-118 సీట్లని రైజ్ అంచనా

కూటమికి 21-23 లోక్‌సభ సీట్లు

3 పార్టీలు సమన్వయంతో పని చేశాయని 'ఇండియా టుడే' కితాబు

21-25 సీట్లు ఇచ్చిన ఏబీపీ-సీవోటర్

19-23 రావచ్చన్న ఇండియా టీవీ

న్యూస్18 అంచనా 19-22 సీట్లు

అమరావతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సర్వేలు అంచనా వేశాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతోందని ప్రకటించాయి. జాతీయ స్థాయి సర్వే సంస్థల్లో అత్యధికం.. కూటమి వైపే మొగ్గు చూపించాయి. ఒక సర్వే సంస్థ మాత్రమే వైసీపీకి అనుకూల ఫలితాలను వెల్లడించింది. రాష్ట్రానికి చెందిన సర్వే సంస్థల్లో కొన్ని తప్ప మిగిలినవి కూడా టీడీపీ కూటమిదే విజయమని పేర్కొన్నాయి. కొన్ని సర్వేల్లో టీడీపీ కూటమికి భారీ మొగ్గు వ్యక్తం కావడం విశేషం. వైసీపీకి అనుకూలత వ్యక్తం చేసిన సర్వేలు ఆ పార్టీకి కొద్ది మొగ్గు మాత్రమే చూపించాయి. లోక్‌సభ ఎన్నికల తుది (ఏడో) దశ పోలింగ్ పూర్తయిన తర్వాత శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడడం మొదలైంది. లోక్‌సభ స్థానాల ప్రాతిపదికన జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అనేక సంస్థలు తమ సర్వే ఫలితాలను విడుదల చేశాయి. ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు కొన్ని భాగస్వామ్య సంస్థలతో కలిసి పోలింగ్ సరళిపై సర్వేలు చేశాయి. పోలింగ్ రోజు ఓటు వేసి

మిగతా 10వ పేజీలో...



రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కాకతీయులను సమ్మక్క, సారక్కలను చంపిన
రాజులుగనే చూస్త

కళాతోరణం ఉంటదా ఉండదా అన్నది ప్రజలే నిర్ణయిస్తరు

ప్రభుత్వ చిహ్నం, విగ్రహంపై అసెంబ్లీలో చర్చకు పెడతం

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంపై కేసీఆర్‌కు గౌరవమే లేదు..

తెలంగాణ గేయం రూపకల్పన పూర్తి బాధ్యత అందెశ్రీదే

డిమాండ్‌తోనే బీర్లకు కొరత.. విత్తనాల లోటు లేనే లేదు

లోక్‌సభ ఫలితాలు వంద రోజుల పాలనకు రెఫరెండమే!

9-12 ఎంపీ సీట్లు, కంటోన్మెంట్, ఎమ్మెల్సీ గెలుస్తం

తెలంగాణలో బీజేపీకి 4-5 సీట్లేనని నడ్డానే చెప్పిండు

కేసీఆర్ కోసమే ట్యాపింగ్ కేసు బీజేపీ సీబీఐకివ్వాలంటోంది

వేడుకలకు సోనియా రాకపోతే వీడియో సందేశం

మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): "సమ్మక్క, సారక్క, జంపన్నలను చంపినవారిగానే కాకతీయ రాజులను నేను చూస్తా. పన్నులు చెల్లించబోం అని అన్నందుకు ఆ గిరిజన యోధులపై దాడి చేసి హతమార్చారు. రుద్రమదేవి హయాం వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని రెడ్డి సామంతులు కాపాడారు. ప్రతాపరుద్రుడు వచ్చాక పద్మనాయకులను చేరదీశాడు. వారు చేయివ్వడంతో ఆ సామ్రాజ్యం పతనమైంది" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వం సారనాథ్ స్థూపం నుంచి అశోక చక్రాన్ని స్వీకరించిందని.. ఇది ధర్మాన్ని చాటుతుందని పేర్కొన్నారు. తెలంగాణ చిహ్నం

మిగతా 9వ పేజీలో...



సర్వం సిద్ధం

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి.. 4న ఉదయం 8కి షురూ

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, 8:30 నుంచి ఈవీఎంల లెక్కింపు

మధ్యాహ్నం 3కు తొలి ఫలితం, 5 వరకు అన్ని స్థానాల ఫలితాలు

34 కౌంటింగ్ కేంద్రాలు, 10 వేల మంది సిబ్బంది

అన్ని చోట్లా మూడంచెల భద్రత: సీఈఓ వికాస్‌రాజ్

5న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ లెక్కింపు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) కార్యాలయం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కౌంటింగ్ కేంద్రాలు, హాళ్లు, టేబుళ్లు, అధికారులు, సిబ్బంది, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మే 13వ తేదీన రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 34 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ కోసం 19 హాళ్లు, ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం 118 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున, చేవెళ్ల పార్లమెంటు స్థానంలోని మహేశ్వరంలో మాత్రం రెండు హాళ్లు... మొత్తం 120 హాళ్లను

మిగతా 11వ పేజీలో...

'పాలమూరు' ఎమ్మెల్సీ ఉప ఎన్నిక



కౌంటింగ్ నేడే

ఏప్రిల్ 2వ తేదీనే జరగాల్సి ఉండగా.. వాయిదా

తొలి ప్రాధాన్యత ఓట్లతోనే తేలిపోనున్న ఫలితం

11

..రాలేను

ఆవిర్భావ వేడుకలకు నన్ను ఆహ్వానించిన తీరు అవమానకరం

తెలంగాణ అస్తిత్వ చిహ్నాలపై విషం కక్కుతున్నారు

ప్రభుత్వ పోకడలను బీఆర్ఎస్ నిరసిస్తోంది

గతంలోని తప్పులకు క్షమాపణ చెప్పాలి

రాష్ట్రం అన్ని రంగాల్లో తిరోగమిస్తోంది

రేవంత్‌కు 22 పేజీల సుదీర్ఘ లేఖ రాసిన కేసీఆర్



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తితో కేసీఆర్

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో తాను పాల్గొనలేనని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. తనను ఆహ్వానించిన తీరు నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్లుగా ఉందని ఆక్షేపించారు. ఉత్సవాల వేదికపై తనకు స్థానం, ప్రసంగించే అవకాశం కల్పించకపోవడం, నిర్వహణపై అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించకపోవడం కాంగ్రెస్ ఆధిపత్య ధోరణి, అప్రజాస్వామిక వైఖరికి పరాకాష్ట అని నిందించారు. తెలంగాణ ఇచ్చామనే ఆధిపత్య, అహంభావ ధోరణిని ప్రదర్శిస్తూ ఉద్యమాన్ని, అమరుల త్యాగాన్ని అవమానించే వైఖరిని మార్చుకోకుండా చేసే ఉత్సవాలకు సార్థకత ఏముందని ప్రశ్నించారు. వేడుకలకు ఆహ్వానం పంపిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్ 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. ప్రజల తరఫున లేఖ రాస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ ప్రజాపోరాటం, అమరుల త్యాగాలతో కాకుండా కాంగ్రెస్ దయా భిక్షతో తెలంగాణ వచ్చిందన్న భావ దారిద్ర్యాన్ని నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణకు గర్వకారణమైన అస్తిత్వ చిహ్నాలపై విషం కక్కుతూ అధికార ముద్ర నుంచి తొలగిస్తూ అవమానిస్తున్నారని మండిపడ్డారు. "ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే వ్యర్థ ప్రయత్నాలు. కాకతీయులు, కుతుబ్‌షాహీల కాలంలో నిర్మించిన వాటికీ మలినాన్ని ఆపాదిస్తూ ప్రజల మనోభావాలను దారుణంగా గాయపరుస్తున్న ప్రభుత్వ సంకుచిత ధోరణి హానికరం. అవమానకరం. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఉద్దేశించిన స్థలంలో కాంగ్రెస్ పెద్దల విగ్రహాలు పెట్టే ప్రయత్నం చేస్తూ రాష్ట్ర అస్తిత్వాన్ని అవమానిస్తున్నారు. తెలంగాణ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉత్సవాలు జరుగుతున్న తీరును ఉద్యమకారులు నిరసిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం తిరోగమనం దిశగా వెళ్తున్న నేపథ్యంలో దశాబ్ది ఉత్సవాల్లో నేను పాల్గొనడం సమంజసం కాదని బీఆర్ఎస్ శ్రేణులు, సహ ఉద్యమకారులు, తెలంగాణవాదుల అభిప్రాయం" అని లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు. చరిత్ర పొడుగునా తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం

మిగతా 12వ పేజీలో...

గన్‌పార్కు వద్ద నివాళి

అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ

పాల్గొన్న ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్

ఈ మట్టిబిడ్డగా గర్విస్తున్నా: కేటీఆర్

నేటి నుంచే టీ20 ప్రపంచ కప్

తొలిరోజు అమెరికాతో కెనడా, వెస్టిండీస్‌తో న్యూగినీ ఢీ

టీ-20 వరల్డ్‌కప్ సమరంపై ఆదివారం అనుబంధం

చిహ్నం మార్పుతో చికాకులే!



కొత్త పలుకు

పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇవాళ్టి నుంచి తెలంగాణ సొంతం. ఈ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌ను సొంతం చేసుకోగా.. ఏపీ ప్రకటించుకున్న రాజధానిని కూడా కాదనుకొని రాజధాని లేని రాష్ట్రంగా మిగిలింది.

మాజీ సీఎం కేసీఆర్‌తో పోల్చితే ప్రస్తుత సీఎం రేవంత్ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తున్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అదే సమయంలో కొన్ని అవాంఛనీయమైన అంశాలు తాజాగా తెరమీదకు రావడం ఆశ్చర్యంగా ఉంది. ఇందులో రాష్ట్రగీతంలో మార్పులు చేయాలనుకోవడం మొదటిది. అందెశ్రీ రచించిన గీతానికి సంగీత దర్శకుడు కీరవాణి స్వర కల్పన చేయడాన్ని బీఆర్ఎస్ తప్పుబడుతోంది. ఇందులో హేతుబద్ధత లేదు. కళలకు కులం, మతం, ప్రాంతం అంటూ ఎల్లలు ఉండవు. సంగీతానికి అసలు ఏ హద్దులూ ఉండవు. అయినా రాష్ట్ర గీతానికి స్వరకల్పన చేయడానికి తెలంగాణకు చెందిన సంగీత దర్శకులే లభించలేదా? కీరవాణి అవసరం ఏమిటి? అని ఆర్.ఎస్.ప్రవీణ్ లాంటి నాయకులు నిలదీయడం ఎబ్బెట్టుగా ఉంది. నిజానికి కీరవాణి ఆంధ్రవాడు అని కూడా చెప్పలేం. హైదరాబాద్‌లో స్థిరపడటానికి ముందు ఆయన చెన్నైలో ఉండేవారు.

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల వేళ తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేయాలనుకుంటున్నప్పటికీ ఫలితం ఉంటుందా? తెలంగాణవాదం ఇప్పుడు కేసీఆర్ గడీలో బందీగా లేదు. ఉమ్మడి రాష్ట్ర స్మృతులు మెదళ్ల నుంచి నిష్క్రమించాయి. అయినా కీరవాణిని అడ్డుబెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని కేసీఆర్ అండ్ కో వృథా ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా రకుల్ ప్రీత్‌సింగ్‌ను ఏ ప్రాతిపదికన నియమించారో వారు చెప్పగలరా? సెంటిమెంట్‌ను రగిలించాలనుకుని అవతలి వారివైపు వేలెత్తిచూపే ప్రయత్నం చేస్తే కేసీఆర్‌వైపు 4వేళ్లు కనిపిస్తాయి.

ఇప్పుడు తెలంగాణలో నివసిస్తున్న వాళ్లందరూ తెలంగాణ వాళ్లే! ఎవరో వేలెత్తిచూపినంత మాత్రాన తెలంగాణ సెంటిమెంట్ పండదు. దొరల దురహంకారం తగదనే ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఓడించారు. తలెత్తుకొని గర్వించే తెలంగాణ కావాలన్నదే ప్రజల వాంఛ. రేవంత్ ప్రభుత్వం మరో అవాంఛనీయమైన అంశాన్ని చేపట్టింది. ప్రభుత్వ చిహ్నంలో మార్పులు చేయాలని రేవంత్ ఎందుకు భావిస్తున్నారో తెలియదు. కొద్దిమంది మినహా ప్రజలెవరూ ఈ మార్పు కోరుకోవడం లేదు.

అధికార చిహ్నం వంటివి మార్చాలనుకోవడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలగకపోగా ప్రభుత్వాలకు చికాకులు ఎదురవుతాయి. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తే భవిష్యత్‌లో వచ్చే ప్రభుత్వం మరికొన్ని మార్పులు చేయవచ్చు. ఈ ధోరణివల్ల తెలంగాణ చిహ్నం ఎలా ఉంటుందో కూడా ప్రజలు గుర్తుపెట్టుకోలేని పరిస్థితి వస్తుంది. చిహ్నాన్ని మార్చినంత మాత్రాన తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును తుడిచివేయలేరు.

చిహ్నాలు మార్చడం వంటి చర్యల వల్ల గత ఎన్నికల్లో చతికిలబడిన బీఆర్ఎస్‌కు జవసత్వాలు కల్పించినవారు అవుతారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశం కోసం కేసీఆర్ సహజంగానే ఎదురుచూస్తారు. అధికారిక చిహ్నంలోని చార్మినార్‌ను కూడా మార్చాలనుకోవడం ఎందుకో తెలియదు. నిన్న మొన్నటివరకు హైదరాబాద్ చిహ్నంగా చార్మినార్‌నే చెప్పుకొన్నాం. రాష్ట్రానికి వచ్చిన అతిథులకు చార్మినార్ రూపంలో ఉన్న జ్ఞాపికలను ఇచ్చేవాళ్లం. ఈ నేపథ్యంలో అనవసర, అవాంఛనీయ అంశాలను కెలుక్కుని తనపై ప్రత్యర్థి రాజకీయ దాడి చేసేందుకు అస్త్రాలు సమకూర్చడమా? లేదా? అన్నది రేవంత్ తేల్చుకోవాలి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై స్వల్ప అసంతృప్తి నెలకొంటోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆ విషయం గ్రహించి ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా మొగ్గలోనే అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రజాభిమానం ప్రజాగ్రహంగా మారడానికి ఎంతో సమయం పట్టదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

చిహ్నం మార్పుతో చికాకులే...!

ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తున్న కొద్దీ ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ప్రధాన రాజకీయ పార్టీల తరఫున పోస్టులు పెడుతూ వీడియోలు చేస్తూ వదులుతున్న వారి హడావుడి కూడా పెరిగిపోతోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఎగ్జాక్ట్ పోల్స్ ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. అంచనాలు, అభిప్రాయాల విషయం ఎలా ఉన్నా కౌంటింగ్ రోజున, ఆ తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయన్నది కీలకంగా మారింది. రాష్ట్రంలో రాజకీయ వైషమ్యాలు ప్రజల మెదళ్లలోకి చొరబడ్డాయి. దీనికితోడు గత ఐదేళ్లుగా ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుదారుల మధ్య దాడులు, ప్రతిదాడులు జరగడంతోపాటు ప్రభుత్వపరంగా కక్ష సాధింపు చర్యలు పరాకాష్ఠకు చేరడంతో ఎన్నికల ఫలితాలను బట్టి గొడవలు జరిగే అవకాశం కూడా కనిపిస్తోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే కాదు.. రాష్ట్ర పోలీసులపై కూడా ఉంది. లోక్‌సభకు కూడా ఎన్నికలు జరిగినప్పటికీ ఆంధ్రప్రదేశ్

> హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అన్న విషయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా మర్చిపోయారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటోంది. విడిపోయి లాభపడిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో కొనసాగిన కేసీఆర్ ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఆరు నెలల రేవంత్‌రెడ్డి పాలనపై పెదవి విరవడానికి పెద్దగా ఏమీలేదు. అయితే, రైతాంగ సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సాగునీటి కొరతతోపాటు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాభావం, ఆర్థిక సమస్యలు ఈ పరిస్థితికి కారణం కావొచ్చుగానీ.. ప్రజలు ప్రభుత్వాన్నే తప్పుబడతారు.


ప్రజలు మాత్రం శాసనసభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న ఉత్సుకతతో ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అధికారంలో ఉన్న వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఎలా ఉండబోతున్నది? కూటమి అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటి? అంటే ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ గొడవలు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా సమాజం విడిపోయింది. పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య 20 రోజుల వ్యవధి ఉండటం వల్ల ఆయా పార్టీల మద్దతుదారులు, ప్రజల మెదళ్లను విషతుల్యం చేశారు. విశ్లేషణలు, వ్యాఖ్యల పేరిట ప్రజలను విడదీసి రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. దీని ఫలితం ఓట్ల లెక్కింపు తర్వాత కనిపించే ప్రమాదం ఉంది. నాలుగో తేదీ తర్వాత కూటమికి మద్దతుగా నిలబడిన వారికి దబిడి దిబిడే అని వైసీపీ అనుకూలురు హెచ్చరికలు చేయగా.. ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే ఈ ఐదేళ్లు తమపై సాగిన వేధింపులకు ప్రతీకారం తీర్చుకోవాలని కూటమి మద్దతుదారులు భావిస్తున్నారు. దీన్నిబట్టి ఫలితాలు ఎలా ఉన్నా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న వైషమ్యాల స్థానంలో కక్షలు, కార్పణ్యాలు ప్రవేశిస్తాయి. రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు మంచిది కాదు. జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నవారు తమకు మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో వారికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు ఎవరు గెలిచినా మంచే జరగాలి కానీ గొడవలు జరగడం వాంఛనీయం కాదు. రాజకీయ పార్టీల మద్దతుదారుల్లో ఆవేశకావేశాలు ఉన్నందున వారిని అదుపు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతతో మెలిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్‌పై ఉంది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఎన్నికల కమిషన్‌గానీ, పోలీసులుగానీ ఆషామాషీగా తీసుకోకూడదు.

మారిన పరిస్థితులు...

చట్టం తన పని తాను చేయాలి. కానీ, రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేకుండా చేశారు. తాము ప్రజలకు జవాబుదారీ అన్న స్పృహ పోలీసుల్లో లేకుండా పోయింది. ఉన్నతాధికారులు పాలకుల పాదాల వద్ద మోకరిల్లుతున్నారు. ఈ కారణంగా ఎన్నికల కమిషన్ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఐదేళ్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికార పార్టీకి ఎన్నికల కమిషన్ తాజాగా తీసుకున్న నిర్ణయాలు రుచించడం లేదు. ఈ కారణంగానే ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా పనిచేస్తున్న అధికారులను జగన్‌రెడ్డి రోత మీడియా టార్గెట్ చేసుకుంది. నిన్నటి వరకు విధి నిర్వహణలో పక్షపాతంగా వ్యవహరించిన అధికారులను తప్పుబట్టినప్పుడు ఇదే రోత మీడియా గుండెలు బాదుకుంది. అధికారులను నిందించడం తగదని సుద్దులు చెప్పే దుస్సాహసానికి పాల్పడ్డారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించడమే మహా పాపం అంటున్నారు. నిన్నటి వరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రతిపక్షాల తరఫున ఎవరు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రికి కళ్లు, చెవులుగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా కేసు నమోదు చేశారు. ఫిర్యాదుల్లో వాస్తవం ఉందా? లేదా? అన్నది తర్వాత తేలుతుంది. ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసుకునే పరిస్థితులు ఇప్పటివరకూ లేకుండా పోయాయి. రూల్ ఆఫ్ లా అమలులో ఉండటానికి, ఉండకపోవడానికి తేడా ఇదే! కౌంటింగ్ సందర్భంగా గొడవలకు దిగడానికి కూడా వెనుకాడని వాళ్లు మాత్రమే తమకు ఏజెంట్లుగా ఉండాలని సజ్జల చెప్పడాన్ని బట్టి ఆ రోజు పరిస్థితి ఎలా ఉండబోతున్నదో అధికార యంత్రాంగం అంచనా వేసుకోవచ్చు. కయ్యానికి కాలు దువ్వడానికి సిద్ధంగా ఉండాలని సజ్జల వంటి వారు స్వయంగా పిలుపు ఇవ్వడం వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఐదేళ్లుగా అణచివేతకు గురైన తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు.. నాయకులు కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉంది. జగన్మోహన్ రెడ్డికి అనుకూలంగా ఫలితాలు వస్తే కౌంటింగ్ కేంద్రం లోపల, బయట గొడవలు జరగవచ్చు. కూటమికి అనుకూలంగా ఫలితాలు వస్తే ధర్మాగ్రహం పేరిట కూటమి మద్దతుదారులు ప్రతీకారదాడులకు దిగవచ్చు. ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతుదారులుగా ఉంటున్న వారిలో కొందరు ఉన్మాదులుగా మారారు. "ఎవరైనా జగన్‌రెడ్డి కక్ష్యలోకి వచ్చి నాలుగైదు అడుగుల దూరంలో నిలబడి కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తే జగనన్న కోసం వాడు చచ్చిపోతాడట. జగన్ ఇజ్ నాట్ ఎ మ్యాన్. బట్ ఈజ్ యాన్ ఎమోషన్. ఆయనను చూస్తే పిచ్చి పట్టేస్తుంది. అతనొక ఎమోషన్, అతనొక శక్తి" అని అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి లండన్‌లో చేసిన వ్యాఖ్యలు గమనార్హం. అదనపు అడ్వొకేట్ జనరల్ స్థాయిలో ఉన్న వ్యక్తి నోటి నుంచి ఇలాంటి మాటలు వచ్చాయంటే జగన్‌రెడ్డి మద్దతుదారుల మనస్తత్వం అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా వస్తే ఈ బాపతుగాళ్లు ఎలా వ్యవహరిస్తారో ఊహించుకోవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం...

ఈ విషయం అలా ఉంచితే, రాష్ట్రంలో ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోతున్నాయి. ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు చెప్పినదాన్ని బట్టి ఈ ఎన్నికల్లో సగటున ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో 100 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశారు. శాసనసభ్యుడిగా ఎన్నిక కావడానికి 50 నుంచి 100 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సాధించేది ఏమిటి? అంత ఖర్చు చేసి గెలిచిన అభ్యర్థుల నుంచి ప్రజాసేవను ఆశించడం అత్యాశే అవుతుంది. ప్రజలు కూడా పూర్తిగా మారిపోయారు. గతంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికే డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో అగ్రవర్ణాల వారితోపాటు భూస్వాములు, ధనికులు కూడా అడిగి మరీ డబ్బు తీసుకున్నారట! ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్నవారు ఎన్నికల్లో డబ్బు తీసుకోవడాన్ని నామోషీగా భావించేవారు. ఇప్పుడు వారు కూడా అది తమ హక్కుగా భావిస్తున్నారట! ఒక నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో సగం మందికి మాత్రమే గతంలో డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో మాత్రం మెజారిటీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లందరికీ డబ్బులు పంచారు. కొన్ని నియోజకవర్గాల్లో పంపకాలకే 60 కోట్ల రూపాయలకుపైగా ఖర్చయ్యిందని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. పెద్ద పెద్ద భవనాల్లో నివసిస్తున్నవారు కూడా పక్క వారికి ఎక్కువ ఇచ్చి తమకు తక్కువ ఇచ్చారేంటి? అని నిలదీస్తున్నారట. ఈ లెక్కన వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. అంటే రెండు ప్రధాన పక్షాలు బరిలో ఉంటే.. 175 నియోజకవర్గాల్లో మొత్తం 30 వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి రాజకీయ పార్టీలకు కూడా శిరోభారం అవుతుంది. ప్రస్తుతం రాజకీయ పార్టీలు పులి మీద స్వారీ చేస్తున్నాయి. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టే స్థితిలో ఎన్నికల కమిషన్ లేదు. పోలీసులతోపాటు పోలింగ్ సిబ్బందికి కూడా ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధిగలవారు ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యమా? శాసనసభ్యులు దోపిడీకి తెరలేపారని నిందించే హక్కు ప్రజలకు ఉంటుందా? ఓటు వేయడానికి చేయిచాస్తున్న వారికి ప్రశ్నించే హక్కుగానీ, నిలదీసే అర్హతగానీ ఉంటుందా? వేలకోట్లు ఖర్చుచేసి అధికారంలోకి వచ్చే పార్టీలు నిప్పులా ఉండాలని ఆశించడం తప్పుకాదా? ఏ రాజకీయ పార్టీ అధినేత కూడా తమ సొంత ఆస్తులు కరిగించి ఖర్చు చేయరుగదా? వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి విరాళాలు సేకరిస్తారు. అందుకు బదులుగా అధికారంలోకి వచ్చాక వారికి మేళ్లు చేయాలి. ఇదొక విష వలయం! ఓటర్లకు వేలల్లో దక్కుతుండగా విరాళాలు ముట్టజెప్పేవారితోపాటు కొంతమంది నాయకుల చేతుల్లోకి సంపద పోతుంది. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలకు ఇదొక పెట్టుబడి. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టి అధికారంలోకి వచ్చాక లాభాల పంట పండించుకుంటారు. ప్రజలకు ఎన్నికలప్పుడు ఎంతో కొంత డబ్బు ముడుతోంది. తిలా పాపం తలా పిడికెడు! ఈ వ్యవస్థను మార్చుకోవాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నది సమాజమే ఆలోచించుకోవాలి. ఎన్నికల ఖర్చు వేల కోట్ల నుంచి లక్షల కోట్లకు చేరడానికి ఎంతోకాలం పట్టకపోవచ్చు. మనదేశంలో ఎన్నికల ఖర్చు అగ్రరాజ్యం అమెరికాలో ఎన్నికల ఖర్చును ఇప్పటికే అధిగమించింది. డబ్బు పంచనిదే ఓటు వేయడానికి వచ్చేది లేదు అనేస్థాయికి ప్రజలు వచ్చేశారు. వారిని ఆ స్థాయికి దిగజార్చారు. పోలింగ్‌ను సజావుగా జరిపించేందుకు పోలీసులు, పోలింగ్ అధికారులకు కూడా లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి తెచ్చుకున్నది కూడా రాజకీయ పార్టీలే! ఈ విష వలయం నుంచి దేశం బయటపడని పక్షంలో అభివృద్ధి అనేది నినాదాలకే పరిమితం అవుతుంది. సంపన్నులు మరింత సంపన్నులు అవుతారు. వారు చెల్లించే పన్నులతో ప్రజలకు తాయిలాలు పంచుతూ రాజకీయ నాయకులు అపర దానకర్ణులుగా బిల్డప్ ఇచ్చుకుంటారు. మన ప్రజాస్వామ్యం మేడిపండులా మారిపోవడం విషాదం. పెరుగుట విరుగుట కొరకే అని అంటారు. ఈ విషాదం నుంచి దేశం ఏదో ఒక రోజు బయటపడుతుందని, బయట పడాలని కోరుకుందాం!



> ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోతున్నాయి. ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు చెప్పినదాన్ని బట్టి ఈ ఎన్నికల్లో సగటున ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో 100 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. శాసనసభ్యుడిగా ఎన్నిక కావడానికి 50 నుంచి 100 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సాధించేది ఏమిటి? గతంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికే డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో అగ్రవర్ణాలవారితోపాటు భూస్వాములు, ధనికులు కూడా అడిగి మరీ డబ్బు తీసుకున్నారట! ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్నవారు ఎన్నికల్లో డబ్బు తీసుకోవడాన్ని నామోషీగా భావించేవారు. ఇప్పుడు వారు కూడా అది తమ హక్కుగా భావిస్తున్నారట! ఒక నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉంటే అందులో సగం మందికి మాత్రమే గతంలో డబ్బు పంచేవారు. ఈ ఎన్నికల్లో మాత్రం మెజారిటీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లందరికీ డబ్బులు పంచారు. కొన్ని నియోజకవర్గాల్లో పంపకాలకే 60 కోట్ల రూపాయలకుపైగా ఖర్చయ్యిందని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. పెద్ద పెద్ద భవనాల్లో నివసిస్తున్నవారు కూడా పక్క వారికి ఎక్కువ ఇచ్చి తమకు తక్కువ ఇచ్చారేంటి? అని నిలదీస్తున్నారట. ఈ లెక్కన వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది.

పదేళ్ల 'తెలంగాణ'

ఇప్పుడు తెలంగాణ రాజకీయాలకు వద్దాం. పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇవాళ్టి నుంచి తెలంగాణ సొంతం. రాష్ట్రం విడిపోయి అప్పుడే పదేళ్లు అయ్యింది. ఈ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌ను సొంతం చేసుకోగా.. ప్రకటించుకున్న రాజధానిని కూడా కాదనుకొని ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అన్న విషయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా మర్చిపోయారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటోంది. విడిపోయి లాభపడిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో కొనసాగిన కేసీఆర్ ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఆరు నెలల రేవంత్‌రెడ్డి పాలనపై పెదవి విరవడానికి పెద్దగా ఏమీలేదు. అయితే, రైతాంగ సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సాగునీటి కొరతతోపాటు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాభావం, ఆర్థిక సమస్యలు ఈ పరిస్థితికి కారణం కావొచ్చుగానీ.. ప్రజలు ప్రభుత్వాన్నే తప్పుబడతారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పోల్చితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తున్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అదే సమయంలో కొన్ని అవాంఛనీయమైన అంశాలు తాజాగా తెరమీదకు రావడం ఆశ్చర్యంగా ఉంది. ఇందులో రాష్ట్ర గీతంలో మార్పులు చేయాలనుకోవడం మొదటిది. అందెశ్రీ రచించిన గీతానికి ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి స్వరకల్పన చేయడాన్ని భారత రాష్ట్ర సమితి తప్పుబడుతోంది. ఇందులో హేతుబద్ధత లేదు. కళలకు కులం, మతం, ప్రాంతం అంటూ ఎల్లలు ఉండవు. సంగీతానికి అసలు ఏ హద్దులూ ఉండవు. అయినా రాష్ట్ర గీతానికి స్వరకల్పన చేయడానికి తెలంగాణకు చెందిన సంగీత దర్శకులే లభించలేదా? ఆంధ్రకు చెందిన కీరవాణి అవసరం ఏమిటి? అని ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌లాంటి నాయకులు నిలదీయడం ఎబ్బెట్టుగా ఉంది. నిజానికి కీరవాణి ఆంధ్రవాడు కూడా అని చెప్పలేం. హైదరాబాద్‌లో స్థిరపడటానికి ముందు ఆయన చెన్నైలో ఉండేవారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో ఆంధ్రవారినే ఎంచుకున్నారు. కాళేశ్వరం నిర్మించిన ప్రధాన సంస్థ ఆంధ్రా వాళ్లది కాదా? యాదాద్రికి రూపకల్పన చేసిన ఆనంద్‌సాయి ఆంధ్రావాడు కాదా? చినజీయర్ స్వామి ఎవరు? రాజశ్యామల యాగం జరిపించిన స్వరూపానంద ఎవరు? కల్వకుంట్ల కవిత రూపొందించిన బతుకమ్మ పాటకు తమిళుడైన ఏఆర్ రెహ్మాన్ స్వరకల్పన చేయలేదా? అంటూ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశించి నెటిజన్స్ ఆడుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన భారత రాష్ట్ర సమితి మళ్లీ పూర్వ వైభవం సాధించేందుకు తెలంగాణవాదాన్ని ఎత్తుకోబోతున్నదని దీన్నిబట్టి అర్థం అవుతోంది. రాష్ట్రం ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న వేళ తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేయాలనుకుంటున్నప్పటికీ ఫలితం ఉంటుందా? తెలంగాణవాదం ఇప్పుడు కేసీఆర్ గడీలో బందీగా లేదు. ఉమ్మడి రాష్ట్ర స్మృతులు మెదళ్ల నుంచి నిష్క్రమించాయి. అయినా కీరవాణిని అడ్డు బెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని కేసీఆర్ అండ్ కో వృథా ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా రకుల్ ప్రీత్‌సింగ్‌ను ఆనాడు ఏ ప్రాతిపదికన నియమించారో వారు చెప్పగలరా? సెంటిమెంట్‌ను రగిలించాలనుకుని అవతలి వారి వైపు వేలెత్తిచూపే ప్రయత్నం చేస్తే కేసీఆర్‌వైపు నాలుగువేళ్లు కనిపిస్తాయి. కేంద్రంలో భారతీయ జనతాపార్టీ తీసుకువచ్చిన ఎన్ఆర్‌సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్)ని తాము వ్యతిరేకిస్తున్నట్లుగా కేసీఆర్ అప్పట్లో చెప్పారు. ఇప్పుడు రాజకీయంగా మనుగడ సాగించడం కోసం టీఆర్‌సీని తీసుకురావాలని కోరుతారా? ఇప్పుడు తెలంగాణలో నివసిస్తున్న వాళ్లందరూ తెలంగాణ వాళ్లే! ప్రవీణ్‌కుమార్ లేదా మరొకరు వేలెత్తిచూపినంత మాత్రాన తెలంగాణ సెంటిమెంట్ పండదు. దొరల దురహంకారం తగదనే గత ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఓడించారు. తలెత్తుకొని గర్వించే తెలంగాణ కావాలన్నదే ప్రజల వాంఛ.

> కేంద్రంలో భారతీయ జనతాపార్టీ తీసుకువచ్చిన ఎన్ఆర్‌సీని తాము వ్యతిరేకిస్తున్నట్టుగా కేసీఆర్ అప్పట్లో చెప్పారు. ఇప్పుడు రాజకీయంగా మనుగడ సాగించడం కోసం టీఆర్‌సీని తీసుకురావాలని కోరుతారా?

అవసరం లేని 'మార్పులు'

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో అవాంఛనీయమైన అంశాన్ని చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వ చిహ్నంలో మార్పులు చేయాలని రేవంత్‌రెడ్డి ఎందుకు భావిస్తున్నారో తెలియదు. కొద్దిమంది మినహా ప్రజలెవరూ ఈ మార్పు కోరుకోవడం లేదు. గత ఎన్నికల్లో ఈ అంశం చర్చకు కూడా రాలేదు. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం వేరు – తిరగదోడటం వేరు. ప్రభుత్వ చిహ్నం వంటివి మార్చాలనుకోవడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలగకపోగా ప్రభుత్వాలకు చికాకులు ఎదురవుతాయి. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తే భవిష్యత్‌లో వచ్చే ప్రభుత్వం మరికొన్ని మార్పులు చేయవచ్చు. ఈ ధోరణివల్ల తెలంగాణ చిహ్నం ఎలా ఉంటుందో కూడా ప్రజలు గుర్తుపెట్టుకోలేని పరిస్థితి వస్తుంది. తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని మార్చేందుకు ప్రభుత్వ మార్పిడి జరగలేదు. ఈ చిహ్నాన్ని మార్చినంత మాత్రాన తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును తుడిచివేయలేరు. తెలంగాణ చరిత్రలో ఆయన స్థానం ఆయనకే ఉంటుంది. ప్రభుత్వం నుంచి ప్రజలు ఆశించేది వేరుగా ఉన్నప్పుడు ఇలాంటి అల్ప విషయాలకు ప్రాధాన్యం ఇస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే ఇబ్బందులు ఎదురవుతాయి. ఇలాంటి చర్యలను ప్రజలు హర్షించరు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం ప్రజా వేదికను కూల్చడాన్ని, రాజధాని లేకుండా చేయడాన్ని ప్రజలు హర్షించలేదు. చిహ్నాలు మార్చడం వంటి చర్యల వల్ల గత ఎన్నికల్లో చతికిలబడిన భారత రాష్ట్ర సమితికి జవసత్వాలు కల్పించినవారు అవుతారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశం కోసం కేసీఆర్ సహజంగానే ఎదురుచూస్తారు. కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన చిహ్నంలో ఉన్న చార్మినార్‌ను మార్చాలనుకోవడం ఎందుకో తెలియదు. నిన్న మొన్నటివరకు హైదరాబాద్ చిహ్నంగా చార్మినార్‌నే చెప్పుకొన్నాం. రాష్ట్రానికి వచ్చిన అతిథులకు చార్మినార్ రూపంలో ఉన్న జ్ఞాపికలను ఇచ్చేవాళ్లం. ఈ నేపథ్యంలో అనవసర, అవాంఛనీయ అంశాలను కెలుక్కుని తనపై ప్రత్యర్థి రాజకీయ దాడి చేసేందుకు అస్త్రాలు సమకూర్చడమా? లేదా? అన్నది రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై స్వల్ప అసంతృప్తి నెలకొంటోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ విషయం గ్రహించి ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా మొగ్గలోనే అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ప్రజాభిమానం ప్రజాగ్రహంగా మారడానికి ఎంతో సమయం పట్టదు. కేసీఆర్‌కు ఎదురైన అనుభవం సజీవ సాక్ష్యంగా ఉండనే ఉంది!

> పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య 20 రోజుల వ్యవధి ఉండటం వల్ల ఆయా పార్టీల మద్దతుదారులు ప్రజల మెదళ్లను విషతుల్యం చేశారు. విశ్లేషణలు, వ్యాఖ్యల పేరిట ప్రజలను విడదీసి రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. దీని ఫలితం ఓట్ల లెక్కింపు తర్వాత కనిపించే ప్రమాదం ఉంది. నాలుగో తేదీ తర్వాత కూటమికి మద్దతుగా నిలబడిన వారికి దబిడి దిబిడే అని వైసీపీ అనుకూలురు హెచ్చరికలు చేయగా.. ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే ఈ ఐదేళ్లు తమపై సాగిన వేధింపులకు ప్రతీకారం తీర్చుకోవాలని కూటమి మద్దతుదారులు భావిస్తున్నారు. దీన్నిబట్టి ఫలితాలు ఎలా ఉన్నా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న వైషమ్యాల స్థానంలో కక్షలు, కార్పణ్యాలు ప్రవేశిస్తాయి. రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు మంచిదికాదు.

స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సోనియా

ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం కల సాకారమై 10 సంవత్సరాలు అయింది, ఘనంగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము. ఇందులో ప్రధాన భూమిక తెలంగాణ యావత్తు ప్రజలదే. తెలంగాణ ఉద్యమానికి అన్ని రంగాల, వర్గాల, కులాల, మతాల ప్రజలు సంపూర్ణ సహకారాన్ని అందించారు. విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కళాకారులు, రచయితలు, వైద్యులు.. ఒక్కరేమిటి సబ్బండ వర్గాల పోరాటంతో తెలంగాణ సాధ్యమైంది. ఇది ఎవరూ కాదనలేని పచ్చినిజం. ఈ ప్రజా వెల్లువతో తెలంగాణలోని రాజకీయ పార్టీలు ప్రజల బాటన పయనించక తప్పింది కాదు. పార్టీలు కూడా మిగతా వర్గాలతో చేయి చేయి కలిపి ముందుకుసాగాయి. అందుకనుగుణంగా రకరకాల వేదికలు, వివిధ పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగించాయి.

ఇదంతా ఒక పార్శ్వమైతే, తెలంగాణ సాకారంలో కాంగ్రెస్ పార్టీ, దాని అధినాయకురాలు సోనియాగాంధీ పాత్ర మరింత ప్రత్యేకమైనది. 2004లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల ఐక్య సంఘటనలో తెలంగాణ ఏర్పాటు ఒక ఉమ్మడి అంశం. అయితే రాష్ట్రంలో, దేశంలో ఉండే సమైక్యవాద శక్తులు, ప్రత్యేకించి తెలంగాణ ఏర్పాటు పట్ల విముఖంగా ఉన్న శక్తులు అప్పట్లో తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకున్నాయి. అయితే సోనియాగాంధీ మాత్రం సానుకూలంగానే ఉన్నట్లు అప్పుడు వార్తలు వచ్చాయి. 1999లో 40 మంది కాంగ్రెస్ శాసన సభ్యుల బృందం సోనియాకు ఒక వినతి పత్రం అందించిన ఘట్టం నుంచి తెలంగాణ మలి దశ ఉద్యమానికి పునాది పడినట్టయింది. అప్పట్లో వీరిచ్చిన లేఖపై సోనియాగాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయగా, ఆ సబ్ కమిటీ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించడం జరిగింది. ఆనాటి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోలేకపోయినప్పటికీ తెలంగాణ ఏర్పాటుపై బలమైన ఆకాంక్ష రేకెత్తించింది. 2009 నాటికి తెలంగాణ ఆకాంక్ష ఉద్యమానికి ఊపిరిలూదింది. 2009 డిసెంబర్ 9న ఆనాటి హోంమంత్రి చిదంబరంతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామన్న ప్రకటన ఇప్పించడం ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావానికి దోహదం చేసిన ఒక కీలక ఘట్టం. ఆనాటి నుంచి ఆకాంక్ష మరింత బలపడింది, సజీవంగా నిలబడింది. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసి 2014 జూన్ 2న రాష్ట్రాన్ని తెలంగాణ ప్రజలకు అందించే క్రమంలో జరిగిన పరిణామాలన్నీ సోనియాగాంధీ తెలంగాణకు అనుకూలంగా ఉన్నారనడానికి నిదర్శనం. సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా, యూపీఏ చైర్‌పర్సన్‌గా లేకుండా ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేదా? తెలంగాణ ఏర్పాటన్నది తేనెతుట్టెను కదిపినట్టేనని, ఇప్పుడా అంశాన్ని ముట్టుకుంటే దేశంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనేక డిమాండ్లు వస్తాయంటూ రాజకీయ ఒత్తిడులెన్నో తెచ్చారు. కానీ, తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియా తన మాటపై నిలబడ్డారు.

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షల పట్ల సోనియాగాంధీ అవలంబించిన సానుకూల వైఖరి ఎంతో ఉన్నతమైనది. ప్రజాస్వామ్యం, మానవతా విలువల పట్ల ఆమెకున్న సద్భావన తెలంగాణ ప్రజల ఆశలను, ఆకాంక్షలను గౌరవించే విధంగా చేయగలిగాయి. ఆమె స్థానంలో మరెవరున్నా అప్పటి పరిస్థితులను ఎదురించి ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోగలిగేవాళ్లు కాదు. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. ప్రజల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల, ఆయా అంశాల పట్ల ఆమెకు గౌరవం ఉన్నదనడానికి 2004 నుంచి 2014 వరకు ఆమె నాయకత్వంలో సాగిన యూపీఏ ప్రభుత్వ విధానాలే తార్కాణం. సంక్షేమ పాలనను సాగించడానికి, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడానికి కంటితుడుపు మాటలు, జీవం లేని విధానాలు కాకుండా రాజ్యాంగపరంగా ఉన్న అవకాశాలన్నీ ఉపయోగించుకొని చట్టాలను రూపొందించిన ఘనత సోనియాదే.

తెలంగాణకు అనుకూలంగా 2001లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ఆమోదించడం నుంచి 2009 డిసెంబర్ 9న ప్రకటన చేయించే వరకు అనేక ఒత్తిడులు ఎదురైనప్పటికీ సోనియాగాంధీ మాటమీద నిలబడ్డారు. 2010లో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడం, 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయడం, ఆ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత 2012లో కేంద్ర హోం మంత్రి సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో మళ్లీ అఖిలపక్ష సమావేశం జరపడం, ఆ తర్వాత 2013 జులై 30 సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేయించి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు తీర్మానం చేయించడం వంటి పరిణామాలన్నీ సోనియా గాంధీ తెలంగాణకు సానుకూలంగా ఉన్న కారణంగానే జరిగాయన్నది జగద్విదితం. ఒక రాష్ట్రం ఇస్తే మరో రాష్ట్రంలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆనాడు సమైక్యవాదులు హెచ్చరిస్తున్నప్పటికీ, రాజకీయ కోణంలో కాకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షవైపు సోనియాగాంధీ మొగ్గడంతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.

ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకోవడంలో సోనియాగాంధీ ముందుంటారన్నది చాలా విషయాల్లో రుజువైంది. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం, ఆదివాసుల అటవీ హక్కుల చట్టం, విద్యా హక్కు చట్టం, జాతీయ ఆహార భద్రతా చట్టం, భూమి స్వాధీన సవరణ చట్టం, గృహ హింస చట్టం, వీధి వ్యాపారుల రక్షణ చట్టం, సామాజిక భద్రతా చట్టం, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం లాంటివి తీసుకొచ్చి సంక్షేమ, ప్రజాస్వామ్య విలువలను మరింత సుసంపన్నం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో కేవలం పదేళ్లలో ఇన్ని రకాల ప్రగతిశీల చట్టాలను తీసుకురావడం సోనియాగాంధీ ప్రజాస్వామ్య భావనలకు నిదర్శనం. ఇందిరాగాంధీ తరువాత పేదల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి చట్టాలు తీసుకురావడం సోనియాగాంధీ తప్ప మరెవరూ చేయలేకపోయారు. సోనియా తెచ్చిన చట్టాలు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అమలుకు సాక్ష్యాలు. ఆమెకు రాజ్యాంగమే మార్గదర్శి. రాజ్యాంగాన్ని మనసా, వాచా, కర్మణా అమలు చేసిన నాయకురాలు సోనియా. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయటంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను ఆయుధంగా వాడుకున్నారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే నూతన అధ్యాయాన్ని సృష్టించారు. 2014 ఫిబ్రవరి 2న గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లుపై ముందుకెళ్లాలని తీర్మానించింది. 7వ తేదీన కేంద్ర మంత్రిమండలి బిల్లుకు ఆమోదముద్ర వేసింది. 18న మళ్లీ లోక్‌సభ, 20న రాజ్యసభ ఆమోదం పొందింది. పునర్విభజన చట్టానికి 2014 మార్చి 1న రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో భారతావనిలో జూన్ 2న 29వ రాష్ట్రంగా ప్రత్యేక తెలంగాణ ఆవిష్కృతమైంది. రాజకీయ ఆటుపోట్లను లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమం అన్నిదశల్లోనూ సోనియాగాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షవైపు నిలబడటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

> 2009 డిసెంబర్ 9న ఆనాటి హోంమంత్రి చిదంబరంతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామన్న ప్రకటన ఇప్పించడం ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావానికి దోహదం చేసిన ఒక కీలక ఘట్టం. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసి 2014 జూన్ 2న రాష్ట్రాన్ని తెలంగాణ ప్రజలకు అందించే క్రమంలో జరిగిన పరిణామాలన్నీ సోనియాగాంధీ తెలంగాణకు అనుకూలంగా ఉన్నారనడానికి నిదర్శనం. సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా, యూపీఏ చైర్‌పర్సన్‌గా లేకుండా ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేదా?



■ బోరెడ్డి అయోధ్య రెడ్డి
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్‌ఓ



తిరగబడ్డ.. పోరుగడ్డ!

తెలంగాణ ఉద్యమంలో 'వరంగల్' కీలక పాత్ర



రైల్‌రోకోలో పాల్గొన్న ఉద్యమకారులు

లాఠీ దెబ్బలు, తూటాలను సైతం లెక్కచేయని మొండితనం.. ప్రాణత్యాగాలను సైతం లెక్కచేయని స్వరాష్ట్ర ఆకాంక్ష.. ఆంధ్రా పాలకుల చేతుల్లో నలుగుతున్న తల్లి తెలంగాణకు విముక్తి కల్పించాలన్న ధృఢ సంకల్పం.. విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో సాగిన పోరు.. ఎగిసేటి సంద్రంలా.. దూకే కెరటంలా సాగిన మహోన్నత పోరాటం.. స్వరాష్ట్ర సాధనతోనే తమ బతుకులు బాగుపడుతాయన్న నమ్మకం.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఏకైక ఎజెండాగా సాగిన గొప్ప పోరాటం. చినుకు చినుకు కలిసి మహాసంద్రంగా మారినట్లుగా పిడికెడు మందితో ప్రారంభమైన ఉద్యమం.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజా పోరాటంగా రూపుదిద్దుకుంది. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అద్వితీయమైన పాత్రను పోషించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఎన్నో కీలక ఘట్టాలు, భారీ బహిరంగ సభలు, సదస్సులు వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగాయి. ఉద్యమం సందర్భంగా తీసుకున్న ప్రతీ కీలక నిర్ణయం, ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి వరంగల్ వేదికగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ఎలుగెత్తుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభలకు ఓరుగల్లే వేదికైంది. తెలంగాణలోని అన్ని జిల్లాల కన్నా మిన్నగా వరంగల్ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాటి పోరాట గురుతులు, అమరుల ఆత్మబలిదానాలు, పలు కీలక ఘట్టాలపై ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం: 43.0°C
కనిష్ఠం: 30.0°C







'అవతరణ' కాంతులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సందర్భంగా శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. అమరవీరుల స్థూపంతోపాటు ఎన్పీడీసీఎల్ భవనాన్ని సుందరంగా అలంకరించారు. కాగా, ఆదివారం జరిగే అవతరణ వేడుకల్లో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ముందుగా అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పిస్తారు.

- హనుమకొండ కలెక్టరేట్







నకిలీ విత్తనాల విక్రయదారుల అరెస్టు

- రెండు చోట్ల పట్టుబడిన రూ.10లక్షల విలువైన నకిలీ విత్తనాలు
- 122 లీటర్ల నిషేధిత గడ్డి మందు స్వాధీనం : సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం, జూన్ 1: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం మండలంలో రెండు ప్రాంతాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాలోని సభ్యుడితో పాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరో నిందితుడిని టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులు కలిసి అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల్లో రూ.10లక్షల విలువైన 310 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1లక్ష పదివేల విలువైన 122 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

సంగెం మండలం గాంధీనగర్‌కు చెందిన కొడూరి శ్రీనివాస్‌రావు తన బంధువైన సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన నగా మల్లేశ్వర్‌రావుతో కలిసి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన ఏటుకూరి సుబ్బారావు వద్ద నకిలీ పత్తి విత్తనాలు, గడ్డిమందు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. రైతులకు మాయ మాటలు చెప్పి శ్రీనివాస్‌రావు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు శనివారం దాడి చేసి నకిలీ పత్తి విత్తనాలు, గడ్డిమందు స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకున్నారు. మరో సంఘటనలో సంగెం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెంతుల రాజేష్, ప్రభుత్వం నిషేధించిన గడ్డిమందు ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీ చేసి గడ్డిమందు స్వాధీనం చేసుకుని రాజేష్‌ను అరెస్టు చేశారు.

ఈ రెండు సంఘటనల్లో రూ.10లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు, 122 లీటర్ల నిషేధిత గడ్డిమందు స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న శ్రీనివాస్‌రావు, రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు మల్లేశ్వర్‌రావు, సుబ్బారావు పరారీలో ఉన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ హెచ్చరించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ పెడతామన్నారు. కాగా, ఈ రెండు సంఘటనల్లో ప్రతిభ కనబరిచిన ట్రెయినీ ఐపీఎస్ శుభంనాగ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐలు సార్ల రాజు, ఎస్.రవికుమార్, ఎస్ఐలు నరేష్, ఏఏవో సల్మాన్ పాషా, వ్యవసాయ అధికారి యాకయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఏఎస్ఐ ఉప్పలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, శ్రీనాథ్, మాధవరెడ్డి, కానిస్టేబుళ్లు రాజేష్, బిక్షపతి, సురేష్, సాంబరాజు, నరేష్, కిరణ్, శ్రావణ్, సతీష్, శ్రీనివాస్, నాగరాజులను కమిషనర్ అభినందించారు.



నకిలీ పత్తివిత్తనాలు పట్టుకున్న పోలీస్ అధికారులతో సీపీ





బడిబాటకు వేళాయే..

- రేపటి నుంచి 15 రోజుల పాటు కార్యక్రమం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం తెచ్చేందుకు ప్రభుత్వం రూపొందించిన బడిబాట కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. శనివారం అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమ సన్నాహక సమావేశాలు జరిగాయి. సంబంధిత ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఈ సన్నాహక సమావేశాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. బడిబాట బడిబాట ప్రణాళికను వారికి సంబంధిత ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ నెల 3 నుంచి ప్రారంభమై 19న ముగియనున్నది. సోమవారం నుంచి 15 రోజుల పాటు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. యేటా ఎస్ఎంసీ కమిటీలు బడిబాట కార్యక్రమంలో పాల్గొనగా ఈ ఏడాది మాత్రం ఆదర్శ అమ్మ పాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆవాస

మిగతా 6వ పేజీలో..

ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 1: బల్దియా పరిధిలో చేపట్టిన పనులలో నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. నగరంలోని సరేంద్రపురికాలనీ, 100 ఫీట్ల రోడ్డు, వడ్డెపల్లి ప్రాంతాల్లో శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టారా? అని కొలతలు కలిపించి మరీ పరిశీలించారు. ఈ సందర్భం కమిషనర్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఏఈలు మాత్రమే సంబంధిత పనులకు రికార్డులు చేయాలని ఆదేశించారు. అనంతరం పోచమ్మకుంటలో టౌన్‌ప్లానింగ్ అనుమతులకు సంబంధించి అక్యుపెన్సీ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న గృహనిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజయ్య, డీఈ విజయ్‌కుమార్, ఏఈలు హరికుమార్, మేనకతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయి..

హనుమకొండ టౌన్, జూన్1: ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు గతం కన్నా చాలా తగ్గాయని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పడకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా ఉన్న 2,804 ట్రాన్స్‌ఫార్మర్లను డిసెంబర్ 2023 నుంచి మే 2024 వరకు 3,335 వరకు పెంచి అదనంగా 531 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తెలుసుకునేందుకు టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ తగ్గిందన్నారు. 25 శాతం ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, 23 శాతం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయన్నారు. ఫలితంగా వినియోగదారులకు అంతరాయాలు కనిష్ఠస్థాయికి తీసుకురాగలిగామన్నారు. తద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో మార్చి 8న 15,623 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు నమోదైందన్నారు. వైఫల్యాలు తగ్గడం వల్ల విద్యుత్ డిమాండ్ తారాస్థాయికి చేరిందన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్ట లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు.. భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తిరగబడ్డ పోరుగడ్డ

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ఉద్యమం నుంచే వరంగల్ ప్రజలు పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుతో ఇటు ఉద్యమాలు, అటు రాజకీయాలతో రెండు రకాలుగా తెలంగాణ పోరాటం బలపడింది. తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శనంలో ఉద్యమం ముందుకు సాగడంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ముందు వరుసలో నిలిచారు. ఉద్యమసందర్భంగా నిర్వహించిన పలు సదస్సుల, భారీ బహిరంగ సభలు, ర్యాలీల్లో వేలాదిగా పాల్గొన్నారు. జై తెలంగాణ అంటూ.. పిడికిలి బిగించి నినదించారు.

ఆ మూడు సభలు

ఓరుగల్లు కేంద్రంగా ప్రధానంగా మూడు సభలు తెలంగాణ ఉద్యమాన్ని కొత్త మలుపు తిప్పాయి. 2003 ఏప్రిల్ 27న వరంగల్ జైత్ర యాత్ర పేరిట నిర్వహించిన సభకు 17 లక్షల మంది హాజరయ్యారు. ఆదే సంవత్సరం డిసెంబర్ 5న జనగామలో ఓరుగల్లు వీర గర్జన పేరుతో మరో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత 2007లో తెలంగాణ విశ్వరూప సభ భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సభకు పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. 2010 డిసెంబర్ 16న హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డి పేటలో మహాగర్జన పేరుతో నిర్వహించిన ఘర్జన సభకు 25 లక్షల మంది హాజరయ్యారు. ఈ సభ గిన్నిస్‌బుక్ రికార్డులకెక్కింది. తెలంగాణ ఉద్యమాన్ని సరికొత్త మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష అరెస్టు ఘట్టంలోనూ వరంగల్ జిల్లా ప్రజలు కీలక భూమిక పోషించారు. కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లతో ఉమ్మడి జిల్లా అట్టుడికింది. కేసీఆర్ ఆమరణ దీక్ష జరిగినకాలంలో జిల్లా వివిధ చోట్ల ఉద్యమ ఉద్వేగంతో ఏడుగురు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.

ఉద్యమంలో కేయూ

తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రియాశీల పాత్రను పోషించారు. 2010 ఫిబ్రవరి 7న కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పొలికేక పేరుతో పెద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాలయాల నుంచి లక్ష మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సభకు అఖిల భారత ఆర్య సమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్, కె.జయశంకర్, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరయ్యారు. హనుమకొండ కేంద్రంగా సాగిన అనేక ఉద్యమాల్లో వివిధ విద్యార్థి సంఘాలు ముందు నిలిచాయి. 14 విద్యార్థి సంఘాలు సంఘటితంగా ఈ సదస్సును భారీ ఎత్తున నిర్వహించాయి. రాయిని గూడెంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సభలో జై తెలంగాణ అంటూ నినదించడం ద్వారా విద్యార్థులు తమ ఉద్యమ కాంక్షను ఎలుగెత్తిచాటారు. రాళ్ల రువ్వి నిరసన తెలిపారు.

జేఏసీ కీలక భూమిక

తెలంగాణ విషయంలో రాజకీయ పక్షాలు దోబూచులాడుతుండడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి 2009 డిసెంబర్ 24న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు కావడంలో వరంగల్ జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులే కీలక పాత్ర పోషించారు. ఆటపాట, వంటావార్పు తదితర అనేక రూపాల్లో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రతీ పల్లే, ప్రతీ పట్టణం పోరుబాట పట్టింది. బతుకమ్మ ఆటలతో ఊగిపోయింది.

వంటవార్పు, ధూం ధాంలు..

తెలంగాణ ఉద్యమంలో ప్రజలు తమ సంఘటిత శక్తిని చాటడానికి చేపట్టిన అనేక ఆందోళన రూపాల్లో వంటా వార్పు ఒకటి. ప్రజలంతా రోడ్లమీదికి వచ్చి ప్రధాన రోడ్లు, జంక్షన్లలో రోడ్లపైనే వంటలు చేశారు. అక్కడే కూర్చొని బంతి భోజనం చేశారు. వంటావార్పు కార్యక్రమంలో మహిళలు రోడ్లపై బతుకమ్మలు ఆడారు. ప్రజలు కళాప్రదర్శనలు ఇచ్చారు. ఉద్యమ కాలంలో పౌరుషాగ్నిని రగిలించే ఆటపాటలతో నిర్వహించిన మరో ఆందోళన కళారూపం ధూం ధాం. ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చిన ధూం ధాం నిర్వహణలోనూ ఉమ్మడి వరంగల్ ముందు భాగాన నిలిచింది. వరంగల్‌కు చెందిన అనేక మంది జానపద కళాకారులు, గాయకులు, కవులు తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వేత్తున ఉరికించారు.

బలిదానాలు

ఉద్యమమే ఊపిరిగా బతికిన ఉద్యమకారులెందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారు. పరుగెత్తుతున్న రైళ్లకు ఎదురెళ్లి జై తెలంగాణ అంటూ ఆత్మార్పణలకు పాల్పడ్డారు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని తమను తాము ఆత్మాహుతి చేసుకున్నారు. 1969 ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 119 మంది బలైతే మలి ఉద్యమంలో 362 మంది ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అప్పటి ఉమ్మడి పది జిల్లాల్లో మొత్తం 1,250 మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే అందులో ఎక్కువమంది ఉమ్మడి వరంగల్ జిల్లావారే ఉన్నారు. ఎందరో వీరుల పోరాటం, మరెందరో అమర వీరుల ఆత్మబలిదానాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

మానుకోట ఘటన

మానుకోట ఘటన తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పింది. 2010 మే 28న సమైక్య నినాదంతో ఓదార్పు యాత్రకు వైఎస్ జగన్‌ను బయలు దేరారు. పార్లమెంటులో సమైక్య ప్లకార్డులు ప్రదర్శించిన జగన్ తెలంగాణలో కాలుమోపన్వివమని, అందులో ఓరుగల్లు గడ్డపై అడుగు పెట్టనివ్వమని రాజకీయ జేఏసీతో పాటు, పలు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. జగన్‌ను స్వాగతించేందుకు సమైక్యవాదులు, అడ్డుకునేందుకు తెలంగాణవాదులు చెరోవైపు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మోహరించారు. ఉద్యమకారులను సమైక్యవాదులు రెచ్చగొట్టడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. సమైక్యవాదుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి కంకరరాళ్లనే ఆయుధాలుగా చేసుకొని ప్రతిఘటించారు. తెలంగాణ ఉద్యమకారులు పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురొడ్డి నిలిచారు. మానుకోట రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున గుమిగూడిన జనం జగన్ తోపాటు ఆయన అనుచరులకు వ్యతిరేకంగా 'జగన్ గోబ్యాక్'.. అంటూ వెయిటింగ్ రూమ్‌లోకి దూసుకు వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్యమకారులపై దాడికి దిగారు. వెంటనే రెండో ప్లాట్‌ఫారమ్ నుంచి ఉద్యమకారులు రాళ్లతో దాడి చేశారు. పోలీసులు కాల్పులు జరగపడంతో 15 మంది, రాళ్ల దెబ్బలకు మరో 25మంది గాయపడ్డారు. రైల్వేస్టేషన్ రణరంగంగా మారింది. ఆ తర్వాత కాలంలో ఈ ఘటనే తెలంగాణ ఉద్యమానికి మరింత స్ఫూర్తిగా నిలిచింది.

మూతబడులను తెరిపించాలి

వరంగల్‌ఎడ్యుకేషన్, జూన్ 1: మూతబడిన బడులను తెరిపించి, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.రఘుపతి, జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన బడిబాటలో మూతబడులను తెరిపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పాఠశాలను ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రులను కలిసిన డీసీసీబీ చైర్మన్

హనుమకొండ సిటీ, జూన్ 1 : మంత్రులు సీతక్క, కొండా సురేఖతోపాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులను డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం హైదరాబాద్‌లో వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. మంత్రులకు బ్యాంకు మెమొంటోస్ అందజేశారు.

నేడు బల్దియాలో రాష్ట్ర అవతరణ వేడుకలు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 1: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి హాజరై జెండా ఆవిష్కరిస్తారని వెల్లడించారు. ఉదయం పండుగ వాతావరణంలో జరిగే కార్యక్రమానికి బల్దియా ఉద్యోగులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

నిట్‌లో ఫ్యాకల్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్

వరంగల్ ఎడ్యుకేషన్ జూన్ 1 : నిట్‌లో విద్యా సంవత్సరం-2024కు సంబంధించి ఫ్యాకల్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. శనివారం బోస్ సెమినార్ హాల్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, భువనేశ్వర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులిచ్చే సూచనలతో బోధన పటిమను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గోవా ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.ధీరేంద్ర కట్టి, హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్. మూర్తి, ఇండోర్ ఐఐటీ రిజిస్ట్రార్ సిబాప్రసాద్‌హోటా, చండీగడ్ నిట్ ప్రొఫెసర్ మైత్రీ దత్త, నిట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వేణు వినోద్ పాల్గొన్నారు.

కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకునేది లేదు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 1 : తెలంగాణ అధికారిక ముద్ర నుంచి కాకతీయల కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం కేయూ ఫస్ట్ గేట్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ... ప్రభుత్వం పిచ్చి చర్యలు చేపడితే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. యూనివర్సిటీ వేదికగా మరో ఉద్యమాన్ని లేవనెత్తుతున్నామన్నారు. ఆందోళన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్వీ నాయకులకు తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఎస్.సూర్యకిరణ్ కోఆర్డినేటర్లు రాకేష్‌యాదవ్, నాగరాజు, కె.సుమన్, జి.వీరస్వామి, అనిల్, కళ్యాణ్, ప్రకాశ్, రాకేష్, సేహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యాలతో జీవితంలో స్థిరపడాలి

▸▸ ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

హసన్‌పర్తి, జూన్ 1: ఉన్నతమైన లక్ష్యాలతో జీవితంలో స్థిరపడాలని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి విద్యార్థులకు సూచించారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద గల సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్-2024 సక్సెస్ మీట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మొదటి నుంచి ప్రణాళికబద్ధంగా చదువుచూ ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. కళాశాలలో పాఠ్యాప్రణాళిలతో పాటు ప్లేస్‌మెంట్‌కు సంబంధించిన లాజికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ అంశాలపై ప్రణాళికబద్ధంగా శిక్షణను ఇవ్వడం వల్లనే వంద శాతం ప్లేస్‌మెంట్‌ను సాధించినట్లు తెలిపారు. ఉద్యోగాలు చేస్తూ నూతన ఆవిష్కరణలుచేసి సమాజాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్లేస్‌మెంట్ అధికారి మహేశ్ మాట్లాడుతూ.. అసెంచర్, టీసీఎస్, క్యాప్‌జెమిని, జెన్‌ప్యాక్ట్, ఇన్ఫోసిస్, డీఎక్స్‌సీ టెక్నాలజీస్, లెగాటో, పబ్లీసిస్, విప్రో, ఇంటెలిప్యాక్ట్ కంపనీల్లో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి, కాగ్నిజెంట్ టెక్నాలజీ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహేందర్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసానికి తల్లిదండ్రులే మార్గదర్శకులు

హనుమకొండ కల్చరల్, జూన్ 1: విద్యార్థుల మేధో వికాసానికి బాల్యంలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు వారికి తర్ఫీదునిస్తారని అహోబిల రామానుజజీయర్ స్వామి ఉద్బోధించారు. నెల రోజులపాటు హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్‌హాలులో శనివారం జరిగిన ప్రజ్ఞా వేసవి శిబిర ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి వారి ప్రోత్సాహంతో వికాస తరంగిణి శాఖలు వేసవి శిబిరాలను ఏర్పాటు చేశాయన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో 120మంది విద్యార్థులు శ్రద్ధాసక్తులతో పాల్గొనడం అభినందనీయమంటూ నిర్వాహకులను ప్రశంసించారు. వీరికి యోగా, భగవద్గీత శ్లోకాలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, నీతికథలు, ధ్యానం తదితర అంశాల్లో నిష్ణాతులు అయిన అధ్యాపకులచే శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్వామిజీ చేతులమీదుగా ప్రశంసాపత్రాలను బహూకరించారు. వికాస తరంగిణి ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాశిబిర కో ఆర్డినేటర్ తనూజారెడ్డి, పోశాల శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, సూత్రపు అభిషేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలలపై ఆన్‌లైన్ లైంగిక దాడులను నిర్మూలిద్దాం

సుబేదారి, జూన్ 1 : బాలల పట్ల ఆన్‌లైన్‌లో జరుగుతున్న లైంగిక దాడులను నిర్మూలిద్దామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పూజారుల వర్కింగ్ ప్రెసిడెంట్ కారంపూడి కృష్ణమూర్తి సిద్ధాంతి ఆచార్యులు అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ అధ్యక్షతన వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలకు సంబంధించిన పూజారులకు, ముస్లిం కాజీలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు శనివారం సుబేదారిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ బాలల పట్ల జరుగుతున్న హింసను, వివిధ రకాల నేరాలను ఎలా నిరోధించాలనే విషయంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో తెలిపారు. కార్యక్రమంలో పరకాల కాజీ అజీజుద్దీన్, కాజీ అబ్దుల్లా ఖానాపూర్, మహబూబాబాద్ కాజీ అక్రంతో పాటు ఎఫ్ఎంఎ సాంఘీక సేవా సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఇసంపెల్లి సుదర్శన్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పాలపై అవగాహన

హనుమకొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హనుమకొండలోని విజయ డైరీ ఆవరణలో వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల పాల నాణ్యతపై టెస్‌చెక్‌ను, అలాగే వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లో పాలను మొబైల్ వ్యాన్ అనలిస్టు నాణ్యతా పరీక్షలు జరిపారు. ఈ క్రమంలో విజయ డైరీ పాల ప్యాకెట్ పోలిన మరో రెండు ప్రైవేటు పాల డైరీల ప్యాకెట్లను గుర్తించారు. దీనివల్ల విజయడైరీ మార్కెట్ తగ్గుతున్నదని, వినియోగదారులు కూడా విజయ డైరీ పాలు అనుకొని నకిలీ పాలను కొని మోసపోతున్నారని తేల్చారు. ఈ విషయమై వినియోగదారుల మండలి ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. కల్తీ పాల వల్ల మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నదన్నారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ.. ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆహార కల్తీ తనిఖీలు చేసేప్పుడు వినియోగదారుల ప్రతినిధులను ఆహ్వానించినట్లయితే అసలు సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ మాట్లాడుతూ.. శనివారం నుంచి పదిహేను రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా టెస్ట్‌చెక్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ జి.ప్రదీప్, హైదరాబాద్ విజయడైరీ అధికారి రాజ్‌కుమార్, మొబైల్ ల్యాబ్ అనలిస్టు రాజేష్, వినియోగదారుల మండలి కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, నల్లా రాజేందర్, ఎర్ర అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి

హనుమకొండ కల్చరల్, జూన్ 1: వైశాఖ మాస బహుళ దశమి శనివారం నగరంలో హనుమాన్ జయంతి, హనుమాన్ జన్మదిన ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నగరంలోని అనేక హనుమాన్ ఆలయాలకు భక్తులు బారులుదీరారు. ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పరశురాం దళ్ నాయకులు ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రను శనివారం రాత్రి వేయిస్తంభాల ఆలయం వద్ద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జెండాఊపి ప్రారంభించారు. అంతకుముందు ఆలయం ప్రాంగణంలో రుద్ర హనుమంతుడికి క్షేత్ర పాలకులైన హనుమంతుడికి సుప్రభాత సేవ, నవగ్రహారాధన, కలశస్థాపన నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

హనుమకొండ అదాలత్ సమీపంలోని వెంకటేశ్వరాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేశికన్ స్వామి, వంశీకృష్ణల ఆధ్వర్యంలో హనుమాన్ చాలిసా పారాయణం నిర్వహించారు. టీటీడీ హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలునిర్వహించినట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు. ములుగు రోడ్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో కూడా హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ వైవి.వామన్‌రావుతో పాటు ఆలయ ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ సమీపంలోని హనుమాన్ మందిరంలో, ఏకశిలపార్కు సమీపంలోని సీతారామ ఆలయంలో, రెవెన్యూ రామాలయంలో, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. నగరవాసులు భక్తిశ్రద్ధలతో అంజన్నకు ప్రణమిల్లారు.

• వడ్డేపల్లి : హనుమకొండలోని వివిధ డివిజన్లలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నేత్రపర్వంగా జరిగాయి. దేవాలయాల్లో ఆంజనేయ స్వామికి భక్తులు హోమాలు నిర్వహించి అన్నదానాలను చేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ - రేవతి దంపతులు ఆంజనేయ స్వామికి హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మణికొండ వామన్‌కుమార్ శర్మ, ఆలయ చైర్మన్ కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని మహాలక్ష్మి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్ ఆధ్వర్యంలో, జవహర్ కాలనీలో కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాంగ్రెస్ సీనియర్ నేత చింత రమేష్‌గౌడ్, బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తిప్రపత్తులతో అంజన్నను కొలిచారు.

• న్యూశాయంపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని 31వ డివిజన్ న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివనందిశాస్త్రి, మహానంది శాస్త్రిల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం 41, 21, 11 రోజుల హనుమాన్ మాల వేసుకున్న హనుమాన్ స్వాములకు ఇరుముడి కట్టారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్లు వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శివశంకర్, వెనుకంటి సారంగపాణి, బీఆర్ఎస్ 31వ డివిజన్ మాజీ అధ్యక్షులు వేల్పుల వేణుగోపాల్, బీజేపీ మాజీ డివిజన్ అధ్యక్షుడు పెరుగు సురేష్ భక్తాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తాంజనేయస్వామి దేవాలయం కుటీరం స్వాములు సుమారు 2వేల మందికి అన్నదానం చేశారు.

హనుమకొండ పద్మాక్షికాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ఈ సందర్భంగా స్వాములచే అభిషేకం చేసి చందన సేవ, అలంకరణ, అర్చనలు చేశారు. మహాపూర్ణాహుతి, ధ్వజారోహణ వేద పండితులైన ఆరుట్ల రామాచార్యులు భాస్కరాచార్యులచే నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములకు అన్నదానం చేశారు. అనంతరం మాలవిరమణ చేసే స్వాములకు ఇరుముడి కట్టారు.

• కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో కొలువై ఉన్న ఆంజనేయునికి విశేష పంచామృత, పంచవర్ణ, పానక ఏకధారాభిషేకాలు చేశారు. దేవాలయ చేర్మన్ అయినవోలు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఐనవలు సాయికృష్ణశర్మ దేవాలయ అర్చకులు మనోజ్ త్రిపాఠి, హరికృష్ణ స్వామి అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీరామ భజన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి విచ్చేసిన భక్తులు స్వామి వారిని ఆరాధించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్వేతార్క గణపతి దేవాలయంలో శనివారం 108 రోజుల గణపతి దీక్షను భక్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వరశర్మ దీక్ష వివరాలు తెలిపారు.. ఆగస్టు 6న 41 రోజుల మండల దీక్ష, 26న 21రోజుల అర్ధమండల దీక్ష, 31వ తేదీన 11 రోజుల ఏకాదశ దీక్ష, సెప్టెంబరు 6న 11 రోజుల ఏకాదశ దీక్ష, సెప్టెంబరు 18న దీక్ష విరమణ ఉంటుందని తెలిపారు.



హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వడ్డేపల్లి సీతారామాంజనేయ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు



కాజీపేట శ్వేతార్క దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొండగట్టుకు వెళుతున్న స్వాములతో న్యూశాయంపేటలోని భక్తాంజనేయస్వామి కుటీరం స్వాములు, కమిటీ నాయకులు

7 నుంచి ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 1 : కేయూలోని ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే 8వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 11 నుంచి, పదో సెమిస్టర్ 10వ సెమిస్టర్ 7వ తేదీ నుంచి జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు వివిధ పరీక్షల టైంటేబుల్‌ను అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సౌజన్యతో కలిసి ఆయన విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ ఎన్నిక

హనుమకొండ కల్చరల్, జూన్ 1 : ఉమ్మడి వరంగల్ జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అలుగోజు కృష్ణమూర్తి నియమితులయ్యారు. శనివారం హనుమకొండలోని ఓ ఫంక్షన్‌హాలులో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీణవంక సదానందం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. సంఘం ఏర్పాటు కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా అలుగోజు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రాళ్లబండి వీరాచారి, కోశాధికారిగా వేంనూరి సోమేశ్వరాచారి, గౌరవ అధ్యక్షుడిగా వీణవంక సదానందం, చొల్లేటి కృష్ణమాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కత్రోజు లింగాచారి, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, బ్రహ్మచారి, సహాయ కార్యదర్శులుగా సంతోష్, రాజేష్, సహాయ కోశాధికారిగా రామకృష్ణ, మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీజ్ చేసిన వాహనాలకు లోక్ అదాలత్

కాజీపేట, జూన్ 1 : కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీజ్ అయిన వాహనాలకు ఈ నెల 3నుంచి 8వ తేదీ వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.నాగబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు కాని, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో వాహనాలు సీజ్ చేసినట్లయితే లోక్ అదాలత్‌లో హాజరై పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో హాజరయ్యే వారు ఆధార్ కార్డు జిరాక్స్, వెహికిల్ పత్రాలు, మైనర్ డ్రైవింగ్ కేసులో ఉన్నవారు బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మెమో తీసుకుని వచ్చి కేసులు క్లోజ్ చేసుకోవచ్చని తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

▸▸ బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 1 : బల్దియా పరిధిలో పలు ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లుగా నియమించబడిన సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషన్ అనిసుర్ రషీద్ సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సిబ్బంది విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా 66 డివిజన్‌లలో వార్డు ఆఫీసర్లను నియమించామన్నారు. డివిజన్ల స్థాయిలో స్థానిక కార్పొరేటర్‌లను సమన్వయం చేసుకుని ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రాష్ట్ర మున్సిపల్ చట్టం 2019 ప్రకారం వీఆర్‌ఏ, వీఆర్‌వోలను బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లుగా నియమించినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు జాబ్‌చాట్‌పై అవగాహన పెంచుకుని శానిటేషన్, నీటిసరఫరా, పెన్షన్, పన్నుల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆర్ఐలతో సమన్వయం చేసుకుని పన్నుల వసూళ్ల టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, కృష్ణారెడ్డి, ఆర్‌వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

జిమ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

వరంగల్ కార్పొరేషన్ : గ్రేటర్ వరంగల్ కార్యాలయంలోని ఇండోర్ స్టేడియంలోని జిమ్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' మినీలో 'ఉత్సవ విగ్రహంలా ఇండోర్ స్టేడియం' అనే కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు శనివారం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అధికారులతో కలిసి ఇండోర్ స్టేడియంను క్షేత్రస్థాయిలో సందర్శించారు. జిమ్‌లో తప్పుపడుతున్న సామగ్రిని మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎస్ఎఫ్‌వో దయానంద్, బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్ పాల్గొన్నారు.



జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారు..

▸▸ న్యాయం చేయాలని సీఎండీకి లైన్‌మన్ వేడుకోలు

హనుమకొండ టౌన్, జూన్ 1 : యూనియన్ ముసుగులో ఇద్దరు వ్యక్తులు తనను మోసం చేసి ఉద్యోగం పోగొట్టి రోడ్డున పడేశారని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని హుజూరాబాద్ డివిజన్ సైదాపూర్ సెక్షన్ లైన్‌మెన్ ఆర్.సంపతి సీఎండీ వరుణ్‌రెడ్డిని వేడుకుంటున్నారు. బాధితుడి కథనం ప్రకారం.. కరీంనగర్ సర్కిల్ సైదాపూర్ సెక్షన్‌లో సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.సంపతిని 1104 సంఘానికి చెందిన చెలమల్ల సైదాపూర్ ఎస్ఎల్ఐ తిరుపతిరెడ్డి, భీమదేవరపల్లి జేఏవో షకీల్ కలిశారు. నీ కొడుకుకు ఇప్పిస్తామని నమ్మించి రూ.4లక్షలు తీసుకొని కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. ఇక నుంచి డ్యూటీకి వెళ్లాల్సిన అవసరం లేదని నమ్మబలికారు. ఇలా 2014 నుంచి 2023 వరకు 9 యేళ్లు గడిచిన తర్వాత సర్వీస్ ఫర్ రిమూవల్ అంటూ సంపతి ఇంటికి లెటర్‌వచ్చింది. ఇదేంటని షకీల్, తిరుపతిని అడిగితే మేము చూసుకుంటామని దాటేశారు. ఒకరోజు ఎస్ఈ కార్యాలయానికి సంపతిని తీసుకెళ్లి ఫైల్ చూపించారు. తన కొడుకుకు ఫైల్ చూపించాలనడంతో తప్పించుకొనితిరిగారు.

కొన్ని రోజులకు తన కొడుకు సర్కిల్ ఆఫీస్‌కు వెళ్లి ఆరా తీయగా మీకు సంబంధించిన ఫైల్ లేదని ఎస్ఈ చెప్పారన్నారు. అప్పటి సీఎండీ గోపాల్‌రావుకు ఫిర్యాదుచేయగా సీజీఎం రవీంద్రనాథ్, జీఎం మల్లిఖార్జున్ విచారణ చేశారన్నారు. ఇద్దరి మోసంవల్ల వృద్ధాప్య జీవితాన్ని దయనీయమైన స్థితిలో గడుపుతున్నానని, దంపతులిద్దరం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నామని, న్యాయం చేయాలని సీఎండీని వేడుకున్నాడు. అయితే ఏప్రిల్ 6న సీఎండీకి ఇదే విషయంపై ఫిర్యాదు చేశారనని, ఇప్పటికి వరకు ఎలాంటి స్పందన లేదని బాధితుడు వాపోతున్నాడు.

బీఆర్ఎస్ పాలనలో కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదు

బాలసముద్రం, జూన్ 1 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని, చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఏఐటీయూసీ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణిలు అన్నారు. హనుమకొండలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జిల్లా ఆఫీస్‌బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ.. కార్మికులను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాలు జీవోలను అమలు చేయాలని, సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జక్కు రాజు, ఆఫీస్ బేరర్స్ రమ, రాజేష్‌ఖన్నా, బత్తిని సదానందం, మద్దెల ఎల్లేష్, కర్నె లక్ష్మణ్, మాలోతు శంకర్‌నాయక్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.

ఎంజీఎంలో కలెక్టర్ ప్రావీణ్యకు చికిత్స

వరంగల్ మెడికల్, జూన్ 1: పేదల ఆస్పత్రి ఎంజీఎంలో వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య చికిత్స పొందారు. శనివారం ఉదయం కలెక్టర్ ప్రావీణ్య ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలోని హోమియో విభాగానికి చికిత్స నిమిత్తం వచ్చారు. హోమియో వైద్యురాలు డాక్టర్ పద్మ కలెక్టర్ నుంచి వివరాలు సేకరించి అవసరమైన గుళికల రూపంలో మందులను అందజేశారు. హోమియో వైద్య విభాగం చికిత్సలో రోగ నిరోధక శాతం ఎక్కువగా ఉండటంతో కలెక్టర్ ప్రావీణ్య హోమియో చికిత్స పొందారని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాక్షాత్తు కలెక్టర్ ప్రావీణ్య ఎంజీఎంలో చికిత్స పొంది ఆదర్శంగా నిలిచారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉద్దెర ఇవ్వనందుకు వైన్స్‌పై దాడి

వరంగల్ క్రైం, జూన్ 1: మద్యం ఉద్దెర ఇవ్వనందుకు ఇద్దరు వ్యక్తులు వైన్‌షాపును పగులగొట్టినట్లు సంఘటన హనుమకొండ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలో ఉన్న వైన్‌షాపునకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మద్యం ఉద్దెర ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాపులో ఉన్న వ్యక్తి ఉద్దెర ఇచ్చేందుకు ససేమిరా అనడంతో ఆగ్రహించిన ఇద్దరు వ్యక్తులు.. షాపును పగులగొట్టినట్లు సమాచారం. వైన్ షాపు యజమాని స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అధికార పార్టీ నేతతో పైరవీ చేయించుకుని కేసు కాకుండా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

రూ.900 సామానుకు రూ.10వేల లంచం

▸▸ కానిస్టేబుల్ చేతివాటం

వరంగల్ క్రైం, జూన్ 1: మిషన్ భగీరథకు సంబంధించిన రూ.900 విలువైన పైపులు దొంగ నుంచి కొనుగోలు చేసిన ఒక పాత ఇనుప సామాను షాపు నిర్వాహకుడు ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు రూ.10వేలు కానిస్టేబుల్‌కు సమర్పించుకోవాల్సి వచ్చింది. వరంగల్ ప్రాంతంలోని ఒక పోలీస్‌స్టేషన్ పరిధిలో మిషన్ భగీరథ పైపులను దొంగలించిన వ్యక్తి.. అదే ప్రాంతంలోని ఒక పాత ఇనుప సామాను షాపులో రూ.900 విక్రయించాడు. అధికారులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణకు కానిస్టేబుల్‌ను పంపించారు. సదరు కానిస్టేబుల్ ఇనుప సామాను షాపు నిర్వాహకుడిని కేసు నుంచి తప్పించేందుకు రూ.10వేలు డిమాండ్ చేశాడు. పైపులు కొనుగోలు చేసిన పాపానికి కేసు పాలయ్యే అవకాశం ఉన్నందున ఇనుపసామాను నిర్వాహకుడు కానిస్టేబుల్‌కు డబ్బులు సమర్పించుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు కాజేసిన కానిస్టేబుల్.. స్టేషన్ అధికారులను తప్పుదోవపట్టించినట్లు తెలిసింది. వారం కిందట ఈ సంఘటన జరుగగా కానిస్టేబుల్ చేతివాటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బడిబాటకు వేళాయే..

(3వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, విద్యాపరంగా అందుతున్న సౌకర్యాలను వివరించనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని నింపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.

నిర్దేశిత లక్ష్యాలివే..

ఆవాస ప్రాంతంలోని పాఠశాల వయస్సు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలి. బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ విద్యతో పాటు విద్యార్థులకు అందిస్తున్న పథకాలను తల్లిదండ్రులకు వివరించాలి. పాఠశాలల సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల వయస్సుగల పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను గుర్తించి వాటిల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి ప్రవేశాలను గణనీయంగా పెంచాలి. బాలిక విద్యకున్న ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించి బాలికలను పాఠశాలలకు రెగ్యులర్‌గా వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలి. విద్యాహక్కు చట్టంపై తల్లిదండ్రులతో పాటు ఆవాస ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పాఠశాలల్లో జరిగే ప్రతీ సమావేశానికి హాజరయ్యే విధంగా అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ విద్య, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర అంశాలను తల్లిదండ్రుకు తెలియజెప్పాలి.

అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో మణితేజ ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 6, 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా 1800లోపు ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో హనుమకొండ ఎన్జీవోఎస్ కాలనీకి చెందిన కోల మణితేజ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 1504 పాయింట్లతో రాణించి సత్తా చాటాడు. ఆల్ ఇండియా 1800లోపు ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో మొత్తం 9 రౌండ్లకు గాను వరుసగా 5రౌండ్లు ప్రత్యర్థులపై ఎత్తుకు పైఎత్తు వేసి ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుత ప్రతిభతో రాణించి 1504 రేటింగ్ పాయింట్లు సాధించి అందరి మన్ననలు పొందాడు. ప్రస్తుతం మణితేజ హనుమకొండ రాంనగర్‌లోని కమల్ కింగ్స్ చెస్ అకాడమీలో ఆర్బిటర్ రాంప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. చెస్ టోర్నీలో 1504రేటింగ్ పాయింట్లు సాధించిన మణితేజను శనివారం సీనియర్ క్రీడాకారులు, ఆర్బిటర్ రాంప్రసాద్ అభినందించారు.



మణితేజను అభినందిస్తున్న ఆర్బిటర్ రాంప్రసాద్

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ప్రెస్‌క్లబ్ బాధ్యులు

వడ్డేపల్లి, జూన్ 1 : జర్నలిస్టుల సంక్షేమమే తన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన స్పోర్ట్స్ మీట్ - 2024 పోస్టర్‌ను ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తితో పాటు ప్రెస్‌క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల కొవ్వొత్తుల ర్యాలీ

రాంనగర్, జూన్ 1: హనుమకొండలోని అదాలత్ సెంటర్‌లోని అమరవీరులస్థూపం వద్ద కొవ్వొత్తులతో బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు నయీమ్, ఇస్మాయిల్, చాగంటి రమేశ్, సంపత్, రఘు, రఫీక్, యాకూబ్, ఉమర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య కుటుంబ కదంబం ఆదివారం



దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించతగిన గొప్ప ఘట్టం ప్రత్యేక తెలంగాణ పోరాటం. ముక్కోటిగొంతుకలు ఒక్కటై ఆలపించిన ఆ రాగం ఈ నేల అస్తిత్వ పతాకగా ఎగిరింది. ఢిల్లీ పీఠాన్ని కదిలించింది. పెద్దల మనసును కరిగించింది. వందలమంది విద్యార్థుల బలిదానాలు, వేలమంది త్యాగాలు, లక్షలమంది పోరాటాల తదృలితంగా ఆరు దశాబ్దాల కల సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల సమయమిది. ఈ సందర్భంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మమేకమై గొంతుకలిపిన కొంతమంది మహిళలు తమ ఉద్యమ జ్ఞాపకాలను నవ్యతో పంచుకున్నారు.

తెలంగాణ నినాదం మహిళల సామూహిక రాగం

అదే ఆధిపత్య ధోరణి

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో నేను నారాయణగూడ రెడ్డి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తు న్నాను. ఆ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ రావి భారతి, కల్పనా కన్నాబిరాన్ లాంటి వారందరి ఆధ్వర్యం లో కాలేజీలో తెలంగాణ భాషమీద సమావేశాలు, చర్చాకార్యక్రమాలు జరిగాయి. ఆంధ్రా తెలుగే తెలుగా.? తెలంగాణ వాళ్లను కించపరచడంలాంటి వాటి ఆధిపత్య ధోరణులను నిరసిస్తూ చాలా చర్చలు సాగాయి. ఒకసారి కూరగాయల బండి అతను "మీకు తెలుగు వచ్చా రాదనుకున్నానే" అంటూ నాతో హేళనగా మాట్లాడాడు. అంటే, మేము మాట్లాడే తెలుగు తెలుగు కాదన్నది అతని అభిప్రాయమన్నమాట. వీళ్లకు ఎంత అహంకారం అనుకొన్నాను. అలానే లఖనవ్ ఉర్దూకు దక్కనీ ఉర్దూ మాట్లాడేవారి మధ్యా ఇలాంటి చర్చే జరిగేది.



తెలంగాణ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ఏర్పడ్డాక, కార్యక్రమాల్లో నరసింగరావు ఆనందరావు, వసంత కన్నాబిరాన్ లాంటి వారందరితో పాటు నేనూ యాక్టివ్‌గా పాల్గొన్నాను. మలిదశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ నాయకత్వంలోని విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలకు అనుగు ణంగా ఒక్కో అంశంమీద సదస్సులు జరిగాయి. అవి చిన్నపుస్తకాలుగానూ వెలువడ్డాయి. ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని మరింత అర్థం చేసుకోడానికి అవి మాకు చాలా ఉపయోగపడ్డాయి. మలిదశ పోరాటంలో ముస్లిం ఉమెన్స్ ఫోరం, ముక్తా, అమ్మల సంఘం, మహిళా జేఏసీ.. ఇలాఅనేక వేదికలద్వారా మహిళలు సమాయత్తమయ్యారు. వారంతా కలిసి తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ జరిగినప్పుడు, సంఘటనా స్థలానికెళ్లి గాయపడ్డ కొంతమందిని సైనిక్‌పురిలోని ఒక ఆస్పత్రిలో చేర్పించాం. ఓయూలో హాస్టళ్ల మూసివేయడాన్ని నిరసిస్తూకూడా సమావేశాలు, సభలు నిర్వహించి.. వసతిగృహాలు తెరిచేలా ఒత్తిడి తేగలిగాం.

తెలంగాణ ఏర్పాటులో మహిళల పాత్ర చాలా కీలకం. అలాంటిది రాష్ట్ర అవతరణ అనంతరం అధికారంలోకి వచ్చిన పార్టీ ఆధిపత్య పోకడలతో వ్యవహరించింది. సోషలిస్టు ఎకానమి లాంటి మార్గాలను అవలంభిస్తారని ఆశిస్తే, అందుకు పూర్తి విరుద్ధంగా పాలన సాగింది. ప్రజాస్వామ్య హక్కులను హరించారు. నిరసన తెలిపే హక్కును కాలరాశారు. విమర్శకు అవకాశం లేకుండా చేయాలని చూశారు. ప్రైవేటీకరణనే ప్రోత్సహించారు. ఆర్థిక వనరులు, పరిపాలన విషయాల్లో గత పాలకులు అవలంభించిన ఆధిపత్య వైఖరినే అవలంభించారు. అయితే, తెలంగాణలో మతరాజకీయాలను నిలువరించగలగడం అభినందనీయం.

- ప్రొఫెసర్ రమా మెల్కొటె

ఇంటిల్లపాదీ పాల్గొన్నాం...

ప్రత్యేక తెలంగాణ మలిదశ పోరాటంలో ఆదివాసీ మహిళల పాత్ర ప్రత్యేకమైంది. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతిగూడెం స్వరాష్ట్ర సాధనకై గొంతెత్తింది. బిడ్డల భవిష్యత్తు బావుండాలని ప్రతి తల్లీరోడ్డుమీదకొచ్చి 'జై తెలంగాణ' అంటూ నినదించింది.

ఉట్నూరు కేంద్రంగా ఆదివాసీలంతా పది కిలోమీటర్ల వరకు ఎడ్ల బండ్లతో పెద్ద ఊరేగింపు తీశారు. అదే సమయంలో మా ఇంటిల్లపాది ఉద్యమంలో పాల్గొన్నాం. నేను, నా భర్త భుజంగరావు ఉపాధ్యాయులంగా ఉన్నాం. మేము జనాన్ని సమీకరిస్తూ, సమావేశాలు, సభలు నిర్వహిస్తుంటే... పాఠశాల విద్యార్థులుగా ఉన్న నా పిల్లలు విప్లవ్ డప్పుకొడితే సాయుధ పాటలు పాడేవాడు. మాతో పాటు ఉంటున్న మా బావగారి బిడ్డలు ప్రకృతి, ప్రతిభ, నా చెల్లి కవిత... ఇంట్లోనివారంతా నలభై రోజులు ఉద్యమక్షేత్రంలోనే గడిపాం. రోడ్డుమీద సభినాలు వండటం, రోడ్డు దిగ్బంధనం లాంటి కార్యక్రమాలు చేశాం. అందుకు నామీద 11కేసులు పెట్టారు. అయినా భయపడలేదు కానీ సొంత రాష్ట్రంలో కూడా అభివృద్ధికి దూరంగా ఉన్న ఆదివాసీ మహిళలను పూర్తిగా విస్మరించారు. పోయిన వర్షాకాలంలో సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్ళకపోవడం వల్ల ముగ్గురు బాలింతలు చనిపోయారు.



తెలంగాణ వస్తే మా ఆదివాసీల బతుకులు మారతాయనుకొన్నాం. ఈనాటికి గూడెలలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో బాలింతలు, శిశువులు చనిపోతున్నారు. గోండు, తోటి, కోలాం, ఆంథ్ తెగలలో అమ్మాయిలు కాదు అసలు అబ్బాయిలు కూడా చదువుకు చాలా దూరంగా విసిరేయపడ్డారు. బాల్యవివాహాల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. 75ఏళ్ళ స్వాతంత్ర్య భారతదేశంలో మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోని ప్రాంతమేదైనా ఉందంటే అది ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాలే. సరైన రోడ్లు లేవు. ఆధునిక వసతులు కలిగిన ఆస్పత్రులు కూడా లేవు. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం పెడతామన్నారు, ఇప్పుడు దాని ఊసేలేదు. పదేళ్ళలో ఆదివాసీలను పూర్తిగా విస్మరించారు. ఇప్పటికైనా ఆదివాసీ పిల్లలు, యువత కోసం... కామన్ స్కూల్ విధానం పెట్టడం, గిరిజన వర్సిటీ ఏర్పాటు లాంటివి జరగాలి. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేశాను. నా వంతుగా మా ప్రాంత అభివృద్ధి కోసం ప్రయత్నిస్తాను.

- ఆత్రం సుగుణ

మహిళల ప్రాధాన్యత ప్రశ్నార్థకం

హన్మకొండ కేంద్రంగా సాగిన 1969నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ర్యాలీలు తీసినాం. ధర్నాలు చేసినాం. రాస్తారోకోలు నిర్వహించాం. కర్ఫ్యూలోనూ స్థానిక పోలీసుల సహకారంతో రోడ్డెక్కి నినదించాం. అప్పుడు నాకు 18ఏళ్ళు. ప్రీయూనివర్సిటి కోర్సు(పీయూసీ) పూర్తి చేసి ఇంటిపట్టునున్న నన్ను రాష్ట్ర సాధన ఉద్యమం స్తిమితంగా ఉండనివ్వలేదు. అన్యాయాన్ని ప్రశ్నించే నా స్వభావమే నన్ను ఆత్మగౌరవ పోరాటం దిశగా తీసుకెళ్లింది. వరంగల్ విద్యార్థులతో కలిసి ప్రతి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాను. కర్ఫ్యూ సమయంలో యాభైమంది మహిళలం కలిసి జులూస్ తీశాం.

హన్మకొండ జీవన్‌లాల్ గ్రౌండ్స్‌లో మహిళా సదస్సుకు ఈశ్వరీబాయిగారు ముఖ్యఅతిథిగా వచ్చారు. ఆ సభకు అధ్యక్షత వహించే అవకాశం నాకు దక్కింది. తెలంగాణ పోరాటంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనేలా, వారికి అవగాహన కల్పించాలి అని సమావేశంలో వక్తలంతా మాట్లాడారు. ఆ స్ఫూర్తితో 'వంటిల్లు వదలండి - వీధుల్లోకి రండి' అంటూ కరపత్రం ప్రచురించాం. తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి కాస్త విరామం వచ్చినా, నేనెన్నడూ తెలంగాణ సోయి మరువలేదు. తెలంగాణ మలిదశ పోరాటం నాటికి నేను వికారాబాద్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నాను. ప్రొఫెసర్ రేవతి, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కొల్హాపురం విమల, అల్లం పద్మ, గోగు శ్యామల, జూపాక సుభద్ర, మేరీ... ఇలా పదహారుమందిమి కలిసి మహిళా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డాం. సకల జనుల సమ్మె, సాగరహారం, మిలియన్ మార్చ్... ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నాం. 1969నాటి ఉద్యమం కంటే మలిదశ పోరాటంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకవిధంగా ముందుండి నడిపించారు కూడా. స్వరాష్ట్రం సిద్ధించాక, కొంతవరకు తెలంగాణ కవయిత్రులకు, రచయిత్రులకు గుర్తింపు వచ్చింది. తెలంగాణ రాకుంటే నా పేరు బయటకు తెలిసేది కాదు కదా! తెలంగాణ స్పృహతో మంచి రచనలు



వస్తున్నాయి. ఈ పదేళ్ళలో పాలనా విషయానికొస్తే... మహిళా సంక్షేమ పథకాలతో కొంతమంది గ్రామీణ మహిళలకు లబ్ధి చేకూరింది. అయితే, పరిపాలనా రంగంలో మహిళల ప్రాధాన్యత ప్రశ్నార్థకమైంది. అది బాధాకరం. ఈ పరిస్థితి మారాలి.

- తిరునగరి దేవకీదేవి

ఉద్యమ స్ఫూర్తితో పండుగలు

తెలంగాణ మలిదశ పోరాటంకంటే ముందే కరీంనగర్‌లో జనసాధన కమిటీ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొన్నాను. నక్సలైట్ ఉద్యమం నుంచి వచ్చిన నాకు నీళ్ళు నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై అవగాహన ఉంది. మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా మోత్కురావుపేట. నా పన్నెండవ ఏట నుంచి భూస్వాముల

పెత్తనాన్ని, అణచివేతను నిరసిస్తూ వస్తున్నాం. తునికాకు, బీడీకార్మికులు, రైతుకూలీ పోరాటాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నాను. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత... వరంగల్‌లో కేసీఆర్ నిర్వహించిన సింహగర్జన సభకు స్వచ్ఛందంగా మహిళలను సమీకరించి తీసుకెళ్లాను.



పంచాయతీరాజ్ ఎన్నికల్లో నన్ను పోటీచేయమని స్థానికుల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి వచ్చింది. అయితే, 'అందరూ మాజీ నక్సలైట్లు అవుతున్నారని' కేసీఆర్ సార్ వద్దన్నారు. టీఆర్ఎస్‌లో మహిళా విభాగం అధ్యక్షురాలిగా, పార్టీ రాష్ట్రకమిటి కార్యదర్శి తదితర హోదాల్లో పనిచేస్తూ... మరోవైపు మహిళలను కూడగట్టి కరీంనగర్ వేదికగా ఎన్నో నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ఆ సమయంలో ప్రతి పండుగనూ ఉద్యమస్ఫూర్తితో సామూహికంగా చేసుకొన్నాం.

తెలంగాణ మలిదశపోరాటంలో మహిళలు చాలాకీలకంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధిస్తే, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమభాగం లభిస్తుందని ఆశించాం. సమాన విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు సాధికారత లక్ష్యంగా మహిళల అజెండా ముందుకొచ్చింది. ఉద్యమసమయంలో నిరసనగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు 35మంది మహిళలం టికెట్టు తీసుకోకుండా బస్సులో ప్రయాణించాం. అప్పుడు మమ్మల్ని బస్సు దించాలి అని మధ్యలో చాలాచోట్ల ప్రయత్నించినా... మేము వెనక్కితగ్గలేదు. మేము బస్సు దిగము, టికెట్టు తీసుకోము అని తేల్చిచెప్పాం. ఇలా రకరకాల రూపాల్లో నిరసనలు తెలిపాం. ఒకమహిళా కేంద్ర మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకొన్నందుకు అరెస్టు చేసి రోజంతా స్టేషన్‌లో ఉంచారు. జూబ్లీబస్టాండ్‌లో బస్సులను కదలనివ్వకుండా అడ్డగించినందుకు మరొక సందర్భంలో అరెస్టు చేశారు. అప్పుడు నాన్ బెయిలబుల్ కింద కేసు పెడతామంటూ అర్ధరాత్రి ఒంటిగంట వరకు వెహికల్‌లో తిప్పి తర్వాత స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఆ సమయంలో కొంతమంది తెలంగాణ పోలీసులు కొందరు మాలాంటి వాళ్ళకు సపోర్టు చేశారు. ఇలా ప్రతి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాను. అందుకు నామీద ఎనిమిది కేసులు పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వాటన్నింటినీ కొట్టేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక మార్కెట్ కమిటీలలో మహిళలకు అవకాశాలు కల్పించడం. సాగు నీరు అందించడం వల్ల కొంతమేరకు గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవితాల్లో కొంత మార్పు రావడం చూస్తున్నాం. అయితే, చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లభించలేదు. రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన వారికి మినహా స్వతంత్రంగా ఎదిగిన మహిళలకు అవకాశాలు కల్పించలేకపోతున్నారు. మహిళల శక్తిసామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించే సంస్కృతి ఎక్కడా ఏ పార్టీలోనూ లేదు. మహిళా సాధికారత, పాలనారంగంలో సమానత్వం కోసం మహిళలు నిరంతరం కొట్లాడాల్సిందే.

- తుల ఉమ

• సాంత్వన్



అలనాటి కథ

హైదరాబాద్‌లో వైస్రాయ్ పర్యటన

కొన్ని సంఘటనలు మనో ఫలకంపై చెరగని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. ఈ మధ్య పాత ఆల్బమ్స్ చూస్తుంటే... వైస్రాయ్ లార్డ్ ఇర్విన్, ఆయన భార్య లేడీ ఇర్విన్ హైదరాబాద్ పర్యటన ఫొటోలు కనిపించాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి మన దేశంలో ప్రతినిధి అయిన వైస్రాయ్‌కు ఆ రోజుల్లో విశేషమైన పలుకుబడి ఉండేది. ఆయనను కలవడానికి రాజులు, మహారాజులు పోటీ పడేవారు.

లార్డ్ ఇర్విన్ పర్యటనకు ముందే హైదరాబాద్ నగరమంతా ముస్తాబయింది. హవేలీలకు, ప్యాలెస్‌లకు రంగులు వేయించారు. కొత్త ఫర్నీచర్ కొన్నారు. తమ వద్ద ఉన్న ఇంగ్లీషు వంటవారితో పాశ్చాత్య వంటలు సాధన చేయించారు. వీధి దీపాలన్నిటినీ శుభ్రం చేయించారు. వీధులన్నిటినీ కడిగించారు. ఆయన ప్రయాణించే రోడ్ల చుట్టుపక్కల తుప్పలు లేకుండా శుభ్రపరిచారు. వైస్రాయ్‌కు... ఆయన కుటుంబానికి నాంపల్లి రైల్వే స్టేషన్‌లో స్వాగతం చెప్పటానికి నిజాం స్వయంగా వెళ్లారు. ఆ రోజుల్లో అది చాలా అరుదైన సంఘటన. సాధారణంగా నిజాం ఎవరికైనా స్వాగతం చెప్పాలన్నా... ఆయన ప్యాలెస్‌లోనే చెప్పేవారు. అలాంటిది వైస్రాయ్‌కు స్వాగతం పలకడానికి నిజాం స్వయంగా వస్తున్నారనే వార్త హైదరాబాద్‌లో సంచలనమైంది. నిజాం స్వాగతం



కింగ్ జార్జి ఢిల్లీలో దర్బార్ నిర్వహించినప్పుడు.. భారత ఉపఖండంలో ఉన్న రాజులు, మహారాజులు తమ హోదాకు తగ్గట్టుగా తయారై వచ్చారు. ఆ దర్బారు సమయంలో నిజాంకు సంబంధించిన ఒక చిన్న కథ మా చిన్నప్పుడు చెప్పేవారు. కింగ్ జార్జి దర్బార్‌కు బ్రిటిష్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. రాజులు, మహారాజులందరికీ వారి వారి హోదాలకు తగ్గట్టుగా సీట్లు కేటాయించారు. నిజాం ఏనుగుపై వచ్చి కింగ్ జార్జికి అభివాదం చేయాలి. కానీ ఆ రోజు ఏనుగు మోకాళ్ల మీద కూర్చోవ టానికి మోరాయించ డంతో నిజాం చాలాసేపు ఏనుగు అంబారీ ఎక్కలేక పోయాడు. దీనివల్ల నిజాం దర్బారుకు ఆలస్యంగా వెళ్లాడు. అంతే కాదు... నిజాం వజ్ర వైఢూర్యాలు ధరించలేదు. కానీ ఆయన భార్య, ఇతర రాజ సిబ్బంది అమూల్యమైన ఆభరణాలు ధరించారు. అక్కడకు వచ్చిన ఒక మహారాజు నిజాం దగ్గరకు వచ్చి... "మీరు ఆభరణాలు ధరించలేదు" అన్నాడట. అప్పుడు నిజాం ఆయనతో... "నా వెనుక చూడు" అన్నాడట.

చెబుతున్నాడంటే... వస్తున్న అతిథి ఇంకెంత గొప్పవాడోనని ప్రజలు గుసగుసలాడుకున్నారు. నాన్న (రాజా ధన్‌రాజ్ గిర్) కూడా వైస్రాయ్‌కు స్వాగతం చెప్పారు. నాంపల్లి స్టేషన్‌లో వైస్రాయ్ ప్రయాణించే ప్రత్యేక ట్రైన్ కోసం అందరూ ఎదురుచూశారు. వచ్చిన తర్వాత పుర ప్రముఖులందరినీ వైస్రాయ్‌కు నిజాం పరిచయం చేశారు. ఆ తర్వాత ఆయన ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అక్కడ విడిది చేశారు. ఆయన పరివారం కూడా చాలా పెద్దదే. ఒక రోజు ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఎట్‌హోమ్ ఏర్పాటు చేశారు. దానికి రాజ కుటుంబాల వారందరినీ ఆహ్వానించారు. మేమందరం ఎట్‌హోమ్‌కు వెళ్లాం. వైస్రాయ్ వెళ్లిపోయిన తర్వాత చాలా కాలం వరకూ అందరి సంభాషణల్లో ఆ పర్యటనకు సంబంధించిన మాటలే వినవచ్చేవి. వైస్రాయ్ పర్యటన తర్వాత కొన్ని రాజ కుటుంబాల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. ఇంగ్లీషు ఫర్నీచర్, ఇంగ్లీషు వంటకాలు, ఇంగ్లీషు పాత్రలు ఇళ్లలోకి ప్రవేశించాయి. 1946లో మనకు స్వాతంత్ర్యం రాకముందు లార్డ్ మౌంట్ బాటెన్‌ను కూడా కలిసే అవకాశం నాకు కలిగింది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

మంచి పాత్ర చేస్తే ఆ కిక్కే వేరు

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో సీత పాత్ర ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన నటి అంజలి. కొద్దికాలం విరామం తర్వాత 'గీతాంజలి మళ్లీ వచ్చింది', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో రీ ఎంట్రీ ఇచ్చిన ఆమెను 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలలోకి వెళ్తే...

సండే సెలబ్రిటీ



మీ సినిమా జర్నీ ఎలా అనిపిస్తోంది?

చాలా బావుంది. ప్రస్తుతం ఒక మంచి దశలో ఉన్నా. నాకు నచ్చే పాత్రలను ఎంపిక చేసుకుంటున్నా. అదృష్టవశాత్తు ప్రేక్షకులు కూడా వాటిని చూసి ఆదరిస్తున్నారు. 'గీతాంజలి మళ్లీ వచ్చింది', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి సినిమాలకు మంచి ఆదరణ లభించింది.

రీ ఎంట్రీ ఎప్పుడైనా కష్టమే.. మీకు ఎలా అనిపించింది?

నిజమే! రీ ఎంట్రీ చాలా కష్టమైన విషయం. రెండోసారి ప్రవేశించి విజయం సాధించటం కూడా చాలా కష్టమే! రీ ఎంట్రీకి ముందు - 'భవిష్యత్తులో నేను వెనక్కి తిరిగి చూసుకుంటే- నేను చేసే పాత్రలు నన్ను సంతృప్తి పరచాలి' అనుకున్నా. అందుకే చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. ఇది నాలో వచ్చిన ఒక గుణాత్మకమైన మార్పు.

ఒకప్పటి అంజలికి.. ఇప్పటి అంజలికి తేడా?

ఇంతకు ముందు కన్నా ఇప్పుడు బాగా ఆలోచించ గలుగుతున్నా. స్పష్టత వచ్చిన తర్వాతే ఏ విషయంపైనైనా నిర్ణయం తీసుకుంటున్నా. దీనివల్ల నేను చేసే పనిలో కూడా స్పష్టత వస్తోంది. షూటింగ్ నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత "ఈ రోజు నేను మంచి పాత్రలో నటించా" అనుకోగలుగుతున్నా. నిజంగా చెబుతున్నా. ఒక మంచి పాత్రను చేస్తే వచ్చే కిక్కే వేరు.

మీరు ఎమోషనల్ పర్సనేనా?

నేను చాలా ఎమోషనల్. చిన్నప్పటి నుంచి సున్నితంగా ఉండేదాన్ని. మనసులో ఉన్నది బయటకు చెప్పేదాన్ని. అందరినీ నమ్మేదాన్ని. చాలా మంది అలాంటి లక్షణాలు తప్పు అనుకుంటారు. కానీ నా వరకు నేను ఆ లక్షణాలు మంచివే అనుకుంటాను.

చిన్నప్పుడు ఎక్కువ అల్లరి చేసేవారా?



అనవసరంగా పెద్దది చేశారు...

'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో ఒక చిన్న సంఘటనపై అనవసర రాద్ధాంతం చేశారు. ఆ స్టేజీ మీద ఏం జరిగిందనే విషయం మాకు తెలుసు. బాలయ్య నన్ను కొద్దిగా జరగమని తోసారు. నేను వెంటనే నవ్వేసాను. దాన్ని సోషల్ మీడియాలో అనవసరంగా పెద్దది చేశారు. బాలయ్య నాకు 'డిక్టేటర్' సినిమా నుంచి తెలుసు. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో కూడా ఆయన - "నాకు అంజలికి ఎనర్జీ మ్యాచ్ అవుతుంది. మా భావాలు మొహంలో తెలిసిపోతాయి" అన్నారు కూడా! ఇది చాలా చిన్న సంఘటన. సోషల్ మీడియాలో అనవసరపు సంఘటనలు ఎలా వైరల్ అవుతాయో చెప్పటానికి ఇదొక ఉదాహరణ.

నేను చిన్నప్పుడు రాజోలులో పెరిగాను. అప్పుడు కూడా చాలా అల్లరి చేసేదాన్ని. ఇప్పటికీ అంతే! 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా సెట్స్‌లో కూడా సందడిగా ఉండే దాన్ని. ఈ విషయాన్ని హీరో విశ్వక్‌సేన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పారు కూడా. చిన్నప్పుడు నేను ఫ్రెండ్స్‌తో ఎక్కువ సమయం గడిపేదాన్ని. సెట్స్‌లో వీలైనంత సందడిగా ఉంటా.

చిన్నప్పుడు ఎప్పుడైనా నటి అవ్వాలని అనుకున్నారా?

చిన్నప్పుడు స్కూలులో చదివే సమయంలో టామ్‌బాయ్‌లా ఉండేదాన్ని. టీచర్లు ఎప్పుడైనా- "నువ్వు పెద్దయిన తర్వాత ఏమి అవుతావు?" అని అడిగితే- 'నటిని అవుతా'నని చెప్పేదాన్ని. కొద్దిగా పెద్దయిన ఆ ఆలోచన బలపడింది. ఇక ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత- నటి కావటం అంత సులభం కాదని అర్థమయింది. అనేక పాఠాలు నేర్చుకున్నా.

నటీనటులకు సంబంధించిన చిన్న విషయాలు కూడా పెద్దవి చేసి చూపిస్తూ ఉంటారు కదా... మీకెలా అనిపిస్తుంది?

ప్రతి ఇండస్ట్రీలోను మంచి, చెడులు ఉంటాయి. కానీ అందరూ సినిమా ఇండస్ట్రీ వైపే చూస్తూ ఉంటారు కాబట్టి చిన్న విషయం కూడా బాగా పెద్దదిగా బ్లో అవుట్ అవుతుంది. చెడు విషయాలు అందరినీ త్వరగా ఆకర్షిస్తాయి కాబట్టి - మీడియా, సోషల్ మీడియా కూడా వాటిపైనే దృష్టి పెడతాయి. ఒక గాడ్‌ఫాదర్ లేకుండా ఇండస్ట్రీలో ఎదగటం అనేది చాలా కష్టం. ఎందుకంటే మొత్తం బాధ్యతంతా మన భుజాలపైనే ఉంటుంది. తీసుకొనే ప్రతి నిర్ణయానికి మనమే బాధ్యులమవుతాం! ఏ సినిమా చేయాలి, ఏ సినిమా చేయకూడదు, ఏ సినిమా చేస్తే ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది? లాంటి ప్రశ్నలు అనుక్షణం ఉత్పన్నమవుతూనే ఉంటాయి. వీటికి సరైన సమాధానాలు కనుగొన్నప్పుడు మనం ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలుగుతాం. ఒక మంచి పాత్ర చేస్తే దాని మొత్తం క్రెడిట్ అంతా మనకే దక్కుతుంది. చెడు పాత్ర అయినా అంతే! అందువల్ల వీలైనంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

ఒక సమయంలో మీరు సినిమాలు మానేసినప్పుడు అనేక వదంతులు వచ్చాయి కదా... వాటిపై ఎప్పుడైనా బాధపడ్డారా?

కొన్ని సంవత్సరాల ముందు ఇలాంటి విమర్శలన్నింటినీ సీరియస్‌గా తీసుకొనేదాన్ని. నా గురించి ఇలా ఎందుకు రాస్తున్నారని బాధపడేదాన్ని. తర్వాత నాకు ఒక విషయం అర్థమయింది. మంచి అయినా చెడు అయినా మన గురించి రాస్తున్నారంటే- ప్రజలకు మనపై ఆసక్తి ఉన్నట్లే! ప్రజలు మనని మర్చిపోలేదని అర్థం. ఇలా ఆలోచించటం మొదలుపెట్టిన తర్వాత ప్రశాంతత ఏర్పడింది. అంతేకాదు... గతం గడిచిపోయింది. సినిమాలు మానేయటం, మళ్లీ రావటం కూడా అయిపోయింది. ఇప్పుడు గతం గురించి ఎక్కువగా మాట్లాడటం నాకు ఇష్టం లేదు.

మీరు స్క్రిప్ట్స్ ఎలా ఎంపిక చేసుకుంటారు?

స్క్రిప్ట్స్ పూర్తిగా నా ఛాయిస్సే. నేనే ఎంపిక చేసుకుంటా. నాకు వచ్చిన పాత్రల్లో నేను ఒదిగిపోగలనా? అని ఆలోచిస్తా. స్క్రిప్ట్ చదివిన వెంటనే నాకు ఒక థ్రిల్ రావాలి. ఎందుకంటే- షూటింగ్ జరిగినన్ని రోజులు నేను ఆ పాత్రలోనే జీవించాలి కాబట్టి. నేను ఎంజాయ్ చేయగలిగిన పాత్రల్లో ఉండే ఎనర్జీ ప్రేక్షకులకు స్పష్టంగా తెలుస్తుందని నేను నమ్ముతాను.

పోలోతో ఆడుకొంటా

ఖాళీగా ఉన్న సమయంలో నా కుక్క పోలోతో గడుపుతూ ఉంటా. నాకు సినిమాలు చూడటమంటే చాలా ఇష్టం. ఇక నా ప్రాజెక్టుల విషయానికి వస్తే త్వరలోనే 'గేమ్ ఛేంజర్' వస్తుంది. దీనిలో పాత్ర కూడా చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ప్రేక్షకులకు చాలా నచ్చుతుంది.

సోషల్ మీడియాను ఫాలో అవుతారా?

నేను సోషల్ మీడియా ఫాలో అవుతాను. అయితే దీన్ని ఒక సాధనంగా మాత్రమే చూస్తాను. నా ప్రేక్షకులకు నేను చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పటానికి మాత్రమే వాడతాను. ఏదో ఒక విషయం చెప్పి.. దానిపై వివాదం వస్తే... దాన్ని విశ్లేషించడం, మళ్లీ వివరణ ఇవ్వడం... ఇలా ఉపయోగించను. నా ఉద్దేశంలో కరెక్ట్‌గా వాడే వారికి మంచిదే. అదే జీవితమనుకొని.. నెగిటివిటీని వ్యాపింపచేయటం మాత్రం సరైనది కాదు. చాలా సందర్భాలలో మొత్తం స్టోరీ చెబితే తప్ప- అసలు విషయం మనకు అర్థం కాదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

బాగా వచ్చింది..

'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు బాగా మెచ్చుకుంటున్నారు. చాలారోజుల తర్వాత మొదటి రోజు మార్నింగ్ షోలకు ప్రేక్షకులు వచ్చారు. రత్నమాల నాకు చాలా నచ్చిన పాత్ర. కొన్ని పాత్రలు ప్రేక్షకుల మనస్సులో నిలిచిపోతాయి. రత్నమాల అలాంటి క్యారెక్టర్. ఈ పాత్ర చేసే సమయంలో చాలా ఎంజాయ్ చేశాం. ఈ పాత్ర నన్ను ఛాలెంజీ చేసింది. నేను ప్రేక్షకులతో కలిసి సినిమా చూశా! అందరూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6tYjFgL లో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ

తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్ర్కీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన వారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.



విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తి చేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్‌ఏటీ/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్‌ఏ ఫెలోషిప్స్‌తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటొమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/GNdJDmjలో చదవండి.

కేదార్‌నాథ్‌లో తలైవా



నటుడిగా తను ఎంత బిజీగా ఉన్నా మధ్యలో వీలు చూసుకుని హిమాలయాలకు వెళ్లడం తలైవా రజనీకాంత్‌కు అలవాటు. కొన్ని రోజులు అక్కడే ధ్యానంలో గడుపుతుంటారు. అలాగే మే 29న ఆయన ఉత్తరాఖండ్ వెళ్లి కేదార్‌నాథ్, బదరీనాథ్ ఆలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనకు స్వాగతం పలికి, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కేదార్‌నాథ్‌లో రజనీకాంత్ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సిద్ధమవుతున్న హరిహర వీరమల్లు



పవన్‌కల్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా చేస్తున్న హిస్టారికల్ ఎపిక్ వారియర్‌మూవీ 'హరిహర వీరమల్లు'. 17 వ శతాబ్దంలో పేదల కోసం పోరాడిన యోధుడి పాత్రను ఆయన ఇందులో పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేయబోతున్నారు. భారీ బడ్జెట్‌తో ఎ.ఎం.రత్నం ఈ సినిమా నిర్మిస్తున్నారు. భారతదేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస 'హరిహర వీరమల్లు' చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించే పనిలో నిర్మాత ఉన్నారు. ప్రస్తుతం లోకేషన్ల కోసం రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ షూట్ చేసిన సన్నివేశాలకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 'హరిహర వీర మల్లు' పార్ట్ వన్ 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ ప్యాక్డ్ మూవీ

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు నాట అభిమానులను సంపాదించుకున్నారు తమిళ హీరో విజయ్ ఆంటోని. ఇప్పుడు ఆయన 'తుఫాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ నెల్లోనే



ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'తుఫాన్' యాక్షన్ ప్యాక్డ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "తుఫాన్" సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఒక దీవిలో జరిగే కథ ఇది. హీరో క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రాన్ని కమల్ బోరా, డి. లలిత నిర్మిస్తున్నారు. సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



బ్లాక్‌బస్టర్ గ్యారంటీ

శర్వానంద్

"మనమే' చిత్రం మ్యాజికల్ బ్లాక్ బస్టర్. ఈ సారి కుమ్మేశాం. ఇది రాసి పెట్టుకోండి. ఈ నెల 7న థియేటర్లలో కలుద్దాం. ఇది కుటుంబం అంతా కలసి ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. 'శతమానం భవతి' కన్నా పెద్ద హిట్ అవుతుంది. మిమ్మల్ని ఏమాత్రం నిరాశపరచదు' అని శర్వానంద్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో మీరుచూసింది కొంచెమే. 'మనమే' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మీ తల్లితండ్రులకు చూపించండి. ఈ సారి కొత్త శర్వాను చూడబోతున్నారు. కృతి తన నటనతో ఇరగదీసింది' అన్నారు. సినిమాలో ఎమోషన్‌తోపాటు ఎంటర్టైన్‌మెంట్ ఉంది అని కృతిశెట్టి చెప్పారు. ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్, ప్రేక్షకులు ఆదరించాలి అని వివేక్ కూచిభొట్ల కోరారు.

డూప్ లేకుండా కాజల్ యాక్షన్ సీక్వెన్స్ చేశారు

- సుమన్ చిక్కాల

'ఎమోషన్, యాక్షన్ అంశాలతో 'సత్యభామ' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యాక్షన్ పార్ట్ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. చాలా ధైర్యంగా స్టంట్స్ చేశారు' అని దర్శకుడు సుమన్ చిక్కాల అన్నారు. కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు.



- సినిమాలపై ఆసక్తి ఉండడంతో ఉద్యోగం చేస్తూనే చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. దర్శకుడు శశికిరణ్ తీసిన కొన్ని సినిమాలకు పనిచేశాను. ఆయన ఈ సినిమాకు దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చారు. కొంతమంది పోలీసుల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నాను.
- అయితే 'సత్యభామ' కథ రాయడం పూర్తయ్యాక లీడ్‌రోల్‌లో ఎవరైనా హీరోయిన్ చేస్తే బావుంటుంది అనుకున్నాం. కాజల్ కథ వినగానే 'ఎస్' చెప్పారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. సత్యభామ తన దగ్గరకు వచ్చిన ఒక కేసును పర్సనల్‌గా తీసుకుంటుంది. ఎమోషనల్ అవుతుంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమవుతుంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఆ విల్లాలో ఏం జరిగింది?



విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన 'విల్లా 369' చిత్రం షూటింగ్ పూర్తయింది. సురేశ్ ప్రభు దర్శకత్వం వహించారు. 'ఆ విల్లాలో ఏం జరిగింది అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ పూర్తి చేసి, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం. టీజర్, ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం' అని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, ఫొటోగ్రఫీ: ఎస్.కె.రఫీ, లైన్ ప్రొడ్యూసర్: శీలం ప్రణయ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.లక్ష్మణ్‌బాబు, చిత్రం శ్రీను.

పిల్లలతో విహార యాత్ర



తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం హాంకాంగ్ పర్యటనలో ఉన్నారు. డిస్నీల్యాండ్ రిసార్ట్‌లో దిగిన ఫొటోలను విఘ్నేశ్ షేర్ చేస్తూ 'పన్నెండేళ్ల క్రితం 'పోడా పోడీ' షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర వెయ్యి రూపాయలే ఉన్నాయి. షూస్ కూడా లేవు. చెప్పులతో ఈ ప్రదేశమంతా తిరిగా. ఇప్పుడు నా భార్య, పిల్లలతో ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ పేర్కొన్నారు.

హనీమూన్ సాంగ్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. సుహాసినీ, తనికెళ్ల భరణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మించారు. శనివారం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్‌ను దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు బాల మంచి టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. టైటిల్ సాంగ్ చాలా బావుంది. ఈ సినిమా మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. పాప్ సింగర్ స్ఫూర్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరిచి, ఆలపించారు. ఈ చిత్రానికి సంగీతం : కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే



రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సమావేశమైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు రండి

- గవర్నర్‌కు సీఎం, డిప్యూటీ సీఎం ఆహ్వానం
- రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు రావాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. గవర్నర్ రాధాకృష్ణన్‌తో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ సుమారు 30 నిమిషాలపాటు కొనసాగింది. కాగా, తెలంగాణ ప్రజలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమరుల త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైందని పేర్కొన్నారు. ఇప్పుడు ఐటీ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలవడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు ప్రకటన విడుదల చేశాయి.

సింగరేణి సీఎండీకి ఐఐఐఈ ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ పురస్కారం అందజేసింది. శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సమావేశంలో ఈ అవార్డును బలరామ్ తరఫున డైరెక్టర్ (ఆపరేషన్స్, పర్సనల్) ఎన్.వి.కె.శ్రీనివాస్ అందుకున్నారు. బలరామ్ చొరవతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి తన చరిత్రలోనే అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాను సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పిందని, రూ.35,700 కోట్ల టర్నోవర్ సాధించిందని సంస్థ పేర్కొంది.

రాష్ట్ర అవతరణ వేడుకలకు రాజకీయ పార్టీలన్నీ హాజరుకావాలి:యెన్నం

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అన్ని రాజకీయ పార్టీలు హాజరుకావాలని కాంగ్రెస్ నేతలు కోరారు. అందరం కలిసి నిర్వహించుకుంటున్న ఈ ఉత్సవాలకు వైరుధ్యాలు, వ్యతిరేకలు అంటగట్టొద్దని, వేడుకలకు తప్పకుండా రావాలని మరోసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మొదటిసారి ఉద్యమకారులే ముఖ్యులుగా కలిసి తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుపుకొంటున్నామని, రాష్ట్ర గీతాన్నీ ఆవిష్కరించుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా వేడుకలను పరిమితంగా నిర్వహించాల్సి వస్తోందన్నారు. హైదరాబాద్ వరకు రాలేని ఉద్యమకారులు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించే వేడుకలలో పాల్గొనాలని కోరారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. సెప్టెంబరు, అక్టోబరులో ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ ఉంటుందన్నారు.

తెలంగాణ కోసం గట్టిగా పోరాడా: వీహెచ్

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రాంత ఎంపీలు అడ్డుపడుతు న్నప్పటికీ తాను తెలంగాణ రాష్ట్ర బిల్లు కోసం పార్లమెంట్‌లో గట్టిగా పోరాడినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు చెప్పారు. ఆంధ్ర పెత్తనంలో ఉండలేమని స్పష్టం చేస్తూ నాడు 42 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్‌లో సోనియా గాంధీకి అందించినట్టు గుర్తు చేశారు. అనారోగ్య కారణాలతో సోనియా గాంధీ రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరుకావడం లేదని తెలిపారు.

ప్రత్యేక తెలంగాణ కోసం తొలిసారి నినదించిన పార్టీ సీపీఐ: కూనంనేని

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల సాకారమయి.. దశాబ్దకాలం పూర్తవడం సంతోషం కలిగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కూనంనేని.. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం తొలిసారి నినదించిన జాతీయ పార్టీ సీపీఐ అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో సీపీఐ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందని కూనంనేని చెప్పారు.

స్వగ్రామంలో అందెశ్రీ



గ్రామస్థులతో అందెశ్రీ

మద్దూరు, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జయజయహే గీతాన్ని నేడు జాతికి అంకితమివ్వనుండటంతో ఈ చరిత్రాత్మక ఘట్టానికి ముందు గేయ రచయిత అందెశ్రీ తన స్వగ్రామాన్ని సందర్శించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన.. చిన్ననాటి స్నేహితులతో పాటు గ్రామస్థులతో సంతోషాన్ని పంచుకున్నారు. దూళిమిట్ట మండలంలోని బెక్కంటి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కాగా, 'జయజయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ఆమోదించడంతో అందెశ్రీ స్వగ్రామమైన రేబర్తిలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ ఘట్టం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలి:ఆర్ కృష్ణయ్య

బర్కత్‌పుర, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నెలరోజుల పాటు వాయిదా వేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇంటెలిజెన్స్ బ్యూరో, హెచ్ఏఎల్‌లలో దాదాపు ఐదువేల ఉద్యోగాలు భర్తీ చేయడానికి 9వ తేదీనే పరీక్ష నిర్వహిస్తున్నారని, అందువల్ల నిరుద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే చొరవ తీసుకొని గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జూలైకి వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు కంబోడియా కేసు

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాల్‌సెంటర్‌లో ఉద్యోగం పేరుతో బలవంతంగా సైబర్ నేరాలు చేయించేందుకు ప్రయత్నించిన ముఠాపై సిరిసిల్ల పోలీసులు నమోదు చేసిన కేసు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయింది. సిరిసిల్లకు చెందిన యువకుడు ట్రావెల్ ఏజెంట్ల ఉచ్చుకు చిక్కి ఉద్యోగం పేరుతో కంబోడియాకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత చైనా దేశస్థుడు అతణ్ని బలవంతంగా కాల్‌సెంటర్‌లో చేర్పించాడు. ఒక వారం పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించి భారత మొబైల్ నెంబర్లు ఇచ్చి అంతర్జాతీయ కొరియర్ సంస్థల పేర్లతో సైబర్ నేరాలకు పాల్పడాలని బలవంతం చేశాడు. అలా చేస్తే నెలకు 950 అమెరికన్ డాలర్లు వేతనంగా చెల్లిస్తానని చెప్పాడు. వేధింపులు తట్టుకోలేక మూడు నెలల తర్వాత బాధితుడు తప్పించుకుని భారత రాయబార కార్యాలయం సహకారంతో స్వస్థలానికి చేరుకున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తీవ్రత దృష్ట్యా టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయింది.

కెనడాలో ఉద్యోగం పేరుతో మోసం.. నిందితుడి అరెస్టు

కెనడాలో ఉద్యోగంతోపాటు జాబ్ వీసా ఇప్పిస్తానంటు నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసి పరారైన నిందితుడ్ని సీఐడీ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. వికాస్ ఖిందార్ అనే వ్యక్తి నిజామాబాద్ జిల్లా భీంగల్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొందరు నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి వారి నుంచి రూ. 48 లక్షలు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వికాస్‌తోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి.కేసు సీఐడీకి బదిలీ అయ్యింది. నిందితుడికోసం ప్రత్యేక బృందాల్ని రంగంలోకి దింపి పంజాబ్‌లోని జలంధర్‌లో అరెస్ట్ చేసినట్లు సీఐడీ చీఫ్ శిఖా గోయల్ తెలిపారు.

నేటితో రాష్ట్రానికి సంపూర్ణ విముక్తి

హైదరాబాద్.. ఇక తెలంగాణకు మాత్రమే రాజధాని

- విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సింహభాగం మనకే
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..
- ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం రేవంత్
- సోనియా వల్లే దశాబ్దాల కల సాకారమైంది: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): "ఈ ఏడాది జూన్ 2కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ రోజుతో తెలంగాణ రాష్ట్రానికి సంపూర్ణ విముక్తి లభించింది. విభజన చట్టం ప్రకారం ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇకపై తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుంది. దీంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సింహభాగం రాష్ట్ర ప్రజలకే దక్కుతాయి"అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ... పదేళ్ల పూర్తి చేసుకుని 11వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. రాష్ట్ర సాధన పోరాటంలో పాల్గొన్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టడంతోపాటు ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రజాపాలన అందిస్తామని పునరుద్ఘాటించారు. అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలిచేలా భవిష్యత్తు ప్రణాళికలు, సరికొత్త విధానాల రూపకల్పన మొదలైందని ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని.. దశాబ్దాల కలను సాకారం చేసింది సోనియాగాంధీనే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ముందుకు తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన వారందరికీ నివాళులర్పిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు.

కాకతీయులను సమ్మక్క, సారక్కలను చంపిన రాజులుగనే చూస్తా..

(మొదటిపేజీ తరువాయి)

మార్పునకు కేంద్రం అనుమతి తీసుకుంటాం అని చెప్పారు. "రాష్ట్ర చిహ్నానికి సంబంధించి కళాకారులు కొన్ని నమూనాలిచ్చారు. వాటిపై చర్చలు జరుగుతున్నాయి. చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై అసెంబ్లీలో చర్చకు పెడతాం. చిహ్నంలో కాకతీయ కళాతోరణం ఉండేదీ, లేనిదీ ప్రజలే నిర్ణయిస్తారు. సూచనలు, అభ్యంతరాలుంటే బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి నివేదించవచ్చు" అని అన్నారు. శనివారం తన నివాసంలో మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణ తనకు దక్కిన జీవితకాలపు అవకాశమని సీఎం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలో వీటిని నిర్వహించడం, అందరినీ భాగస్వాములు చేయడం అదృష్టమన్నారు. అమరుల స్థూపాన్ని రూ.వెయ్యి కోట్లతో కట్టాలని మొదట డిమాండ్ చేసింది తానేనన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం అంటే కేసీఆర్‌కు కనీస గౌరవం లేదని రేవంత్ మండిపడ్డారు. భారత్ కంటే ఒక రోజు ముందు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొన్నట్లు.. రాష్ట్ర ప్రభుత్వం కంటే ముందు కేసీఆర్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారని ఎద్దేవా చేశారు. దశాబ్ది వేడులకు రాని ఆయన అసెంబ్లీకి వస్తారంటే ఎవరు నమ్ముతారని అన్నారు. అమర వీరులన్నా, అమరుల స్థూపం అన్నా కేసీఆర్‌కు ఎందుకంత ద్వేషమని ప్రశ్నించారు. అమరుల స్థూపం వద్దకు వెళ్లేందుకు, పరేడ్ గ్రౌండ్, ట్యాంక్‌బండ్ కార్యక్రమాలకు, సోనియాగాంధీని ఆహ్వానించేందుకూ ఎన్నికల సంఘం అనుమతి తీసుకున్నట్లు సీఎం తెలిపారు. నిబంధనలు కేసీఆర్, కేటీఆర్‌కు వేరేలా ఉంటాయా? అని వ్యాఖ్యానించారు. ఉద్యమంలో కేసీఆరే ఉండాలి.. ఆయన గురించే చర్చించాలా? అని నిలదీశారు. జయ జయహే తెలంగాణ గేయం రూపకల్పన బాధ్యతను దానిని రాసిన, పాడిన అందెశ్రీకే అప్పగించామని సీఎం స్పష్టం చేశారు. సంగీత దర్శకుడు మొదలు మొత్తం బృందాన్ని ఆయనే ఎంచుకున్నారని చెప్పారు. ఆ గీతం.. బృందగానంతో సాగుతుందని, వాయిద్యకారుల్లో బెంగాలీలు, మలయాళీలూ ఉండొచ్చనని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మరో పదేళ్లు పొడిగించాలన్న కొందరు నేతల డిమాండ్‌పై స్పందిస్తూ.. రాష్ట్రం ఏర్పడిన మూడేళ్లకే ఏపీ ప్రభుత్వం వారికి సంబంధించినవన్నీ తెలంగాణకు అప్పగించేసి వెళ్లిపోయిందన్నారు. ఇక ఆ చర్చే లేదని, అలాంటిది కావాల్సింది కేసీఆర్, కేటీఆర్‌కేనని వ్యాఖ్యానించారు. దశాబ్ది వేడుకలకు రావాలంటూ కేసీఆర్‌తో పాటు అన్ని పార్టీల అధినేతలనూ ఆహ్వానించామని సీఎం తెలిపారు. కానీ, తెలంగాణను వ్యాపార వస్తువుగా చేసుకుని ఇంకా లాభం పొందాలని కేసీఆర్ చూస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి పార్టీలో తెలంగాణను లేకుండా చేసుకుంది కేసీఆరేనన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ.. కేసీఆర్‌ను కాపాడేందుకు బీజేపీ నేతలు తాపత్రయపడుతున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్ర పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడే ఫోన్ ట్యాప్ అయిందని ఆరోపించారని, అప్పుడే ఎందుకు విచారణకు ఆదేశించలేదని ప్రశ్నించారు.



అమరవీరులను గుర్తించే వ్యవస్థ ఏర్పాటు చేస్తాం

తెలంగాణ అమరులను గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. గ్రామసభల్లో దరఖాస్తులు తీసుకున్నామని, పోలీస్ స్టేషన్ల నుంచి ఎఫ్ఐఆర్‌లూ తెప్పించి.. పరిశీలిస్తామని చెప్పారు. బీజేపీ వాళ్లు చెప్పినవవి చేయడానికి తమ పార్టీ వారి అనుబంధ సంస్థ కాదని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పి ఓట్లడిగాయని, ప్రజలు వారికి ఇవ్వాల్సింది ఇచ్చారన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం కోసం శంకుస్థాపన చేసిన స్థలంలో తాము తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని అనుకున్నామని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయ కాంపౌండ్ లోపలే ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. విగ్రహం రూపకల్పన బాధ్యతను ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అప్పగించినట్లు తెలిపారు.

డిమాండ్ పెరగడం వల్లనే బీర్లకు కొరత

డిమాండ్ పెరగడం వల్లనే రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడిందని సీఎం చెప్పారు. కొత్త బ్రాండ్లపైన స్పందిస్తూ దారిన పోయే ఏ బ్రాండ్ అయినా బెవరేజెస్ కార్పొరేషన్ గోదాంలో స్టాక్ పెట్టుకోవచ్చని, అమ్ముడు పోయినవాటికి కార్పొరేషన్.. పైసలు కట్టిస్తదన్నారు. ఒక్క సంస్థకు చెందినవి తప్ప రాష్ట్రంలో విత్తనాలకు కొరత లేదని సీఎం స్పష్టం చేశారు. ఆ సంస్థ ఇప్పటికే మొత్తం కేటాయించేసిందని, ఇంకా కావాలంటే సమయం పడుతుందన్నారు. ఆదిలాబాద్‌లోనే సమస్య ఉందని, మహారాష్ట్ర రైతులు వచ్చి విత్తనాలు తీసుకెళ్తుండడమే దీనికి కారణమని పేర్కొన్నారు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ అమలు చేస్తామని సీఎం మరోసారి చెప్పారు. లే అవుట్ చేసిన భూములు, రోడ్లు, టాటా బిర్లాలకు కూడా రైతు బంధు ఇచ్చారని కేసీఆర్‌ను తప్పుబట్టారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలన్నదానిపై అసెంబ్లీలో చర్చ పెడతామని స్పష్టం చేశారు.

కాళేశ్వరంపై కేసీఆర్ 3 నెలలు ఏం చేశారు?

కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించి ఏజెన్సీలు ఇచ్చే నివేదికలను బట్టి చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడే మేడిగడ్డ కుంగిందని.. మూడు నెలల్లో ఎందుకు మరమ్మతులు చేయించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ తన మేధావితనంతో ఎన్డీఎస్ఏకు నివేదిక ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి నిరోధంపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్నది విద్యుత్తు అంతరాయాలే కానీ.. కోతలు కాదని రేవంత్ స్పష్టం చేశారు. ఏ సబ్‌స్టేషన్‌కైనా వెళ్లి ఐదు నెలల లాగ్‌బుక్‌లు తీద్దామని, కోతలా? అంతరాయాలా? అన్నది పరిశీలన చేద్దామని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. తీవ్ర ఎండలు, కరువు పరిస్థితులతో నీళ్లు లేక విద్యుత్తు వాడకం తీవ్రంగా పెరిగిందని, ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై ట్రిప్ అవడం, కాలిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. కాగా, నయీమ్ కేసుకు సంబంధించి ఇంకా చర్చే జరగలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలిచ్చామన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తాము ఇచ్చిన 30 వేల ఉద్యోగాలతో జాబితాను విడుదల చేస్తామని, బీఆర్ఎస్ జాబితాను విడుదల చేయాలని సవాల్ విసిరారు. టీ శాట్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ క్లాసులు నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఉపాధ్యాయుడు అందుబాటు లేని స్కూళ్లలో ఇది ఉపయోగంగా మారుతుందన్నారు.

ఆవిర్భావ వేడుకలకు సోనియా రావట్లేదా!

ఆమె రావడమో.. సందేశాన్ని పంపడమో.. ఏదో ఒకటి జరుగుతుందన్న సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ హాజరు కావడంలేదా? ఆవిడ పంపిన సందేశాన్నే చదివి వినిపించనున్నారా? సీఎం రేవంత్‌రెడ్డి శనివారం తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. చెప్పిన మాటలు దీన్నే స్పష్టం చేస్తున్నాయి. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించే సభకు సోనియాగాంధీ రావాలని, సన్మానాన్ని స్వీకరించాలని తాను కోరుకుంటున్నానని, అయితే ఆమె రావడమో.. లేక సందేశాన్ని పంపడమో ఏదో ఒకటే జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సోనియాగాంధీని ఆవిర్భావ వేడుకల సందర్భంగా సన్మానించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించడం, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఆమెను ఆహ్వానించడం తెలిసిందే. వచ్చేందుకు ఆమె అంగీకారాన్నీ తెలిపారు. అయితే ప్రస్తుతం సోనియా ఆరోగ్య పరిస్థితి రీత్యా ఆవిర్భావ వేడుకలకు వెళ్లకపోవడం శ్రేయస్కరమంటూ డాక్టర్లు సూచించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆదివారంనాటి కార్యక్రమానికి ఆమె హాజరవుతుందా.. లేదా? అన్నది డైలమాలో పడింది.

రెఫరెండమే.. కేంద్రంలో ఇండియానే

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమేనని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ, కంటోన్మెంట్‌లోనూ గెలుస్తామన్నారు. ఆశించిన ఫలితం రాకుంటే ఏం చేస్తారనగా.. ప్రస్తుతం రోజుకు 18 గంటలు కష్టపడుతున్నామని, ఇకపై మరో రెండు గంటలు అదనంగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్‌కు 9 నుంచి 12 సీట్లు వస్తాయని, బీజేపీకి 4 నుంచి 5 సీట్లు వస్తాయంటూ ఆ పార్టీ అధ్యక్షుడు నడ్డానే ట్వీట్ చేశారన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి వస్తుందని, కీలకమైన మంత్రి పదవులు తీసుకుని రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకుంటామని చెప్పారు. కేంద్ర బడ్జెట్ తర్వాతనే రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు ఉంటాయని స్పష్టత ఇచ్చారు.

ఆక్రమణకు గురైన స్థలంలో ఫుట్‌బాల్ మైదానం


హైదరాబాద్ నగరంలో ఆక్రమణకు గురైన ఓ ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫుట్‌బాల్ మైదానాన్ని నిర్మించనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను ఎంపిక చేసి.. వారితో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. టీపీసీసీ చీఫ్‌గా తన పదవీ కాలం జూన్ 27తో ముగియనున్నట్లు పేర్కొన్నారు. కొత్త చీఫ్‌ను నియమించాలంటూ.. సీఎం అయినప్పుడే అధిష్ఠానానికి చెప్పానన్నారు. నామినేటెడ్ పదవుల కేటాయింపును అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగొద్దు:భట్టి



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడటం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడటంవంటి ఘటనలు జరుగుతుంటాయని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎవరికీ ఇబ్బంది కలుగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గృహ వినియోగదారులు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు అందుబాటులో ఉందని, సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు.

తెలంగాణలో మళ్లీ చీకట్లు :కేటీఆర్



హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మళ్లీ చీకట్లు మొదలయ్యాయని, కరెంట్ కోతలు నిత్యకృత్యమయ్యాయని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో విద్యుత్ కోతలు లేవంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ తరచూ విద్యుత్ కోతలు ఉంటున్నాయని శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలపై పలువురు నెటిజన్లు ఎక్స్‌లో చేసిన పోస్టులను కేటీఆర్.. ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ట్యాగ్ చేశారు. గతంలో విద్యుత్ కోతలే లేకుండా పవర్ సెక్టార్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించిన మౌలిక సదుపాయాలను కూడా వాడుకోలేని అసమర్థ స్థితిలో రేవంత్ రెడ్డి సర్కార్ ఉందని విమర్శించారు. '2014కు ముందు తరుచూ విద్యుత్ కోతలు, పవర్ హాలీడేస్ మనకు తెలిసిందే. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌ది. 24 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయటం కారణంగా హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోయే పరిస్థితి వచ్చింది. కానీ ఈ పనికిమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పదేళ్ల క్రితం నాటి పాత రోజులను తిరిగి తీసుకొచ్చింది. తరుచూ విద్యుత్ కోతలతో అటు ప్రజలకు, ఇటు పరిశ్రమలకు ఇబ్బంది తీసుకొస్తోంది. కేసీఆర్ పాలనలో పవర్ హాలీడేస్ అనే మాటే లేదు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఉద్విగ్న క్షణాలకు పదేళ్లు





విద్యుత్ దీపాల వెలుగుల్లో సచివాలయం, అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు చేసింది. 1969లో జరిగిన తొలిదశ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాలను, మలిదశ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకున్నవారి కుటుంబాలను ఆహ్వానించింది. తొలి, మలి దశ ఉద్యమాల్లో భాగస్వాములైనవారికీ ఆహ్వానాలు అందాయి. తెలంగాణ కోసం గొంతెత్తిన చుక్కా రామయ్య వంటి వారిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఇంటికివెళ్లి ఆహ్వానించారు. ఇలా 650 మంది అమరుల కుటుంబాలను ఉత్సవానికి ఆహ్వానించారు. వీరందరికీ సముచిత స్థానం కల్పించడం ద్వారా రాష్ట్రం కోసం చోటుచేసుకున్న ప్రాణత్యాగాలను గుర్తు చేసుకోబోతోంది. స్వయం సహాయక బృందాల మహిళలను కూడా ఆహ్వానించి, ఉద్యమంలో మహిళల పాత్రను ప్రభుత్వం వివరించనుంది. రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఉత్సవానికి ఆహ్వానించింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి ఆమెను ఆహ్వానించారు. అయితే ఆమె ఆరోగ్యం బాగుంటే రావొచ్చని ఆశిస్తున్నారు. ఒకవేళ రాకపోయినా.. తెలంగాణ ప్రజలను ఉద్దేశించి సందేశాన్ని పంపించనున్నారని తెలిసింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల కాలం పూర్తి కానున్నందున.. ఉమ్మడి రాజధాని హైదరాబాద్ ఇక పూర్తిగా తెలంగాణ రాష్ట్ర అధీనంలోకి రానుంది. భవిష్యత్తులో తెలంగాణ రాజధానిగానే ఉండబోతోంది.

అంగరంగ వైభవంగా వేడుకలు..

తెలంగాణ దశాబ్ది వేడుకలకు ట్యాంక్‌బండ్ ముస్తాబైంది. 700 మంది కళాకారులతో వివిధ ప్రదర్శనలు, 5వేల మందితో జాతీయ జెండాలను చేత పట్టుకొని ఫ్లాగ్‌మార్చ్, హుస్సేన్‌సాగర్ చుట్టూ లేజర్ షో, బాణసంచా కాల్చుతూ సంబరాలు జరగనున్నాయి. వేడుకలను తిలకించడానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులూ కలగకుండా ట్యాంక్‌బండ్ పొడవునా భారీ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రజలు నిలబడి వేడుకలను తిలకించే విధంగా ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటుచేశారు. ప్రజలు ఆహారపదార్థాలు, వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు 80 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మంచినీటి కొరత లేకుండా వాటర్ బోర్డు అధికారులు వాటర్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు తదితరులు శనివారం పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. దశాబ్ది వేడుకల వివరాలను శనివారం సచివాలయంలో ఆయన వివరించారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం 9:55 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారని, 20 నిమిషాలపాటు మార్చ్‌పాస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉదయం 10:35 గంటలకు రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) ఆవిష్కరణ జరుగుతుందని, 10:43 గంటలకు

'జయ జయహే తెలంగాణ' గీతంతో ఫ్లాగ్‌మార్చ్

సీఎం ప్రసంగం, అనంతరం అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమం మొత్తం 1:35 గంటలపాటు జరుగుతుందన్నారు. సాయంత్రం 6:30 గంటలకు సీఎం ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకుంటారని, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' పూర్తి పాటతో ఫ్లాగ్ వాక్ జరుగుతుందని వెల్లడించారు. ట్యాంక్‌బండ్‌పై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణికి సన్మానం జరుగుతుందని, ట్యాంక్‌బండ్ వద్ద దాదాపు 2 గంటల పాటు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై పండుగ వాతావరణం ఉంటుందని, శనివారం సాయంత్రం నుంచే షాపింగ్, గేమ్ షోలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇక ఆదివారం సాయంత్రం 5 గంటల్లోపే ప్రజలు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకోవాలని సూచించారు. వేడుకలకు అందరూ ఆహ్వానితులేనన్నారు.



అబ్ కీ బార్?

విజయంపై 'ఇండియా' నేతల ధీమా..

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉన్నప్పటికీ.. ఇండియా కూటమి 295కు పైగా ఎంపీ సీట్లు సాధిస్తుందని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఇండియా కూటమి నేతలు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై దాదాపు రెండున్నర గంటలపాటు చర్చించారు. బీజేపీ ఎంతగా రెచ్చగొట్టినా సంయమనం కోల్పోకుండా వ్యవహరించాలని, బీజేపీ అనుకూల మీడియా సంస్థల ప్రచారానికి లోబడకూడదని సమావేశంలో నిర్ణయించారు.



ప్రపంచంలోనే ఎత్తైన పోలింగ్ స్టేషన్ తషిగాంగ్ వద్ద ఓటర్లు

ముగిసిన ఏడు వారాల ఎన్నికలు

- ఏడో దశలో 61% పోలింగ్.. సిబ్బందికి ఈసీ కృతజ్ఞతలు
- నేడు సిక్కిం, అరుణాచల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

న్యూఢిల్లీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడు వారాలుగా ఏడు దశలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. శనివారం జరిగిన చివరి విడతలో 61.63% పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. చివరి విడతలో దేశవ్యాప్తంగా 57 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో యూపీలో 13 స్థానాలు, బిహార్‌లో 8, పంజాబ్‌లో 13, పశ్చిమబెంగాల్‌లో 9, ఒడిశాలో 6, హిమచల్‌ప్రదేశ్‌లో 4, జార్ఖండ్‌లో 3, చండీగఢ్‌లో ఒక స్థానం ఉన్నాయి. ఒడిశాలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా చివరిదశలోనే ఎన్నికలు జరిగాయి. బిహార్‌లో 51.92%, చండీగఢ్‌లో 67.9%, హిమాచల్ ప్రదేశ్‌లో 69.67%, జార్ఖండ్‌లో 70.66%, ఒడిశాలో 70.67%, పంజాబ్‌లో 58.33%, యూపీలో 55.59%, పశ్చిమబెంగాల్‌లో 73.36% పోలింగ్ జరిగినట్లు ఈసీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలతో పాటే అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరిగాయి. కాగా, పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు, వలంటీర్లు, రైల్వేకు ఈసీ కృతజ్ఞతలు తెలిపింది. 'భారతీయ ప్రజాస్వామ్యం, భారత ఎన్నికలు మరోసారి మ్యాజిక్ చేశాయి. కులం, మతం, సామాజిక, ఆర్థిక, విద్యా నేపథ్యాలకు అతీతంగా భారతీయ ఓటర్లు తమ గొప్పదనాన్ని మరోసారి చాటుకున్నారు' అని ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 19న జరిగిన తొలిదశతో ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియలో ఆఖరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఈ నెల 4వ తేదీన జరగనుంది. కాగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ మొదలవుతుందని ఈసీ తెలిపింది.

ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానందుడి స్మారకమందిరంలో చేపట్టిన 45 గంటల ధ్యానం శనివారం మధ్యాహ్నం ముగిసింది. తన జీవితంలోని ప్రతి క్షణం ప్రజాసేవకే అంకితమని ఈ సందర్భంగా వివేకానందుని స్మారకమందిరం విజిటర్స్ పుస్తకంలో మోదీ తన సందేశాన్ని రాశారు. 'వివేకానంద స్మారక మందిరం సందర్శనతో నాకు అద్భుతమైన దివ్య శక్తి ప్రాప్తించినట్టు అనిపిస్తోంది. స్వామి వివేకానంద ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి మార్గదర్శకుడు. ఆయనే నాకు స్ఫూర్తి. స్వామి వివేకానంద దేశమంతా పర్యటించిన తర్వాత ఇక్కడే ధ్యానం చేశారు. భారతదేశ పునరుజ్జీవనానికి కొత్త మార్గాన్ని ఆయన ఇక్కడే కనుగొన్నారు. ఇదే స్థలంలో ధ్యానం చేసే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. నా జీవితంలోని ప్రతి క్షణం, నా శరీరంలోని ప్రతి కణం దేశ సేవకే అంకితం చేస్తానని భారత మాత పాదాల వద్ద కూర్చొని మరోసారి పునరుద్ఘాటిస్తున్నా' అని విజిటర్స్ పుస్తకంలో మోదీ పేర్కొన్నారు. ధ్యానం ముగించిన తర్వాత ఆయన సమీపంలోనే ఉన్న 133 అడుగుల ఎత్తయిన తమిళ కవి తిరువళ్లువర్ విగ్రహాన్ని మోదీ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రధాని ఢిల్లీకి వెళ్లారు.

రాహుల్ 7న విచారణకు హాజరుకావాలి

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం 40% కమీషన్ తీసుకుంటోందంటూ చేసిన ప్రకటనలకు సంబంధించిన కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఈ నెల 7న విచారణకు హాజరు కావాలని కోర్టు సూచించింది. 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా రాహుల్ ఈ ఆరోపణలు చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశవప్రసాద్ కోర్టులో ప్రైవేటు కేసు వేశారు. సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం కోర్టుకు హాజరయ్యారు. రాహుల్‌గాంధీ తరఫున న్యాయవాదులు హాజరయ్యారు. దీంతో, 7న రాహుల్ గాంధీ కోర్టుకు తప్పక హాజరు కావాలని న్యాయాధికారి సూచించారు.

పీవోకే మాది కాదు.. అది విదేశీ భూభాగమే

- ఇస్లామాబాద్ హైకోర్టులో పాక్ ప్రభుత్వం అంగీకారం

న్యూఢిల్లీ, జూన్ 1: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) విదేశీ భూభాగమని, దానిపై పాకిస్థాన్‌కు ఎలాంటి అధికార పరిధి లేదని పాక్ ప్రభుత్వం అంగీకరించింది. కశ్మీరీ కవి, జర్నలిస్టు అహ్మద్ ఫర్హాద్ షా కిడ్నాప్ కేసు విచారణలో భాగంగా ఇస్లామాబాద్ హైకోర్టు ముందు పాక్ అదనపు అటార్నీ జనరల్ ఈ మేరకు ప్రకటన చేశారు. మే 15న రావల్పిండిలో అపహరణకు గురైన ఫర్హాద్ షా కేసును హైకోర్టు విచారిస్తోంది. శుక్రవారం విచారణలో భాగంగా ఫర్హాద్ షాను కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని జస్టిస్ కయానీ ఆదేశించారు. దీనికి అటార్నీ జనరల్ సమాధానమిస్తూ.. ఫర్హాద్ షా పీవోకేలో పోలీసుల కస్టడీలో ఉన్నారని, కశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగం కలిగిన విదేశీ భూభాగమని, అక్కడ పాక్ చట్టాలు చెల్లుబాటు కావని పేర్కొన్నారు.

మోదీ మ్యాజిక్!

(మొదటి పేజీ తరువాయి)

భారత్ - మ్యాట్రిజ్; రిపబ్లిక్ టీవీ- పి మార్క్; టుడేస్ చాణక్య తదితర సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తేల్చాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ జట్టు కట్టినా.. కుల గణన, రిజర్వేషన్ల అంశాలను తెరపైకి తెచ్చినా.. వాటినే ఎన్నికల అంశాలుగా మార్చినా ఇండియా కూటమి పెద్దగా ప్రభావం చూపించలేక పోయిందని స్పష్టం చేశాయి. ఒక్క దైనిక్ భాస్కర్ వినహా మిగిలిన అన్ని సంస్థలు ఎన్డీయే కూటమికి 350 సీట్లకు పైనే వస్తాయని; ఇండియా కూటమికి 200 స్థానాల్లోపు వస్తాయని అంచనా వేశాయి. ఎన్డీటీవీ పోల్ ఆఫ్ పోల్స్ సర్వే ప్రకారం.. ఎన్డీయేకు 361; ఇండియా కూటమికి 145; ఇతరులకు 37 సీట్లు లభించనున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నాలుగో తేదీన వెలువడనున్న సంగతి తెలిసిందే.

దక్షిణాదిలో పాగా..

ఇప్పటి వరకూ ఉత్తరాదికి, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమైన బీజేపీ.. ఈసారి దక్షిణాదిలోనూ గణనీయమైన సంఖ్యలో సీట్లను సాధించనుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మరీ ముఖ్యంగా, ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట, విద్యాధికుల రాష్ట్రమైన కేరళలో బీజేపీ ఖాతా తెరవనుంది. ఇక్కడ బీజేపీకి 1-3 సీట్లు వస్తాయని ఎగ్జిట్స్ పోల్స్ చెబుతున్నాయి. తమిళనాడులోనూ బీజేపీ సీట్ల సంఖ్య పెరగనుందని అంచనా వేశాయి. ఇక్కడ బీజేపీకి అనూహ్యంగా 5 నుంచి 7 సీట్ల వరకు లభించవచ్చని ఇండియా టీవీ- సీఎన్ఎక్స్, జన్ కీ బాత్ తేల్చాయి. తద్వారా.. రాబోయే పార్లమెంటులో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచీ బీజేపీ ప్రాతినిధ్యం ఉండనుందని స్పష్టం చేస్తున్నాయి. అంతేనా.. గత ఎన్నికల ఫలితాల్లో అసలు ప్రాతినిధ్యమే లేని ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి కూటమిలో భాగస్వామిగా గణనీయ సంఖ్యలో సీట్లు సాధించుకోనుందని, కర్ణాటకలో పట్టును నిలుపుకోనుందని; తెలంగాణలో మరింత విస్తరించనుందని ఆయా ఎగ్జిట్ పోల్స్ సంస్థలు తెలిపాయి. కర్ణాటకలో ఎన్డీయే 23-25 సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా పోల్‌తోపాటు న్యూస్ 18 సంస్థ అంచనా వేసింది.

తూర్పులో అధికారం దిశగా...

బీజేపీ ఎప్పటి నుంచో కన్నేసిన ఒడిసా, పశ్చిమ బెంగాల్‌లలో ఆ పార్టీ లక్ష్యం దిశగా సాగుతోందని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు విశ్లేషిస్తున్నాయి. ఒడిసాలో బీజేపీ ఈసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజారిటీ సీట్లు దక్కించుకుంటుందని అత్యధిక ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఇక, పశ్చిమ బెంగాల్లో గతంలో కంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని, ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్‌ను మించి లోక్‌సభ సీట్లను సాధిస్తుందని విశ్లేషిస్తున్నాయి. ఇక, జార్ఖండ్‌లోనూ బీజేపీయే పైచేయి సాధిస్తుందని, బిహార్లో ఈసారి కూడా ఎన్డీయే కూటమికే మెజారిటీ సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయి. వెరసి, తూర్పులోనూ రాబోయే రోజుల్లో అధికారం దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని సంకేతాలు ఇస్తున్నాయి.

ఉత్తరాది మళ్లీ కాషాయమయమే

ఉత్తరాదితోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ బీజేపీయే ఆధిక్యం ప్రదర్శించబోతోందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ కనుమరుగు కానుందని విశ్లేషిస్తున్నాయి. గుజరాత్, ఢిల్లీలో బీజేపీ క్లీన్ స్వీప్ చేయనుందని తెలిపాయి. గుజరాత్‌లో మళ్లీ మొత్తం 26 సీట్లు బీజేపీయే సాధిస్తుందని న్యూస్ 18 చెబితే.. న్యూస్ 24- టుడేస్ చాణక్య ప్రకారం పంజాబ్‌లో బీజేపీకి 4, కాంగ్రెస్‌కు 4, ఆప్‌కు 2 సీట్లు లభించే అవకాశం ఉందని తెలిపింది. హరియాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఎప్పట్లాగే బీజేపీకే మెజారిటీ సీట్లు రానున్నాయని తేల్చి చెప్పాయి. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌లలో మొత్తం సీట్లు బీజేపీకే దక్కనున్నాయని టుడేస్ చాణక్య అంచనా వేసింది. ఒక్క మహారాష్ట్రలో ఇండియా కూటమి కాస్త పోటీ ఇచ్చినా.. ఎన్డీయే కూటమికే మెజారిటీ స్థానాలు వస్తాయని అంచనా వేశాయి. మహారాష్ట్రలో ఎన్డీయేకు 32-35, ఇండియా కూటమికి 15-18 మధ్య సీట్లు లభిస్తాయని న్యూస్ 18 సంస్థ తేల్చింది.



ఎగ్జిట్ కావడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తే ఈ ఎగ్జిట్ పోల్స్‌కు సూత్రధారి. 'ఇండియా' కూటమి కనీసం 295 సీట్లు సాధిస్తుంది. దిగిపోతున్న ప్రధాని మాపై మానసికంగా దెబ్బ తీయడానికి ఇలాంటి ఆటలు ఆడుతున్నారు. అసలు ఫలితాలు భిన్నంగా ఉంటాయి.

- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



మోదీ మూడోసారి ప్రధాని అయితే నా తలగొరిగించుకొంటాను. ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పు అని జూన్ 4న తేలిపోతుంది. మోదీ మళ్లీ ప్రధాని కాలేరు. రాసి పెట్టుకోండి.

- సోమనాథ్ భారతి, ఆప్ నేత



ప్రతిపక్ష కూటమి 295కు పైగా సీట్లు సాధించి కేంద్రంలో సుస్థిర, సమర్థ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. బీజేపీకి సొంతంగా 220కి మించి సీట్లు రావు. ఎన్డీయే మొత్తానికి 235 దాకా రావొచ్చు. ఇది ప్రజల మాట.

- కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

సర్వే సంస్థ	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా	361-401	131-166	8-20
ఏబీపీ-సీ వోటర్	353-383	152-182	4-12
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	371-401	109-139	28-38
రిపబ్లిక్ టీవీ-పీ మార్క్	359	154	30
టైమ్స్ నౌ-ఈటీజీ	358	152	33
ఇండియా న్యూస్	371	125	47
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
జన్ కీ బాత్	362-392	141-161	10-20
టుడేస్ చాణక్య	385-415	96-118	27-45
రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్	353-368	118-133	43-48
ఎన్డీటీవీ పోల్ ఆఫ్ ద పోల్స్	361	145	37
పోల్‌స్టార్ట్ ప్లస్	346	162	35

3 రోజుల్లో 'ఇండియా' విజయోత్సవాలు: స్టాలిన్

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): 'ఇండియా' కూటమి విజయోత్సవాలకు మరో మూడు రోజులు మాత్రమే ఉందని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను తరిమికొట్టారని శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. "బీజేపీ పదేళ్ల ఫాసిస్ట్ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడి దేశాన్ని రక్షించేందుకు ఏర్పాటైన ఇండియా కూటమి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి విజయం అంచున ఉంది. తమను ఎదిరించే శక్తి లేదన్న భ్రమలో ఉన్న బీజేపీకి దీటుగా ఈ కూటమి ఆవిర్భవించింది. కూటమి నేతలు దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రచార సభలతో బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను తరిమికొట్టారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి నేతలు మరింత అప్రమత్తతో ఉండాలి. ఈ నెల 4వ తేదీ దేశ విముక్తి కోసం పడే తొలి అడుగు" అని స్టాలిన్ అన్నారు.

లోకం తీరు



నాగపూర్‌లో 56 డిగ్రీలు.. సెన్సర్ లోపం వల్లే కావొచ్చు

న్యూఢిల్లీ, జూన్ 1: నాగపూర్‌లో నమోదైన 56 డిగ్రీల ఉష్ణోగ్రత సరైంది కాదని, ఆటోమాటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో సెన్సర్ లోపం వల్ల తప్పుడు ఫలితం వచ్చి ఉంటుందని ప్రాంతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. ఆటోమాటిక్ వ్యవస్థలు ఒక్కోసారి తప్పుడు నివేదికలు ఇస్తాయని వివరించింది. "ఏడబ్ల్యూఎస్ ఉన్న ప్రాంతంలో పరిస్థితులు, సెన్సర్లలో లోపాలు, సెన్సర్లు దెబ్బతినడం, వాటి భద్రత కవచం దెబ్బతినడం వల్ల తప్పుడు ఉష్ణోగ్రతలను చూపుతాయి. మే 30న నాగపూర్ స్టేషన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలు సరైనవి కావు" అని పేర్కొంది. కాగా.. ఢిల్లీలోని ముంగేశ్‌పూర్ వద్ద గతనెల 29న 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వడం వెనక సెన్సర్‌లో లోపమే ప్రధాన కారణమని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) డైరెక్టర్ జనరల్ ఎం.మొహాపాత్ర శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వాస్తవ ఉష్ణోగ్రత 49.9 డిగ్రీలని వివరించారు. కాగా, ఇలాంటి సమాచారం విడుదల చేసే ముందు నాణ్యత నిర్ధారణ తప్పనిసరి కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరెణ్ రిజిజు 'ఎక్స్'లో సూచించారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూ ఢిల్లీ, జూన్ 1: ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌కు రూ.69 చొప్పున తగ్గించాయి. కాగా ఇళ్లలో వినియోగించే 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ల ధరను మాత్రం రూ.803 వద్దే ఉంచాయి. విమాన ఇంధనం ధరను ఏకంగా 6.5 శాతం తగ్గించాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,676కు చేరుకుంది. వరుసగా మూడో నెల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించడం విశేషం. మే 1న రూ.19 తగ్గించగా... ఏప్రిల్ 1న రూ.30.5 తగ్గించాయి. కాగా పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయి.

సల్మాన్ ఖాన్‌ను చంపేందుకు.. రంగంలోకి మైనర్లు!

- పాక్ నుంచి ఆయుధాలు
- బిష్ణోయ్ గ్యాంగ్ కుట్ర




ముంబై, జూన్ 1: బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌ను అంతమొందించేందుకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ భారీ కుట్ర పన్నిందని, ఇందుకు మైనర్ బాలురను రంగంలోకి దింపిందని నవీ ముంబై పోలీసులు గుర్తించారు. ఇందుకోసం కెనడాలో ఉంటున్న బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్, గోల్డీబ్రార్ తమ గ్యాంగ్‌కు పాకిస్థాన్ నుంచి ఏకే-47, ఏకే-92, ఎం-16 ఆయుధాలను తరలించినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. ఇందుకు పాక్‌లోని డోగర్ అనే ఆయుధాల డీలర్ సహకరించినట్లు ఆధారాలు సేకరించారు. ఏప్రిల్ 14న బంద్రాలోని సల్మాన్ ఇంటి వద్ద బైక్‌పై వచ్చి ఇద్దరు దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే..! ఈ కేసులో పోలీసులు నిందితులు.. గుజరాత్‌లో తలదాచుకున్న విక్కీ గుప్తా అలియాస్ సాగర్‌పాల్, పంజాబ్‌లో ఉన్న అంజూ థాపన్, మరో వ్యక్తితోపాటు తదుపరి దర్యాప్తులో ఇంకో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసులో అన్మోల్, గోల్డీబ్రార్ మరో 17మందిపై పోలీసులు కేసునమోదు చేశారు.

ఓట్ల కోసం నోట్ల వర్షం!

ఒక్కో ఓటుకు రూ.1,400 వినియోగం

- దాదాపు రూ.1.35 లక్షల కోట్ల ఖర్చు
- భారీగా ఖర్చు చేసిన పార్టీలు, నాయకులు
- సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వెల్లడి



న్యూఢిల్లీ, జూన్1: దేశంలో 7 దశల్లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కరెన్సీ పరుగులు పెట్టింది. ఓటర్లపై నోట్ల వర్షం కురిసింది. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా అత్యంత ఖరీదైన ఎన్నికలుగా ఈ ఎన్నికలు చరిత్ర సృష్టించాయి. తాజా ఎన్నికల్లో దాదాపు రూ.1.35 లక్షల కోట్లు ఖర్చయినట్టు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వెల్లడించింది. దీని ప్రకారం ఒక్కో ఓటుకు రూ.1,400 ఖర్చు చేసినట్టు ఈ సంస్థ అంచనావేసింది. పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. తాజా ఎన్నికల్లో ఈ హద్దులు చెరిగిపోయినట్టు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తెలిపింది. రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో ప్రధాన పార్టీలు విరివిగా ఖర్చు చేశాయని..ముఖ్యంగా అధికార పార్టీ బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు చేతికి ఎముకలేకుండా ఖర్చు చేశాయని ఈ అధ్యయనం తెలిపింది. ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఎన్నికల్లో రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు పెడతారని అంతా భావించారు. కానీ, అంచనాలను మించి రూ.1.35 లక్షల కోట్ల వరకు నాయకులు, పార్టీలు ఖర్చు చేసినట్టు అధ్యయనం తెలిపింది. ఇది 2019 ఎన్నికలతో పోల్చితే రూ.55-60 వేల కోట్లు ఎక్కువని పేర్కొంది. అమెరికాలో 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రూ.1.2 లక్షల కోట్లు ఖర్చు కాగా భారత్ దీన్ని అధిగమించింది. ఇక సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95లక్షలే ఖర్చు చేయాలని పేర్కొంది. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.28లక్షల నుంచి రూ.40లక్షల మధ్య ఖర్చు పెట్టాలని నిబంధనలు విధించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎంపీ అభ్యర్థి రూ.75లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.28 లక్షలే ఖర్చు చేయాలని పేర్కొంది. ఎవరూ ఈ పరిమితులను పట్టించుకోలేదని అధ్యయన సంస్థ వెల్లడించింది. రాజకీయ పార్టీల ఖర్చులపై నిబంధనలు విధించకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్‌సహా అన్ని ప్రాంతీయ పార్టీలు విచ్చలవిడిగా ఖర్చు చేశాయని తెలిపింది. ఓటర్లను ప్రలోభపరిచే కానుకలు, నగదు పంపిణీ వంటివి గోప్యంగా సాగినట్టు పేర్కొంది.

ఇంతింతై.. అన్నట్టే!

దేశంలో 1951-52 మధ్య జరిగిన ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రూ.25 వేలే ఖర్చు చేయాలని నిబంధన విధించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ఖర్చు రూ.75-95 లక్షలకు పెంచారు. తొలి ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఖర్చు ఏకంగా 300 రెట్లు పెరిగినట్టయింది. 1998లో రూ.9,000 కోట్లున్న ఎన్నికల వ్యయం 2019నాటికి రూ.55 వేల కోట్లకు చేరింది. మొత్తంగా తాజా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు, నాయకులు కరెన్సీ కట్టలు కురిపించారు.

తెలంగాణలో నువ్వా నేనా!

కాంగ్రెస్-బీజేపీ మధ్య పోటాపోటీ.. అయినా, సీట్లలో బీజేపీదే పైచేయి

బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ అనుమానమే!

ఎగ్జిట్ పోల్స్ సర్వే అంచనా

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా అంటూ పోటీ పడ్డాయా!? ఫలితాల్లోనూ ఆ రెండూ ఢీకొంటున్నాయా!? రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉనికిని కోల్పోనుందా!? ఈ ప్రశ్నలకు ఎగ్జిట్ పోల్స్ సర్వేలు 'ఔను' అనే అంటున్నాయి. శనివారం సాయంత్రం వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థల అంచనా ప్రకారం.. కాంగ్రెస్, బీజేపీ సమాన సీట్లను సాధించనున్నాయి. మరికొన్ని సంస్థలు అయితే.. కాంగ్రెస్ కంటే బీజేపీయే పైచేయి సాధిస్తుందని అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆరా సర్వే సంస్థ, ఏబీపీ-సీ ఓటర్, పీపుల్స్ పల్స్ సంస్థలు రెండు పార్టీలు దాదాపు సమాన సంఖ్యలో సీట్లు గెలుచుకుంటాయని పేర్కొన్నాయి. కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధించనున్న స్థానాల్లో వరంగల్, పెద్దపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, నాగర్ కర్నూలు, భువనగిరి ఉన్నాయని అనేక సంస్థలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ గెలుపొందనున్న అన్ని స్థానాల్లోనూ బీజేపీ రెండో స్థానంలో, బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉండనున్నాయి. ఇండియా టుడే, న్యూస్-18, జన్ కీ బాత్, ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ సంస్థలు మాత్రం బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని విశ్లేషించాయి. గత ఎన్నికల్లో 4 స్థానాల్లో బీజేపీ గెలిచింది. వీటిలో ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్ ఉన్నాయి. వీటిని నిలబెట్టుకోవడంతోపాటు చేవెళ్ల, మల్కాజిగిరి, జహీరాబాద్ స్థానాల్లోనూ విజయం సాధించే అవకాశాలున్నాయని ఈ సంస్థలు పేర్కొన్నాయి. అన్ని సంస్థల కంటే భిన్నంగా బీజేపీ 11-12 స్థానాలను కైవసం చేసుకుంటుందని ఇండియా టుడే - మై యాక్సిస్ సంస్థ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 43 శాతం ఓట్లను సాధిస్తుందని అంచనా వేసింది. బీజేపీ 7-10 స్థానాలను కైవసం చేసుకుంటుందని సీఎన్ఎన్ సంస్థ తెలిపింది.



సంస్థ	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	ఎంఐఎం
ఆరా	7-8	8-9	0	1
ఏబీపీ-సీఓటర్	7-9	7-9	0	1
పీపుల్స్ పల్స్	7-9	6-8	0-1	1
ఇండియా టీవీ	6-8	8-10	0-1	1
న్యూస్ 18	5-8	7-10	0-1	0-1
జన్‌కీ బాత్	4-7	9-12	0-1	1
ఆపరేషన్ చాణక్య	8	7	1	1
ఇండియ టీవీ -మై యాక్సెస్	4-6	11-12	0	1
సిఎన్ఎన్	5-8	7-10	2-5	1

బీఆర్ఎస్ 9 నుంచి 0కు

రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని మూటగట్టుకోనుందని దాదాపు అన్ని సర్వే సంస్థలు అంచనా వేశాయి. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఆ పార్టీ ఓటమి పాలవ్వనుందని దాదాపు అన్ని సంస్థలు తేల్చి చెప్పాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికంగా 9 స్థానాలు సాధించిన గులాబీ పార్టీ.. ఈసారి అన్నిచోట్ల మూడో స్థానానికి పరిమితం కానుందని వివరించాయి. ఒక్క సీఎన్ఎన్ మాత్రమే బీఆర్ఎస్ 2-5 స్థానాలు సాధించే అవకాశముందని పేర్కొంది.

ఏపీలో టీడీపీ కూటమిదే విజయం!

(మొదటి పేజీ తరువాయి)


వస్తున్న ఓటర్ల నుంచి తెలుసుకున్న అభిప్రాయ సేకరణ కావడంతో వీటిని ఎగ్జిట్ పోల్స్‌గా పిలుస్తున్నారు. మిగిలిన సర్వేలతో పోలిస్తే ఇవి వాస్తవ ఫలితాలకు దగ్గరగా ఉంటాయన్న అభిప్రాయం ఉండడంతో ప్రజల్లో వీటిపై అమితమైన ఆసక్తి వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సర్వేలు నిర్వహించిన జాతీయ స్థాయి మీడియా సంస్థల్లో ఎక్కువ.. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి భారీ విజయం సాధించబోతున్నట్లు తెలిపాయి. ఒక్క టైమ్స్ నౌ-సీటీజీ మాత్రం వైసీపీ రెండోసారి గెలవబోతున్నట్లు అభిప్రాయపడింది. జాతీయ స్థాయి సర్వేలన్నీ ఎంపీ సీట్ల ప్రాతిపదికగానే జరిగాయి. టీడీపీ కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పూర్తి సమన్వయ సహకారాలతో పనిచేశాయని.. అధికార పక్షంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో మార్చుకోవడంలో విజయం సాధించాయని 'ఇండియాటుడే' చానల్ చర్చలో పలువురు విశ్లేషకులు అభిప్రాయపడడం గమనార్హం. ఇదిలా ఉండగా, రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ జనసేనకు భారీ విజయాన్ని సూచిస్తున్నాయి. ఎక్కువ సర్వే సంస్థలు ఆ పార్టీ 15 నుంచి 18 అసెంబ్లీ స్థానాల్లో గెలవబోతున్నట్లు తెలిపాయి. అలాగే పోటీచేసిన రెండు లోక్‌సభ స్థానాలు.. మచిలీపట్నం, కాకినాడలో కూడా విజయం సాధించనుందని పేర్కొన్నాయి. గత ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీచేసి ఓటమిపాలైన ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్.. ఈసారి పిఠాపురంలో 40-50 వేల మెజారిటీతో గెలుస్తారని వెల్లడించాయి. పొత్తులో భాగంగా జనసేన 21 అసెంబ్లీ సీట్లలో పోటీచేసింది.

జాతీయ స్థాయి సంస్థల సర్వే అంచనాలు (ఎంపీ సీట్లు)

సంస్థ	టీడీపీ కూటమి	వైసీపీ
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	19-23	3-5
సీఎన్ఎన్-న్యూస్18	19-22	5-8
ఏబీపీ-సీ వోటర్	21-25	0-4
టైమ్స్ నౌ-సీటీజీ	11	14
టుడేస్ చాణక్య	22	3
రిపబ్లిక్ టీవీ-మాట్రిజ్	18	7
ఇండియాటుడే	21-23	2-4

రాష్ట్ర స్థాయి సర్వే సంస్థల అంచనాలు (అసెంబ్లీ సీట్లు)

సంస్థ	టీడీపీ కూటమి	వైసీపీ
కేకే సర్వేస్	161	14
పీపుల్స్ పల్స్	111-135	45-60
ఆరా	71-81	94-104
రైజ్	103-118	48-60
స్మార్ట్ సర్వే	93	82



చంద్రబాబును ఆయన నివాసంలో కలుసుకొన్న సాయిబాబా, నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్ తదితరులు

తెలంగాణలో టీడీపీ బలోపేతంపై దృష్టి

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం కండి

తెలంగాణ ముఖ్య నాయకులతో చంద్రబాబు

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో టీడీపీ బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తానని, తనకు రెండు తెలుగు రాష్ట్రాలు ముఖ్యమేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. తన నివాసంలో శనివారం సాయంత్రం తెలంగాణ టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పార్టీ పటిష్ఠత కోసం రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీకి ఉద్యుక్తులు కావాలన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను అవగాహన చేసుకుని టీడీపీ కార్యకర్తలు స్వతంత్రంగా వ్యవహరించాలని, తద్వారా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని సూచించారు. తెలంగాణలో టీడీపీ గత వైభవం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు 14 మంది మృతి

- రాష్ట్రవ్యాప్తంగా భానుడి భగభగలు
- 45 డిగ్రీలపైగానే ఉష్ణోగ్రతలు నమోదు
- నేడు, రేపు వర్షాలు.. ఏపీలోకి 'నైరుతి'!



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో ఎండలు తీవ్రత కొనసాగుతోంది. మూడ్రోజులుగా 45 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడదెబ్బకు జనం పిట్టల్లా రాలుతున్నారు. శనివారం ఒక్క రోజే 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 45.7, జగిత్యాల జిల్లా కొల్వాయిలో 45.5, అదే జిల్లా జైనా 45.3, మంచిర్యాల జిల్లా తపాల్‌పూర్, జన్నారంలో 45.1, జగిత్యాల జిల్లా అయిలాపూర్‌లో 45 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గజలాపురంలో వెంకట్‌రెడ్డి (55), అదే జిల్లా చందంపేట మండలం కంబాలపల్లిలో చిన్న పిచ్చయ్య (38), ఖమ్మం జిల్లా మధిరలో కుంచెం నాగరాజు (49), అదే జిల్లా తల్లాడ మండలం మంగాపురంలో వెంకటేశ్వర్లు (63), దమ్మపేట మండలం కొమ్ముగూడెంలో రాముడు (56) ఎండలకు తాళలేక అస్వస్థతతో మృతి చెందారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో అన్నవ్వ (86), పెద్దపల్లి జిల్లా ధర్మారంలో గుర్తు తెలియని వ్యక్తి (35), మంచిర్యాల జిల్లా భీమారంలో ఇరికిల్ల సంపత్ (40), సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సంపత్ (42), హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటలో ఐలయ్య (85), ములుగు జిల్లా మంగపేట మండలం గంపోనిగూడెంలో రాము (39), అదే జిల్లా వాజేడు మండలం చంద్రుపట్లకు చెందిన ఆర్ఎంపీ గొర్ల నర్సింహారావు (50), భూపాలపల్లి జిల్లా చిట్యాలలో రంగయ్య (52), జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్‌లో లచ్చమ్మ (68) వడదెబ్బతో మరణించారు.

రెండ్రోజులు వర్షాలు..

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండ్రోజులు పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 43 డిగ్రీల్లోపే నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. ఇక నైరుతి రుతుపవనాలు ఆదివారం కేరళలోని మిగిలిన ప్రాంతాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఏపీలోని రాయలసీమలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది.

సర్వం సిద్ధం



హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని చాంద్రాయణగుట్ట కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో మొత్తం 2.18 లక్షల పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయని, వీటి లెక్కింపు కోసం 276 కౌంటింగ్ టేబుళ్లు, ఈవీఎంల ఓట్ల లెక్కింపు కోసం 1,855 టేబుళ్లను ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. శనివారం బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల గురించి ఆయన వివరించారు. ఈ మేరకు, తొలుత స్ట్రాంగ్ రూంల నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలిస్తారు. 4వ తేదీన ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈవీఎంలను టేబుళ్లపైకి చేర్చడం, లెక్కించడం, సరిపోల్చుకోవడం, వాటిని రిటర్నింగ్ అధికారి నిర్ధారించుకుని ప్రకటించడం వంటి ప్రక్రియల కారణంగా తొలి రౌండు ఫలితం వెల్లడికి గంటరన్నర సమయం పట్టనుంది. ఆ తర్వాతి రౌండ్లు త్వరితగతిన పూర్తవుతాయి. ఒక్కో రౌండుకు 20 నిమిషాల సమయం పట్టే అవకాశముంది. మధ్యాహ్నం 3 గంటలకల్లా తొలి ఫలితం వెలువడుతుంది. అన్ని లోక్‌సభ స్థానాల ఫలితాలు సాయంత్రం 4, 5 గంటలకల్లా వెల్లడవుతాయి. అత్యల్పంగా నిజామాబాద్ లోక్‌సభ స్థానంలోని ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం, ఖమ్మం లోక్‌సభ స్థానంలోని అశ్వారావుపేట, మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలోని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపు 13 రౌండ్లలోనే పూర్తి కానుంది. కరీంనగర్‌లోని చొప్పదండి, హైదరాబాద్ స్థానంలోని యాకుత్‌పురా, నల్లగొండలోని దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపు అత్యధికంగా 24 రౌండ్ల వరకు కొనసాగుతుంది. చాలా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 18 నుంచి 21 రౌండ్లలో పూర్తవుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఐదు పోలింగ్ స్టేషన్లను ర్యాండమ్‌గా ఎంపిక చేసి, వాటిలోని వీవీప్యాట్‌ల ఓటర్ స్లిప్పులను లెక్కిస్తారు. వాటిని, ఈవీఎంలలోని ఓట్లతో సరిపోల్చుకుంటారు. ప్రతి రౌండు ఫలితానికి సంబంధించి రాజకీయ పార్టీల ఏజెంట్లు ఫామ్ '17 సీ'పై సంతకం చేయాల్సి ఉంటుంది. అనంతరం రిటర్నింగ్ అధికారి సంతకం చేస్తారు. ఆ తర్వాత కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ ఫలితాన్ని ప్రకటిస్తారు. ఫలితాల కోసం 78 ప్రాంతాల్లో స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత

కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వికాస్‌రాజ్ వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మొత్తం 12 కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. మూడు దశలుగా బందోబస్తు ఉంటుందని, మొదటి దశ కింద కౌంటింగ్ హాల్‌లో, రెండో దశ కింద కౌంటింగ్ క్యాంపస్‌లో, మూడో దశ కింద కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు భద్రత ఉంటుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లోకి ఎలాంటి వాహనాలను అనుమతించబోమని, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తీసుకురావడానికి వీల్లేదని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బందికి సెల్‌ఫోన్‌లకు అనుమతి ఉండదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని ప్రతి మూలనూ కవర్ చేసేలా సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు ఈవీఎంల తరలింపు కోసం ప్రత్యేక మార్గాలుంటాయని, ఈ మార్గాలకు బారికేడ్లు, పటిష్ఠ భద్రత ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం 10 వేల మంది సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటున్నామని, నియోజకవర్గాలవారీగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ర్యాండమ్‌గా కేటాయిస్తామన్నారు. లెక్కింపు రోజు ఉదయం 5 గంటలకు మరోసారి ర్యాండమ్‌గా సిబ్బందిని కేటాయిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 49 మంది కేంద్ర అబ్జర్వర్లు, 2,414 మందికి పైగా మైక్రో అబ్జర్వర్లు ఉంటారని పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కలుపుకొని 800 మంది వరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిబ్బంది ఉంటారన్నారు. కౌటింగ్ రోజున మద్యం దుకాణాలు మూసి ఉంచాలని తెలిపారు. ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు అనుమతి ఇస్తే ర్యాలీలు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ల కోసం 135 ఈటీపీబీఎస్ స్కానర్లను ఏర్పాటు చేశామని వికాస్‌రాజ్ వెల్లడించారు. ఆదివారం ఉదయం 8 గంటల వరకు ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్లను అనుమతిస్తామన్నారు.

'పాలమూరు ఎమ్మెల్సీ' ఉప ఎన్నిక కౌంటింగ్ నేడే

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం మహబూబ్‌నగర్‌లో జరుగుతుందని వికాస్‌రాజ్ తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు తక్కువగానే ఉండటంతో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే విజేత ఎవరో వెంటనే తేలిపోతుందన్నారు. మార్చి 28న ఉప ఎన్నికపోలింగ్ జరగగా, ఏప్రిల్ 2వ తేదీనే కౌంటింగ్ జరగాల్సి ఉంది. అయితే, ఈ ఫలితం ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పడుతుందన్న కోణంలో కౌంటింగ్‌ను జూన్ 2కు వాయిదా వేశారు.

5న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ ఈ నెల 5న నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లిలో జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవుతుందని, నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో 24 టేబుళ్లు ఉంటాయని, మొత్తం 900 మంది సిబ్బంది నియమించామని వివరించారు. ఈ స్థానానికి మొత్తం 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు పెరిగిన జీతాలు

- పీఆర్‌సీ మేరకు వేతనాల పెంపుదల.. ఒకటో తేదీనే చెల్లింపు

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ నిరీక్షణ అనంతరం 2017 నాటి పీఆర్‌సీ ప్రకారం పెంచిన వేతనాలు ఆర్టీసీ కార్మికులకు అమల్లోకి వచ్చాయి. నెల మొదటి తేదీనే వేతనాలు కూడా ఇచ్చారు. పీఆర్‌సీ అమలుతోపాటు పెరిగిన వేతనాలు ఠంచన్‌గా అందడంతో ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఆర్థిక సమస్యలతో సతమతమయింది. సకాలంలో వేతనాలు ఉద్యోగులు ఆందోళన చెందేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీ మేరకు మొదటి తేదీనే జీతాలు ఇస్తోంది. 2017 నాటి పీఆర్‌సీ కింద 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి 'మే' నెల నుంచి అమలు చేస్తామని మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని ప్రస్తుతం అమలు చేసింది. కార్మికుల జీతం కనిష్ఠంగా రూ.5వేల వరకు పెరిగింది. సుమారు 42వేల మంది కార్మికులు, ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలను జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 13 ఎంపీ సీట్లు గెలుస్తాం

- బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదు: మంత్రి కోమటిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 1: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ 13 సీట్లు గెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నిజామాబాద్‌లో కాంగ్రెస్ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. బీఆర్ఎస్‌లో ముగ్గురో, ఆరుగురో ఎమ్మెల్యేలే మిగులుతారని వ్యాఖ్యానించారు. జూన్ 4 తర్వాత ఆ పార్టీ గురించి మాట్లాడదలుచుకోలేదన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతం, రాష్ట్ర అధికారిక లోగోపై కేటీఆర్ ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. జూన్ 5 నుంచి ప్రభుత్వం దృష్టంతా అభివృద్ధి పైనే ఉంటుందన్నారు. యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో రోడ్ల పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. బోధన్ చక్కెర కర్మాగారాన్ని పునఃరుద్ధరిస్తామని తెలిపారు.

మేడిగడ్డతో మేలు కంటే కీడే ఎక్కువ: కూనంనేని

గోదావరిఖని, జూన్ 1: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టుతో మేలుకంటే కీడే ఎక్కువ జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన సింగరేణి వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... కేసీఆర్ అన్ని సంస్థలను ఆర్థికంగా కుదేలు చేశారని విద్యుత్, ఇరిగేషన్‌తో పాటు సింగరేణిని కూడా నాశనం చేశారని ఆరోపించారు. సింగరేణిలో గత సీఎండీ శ్రీధర్ వేల కోట్లు దోపిడీ చేశారని, దానిపై న్యాయమూర్తితో విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, పెద్దపల్లి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

1.) E1/2208/2023/PDPL/2024, తేది:01.06.2024, 2) మొత్తం పనులు: 04 పనులు, అంచనా విలువ : రూ.7.99 లక్షలు 3)బిడ్ డాక్యుమెంట్లు అందుబాటు తేది: 01.06.02024న మ.03.30 గం.లకు, 4) బిడ్లు సమర్పించుటకు ఆఖరి తేది: 04.06.2024న సా. 04.00 గం.ల వరకు. 5) టెక్నికల్ బిడ్ తెరచు తేది & సమయం: 04.06.2024న సా.04.01 గం.లకు 6) బిడ్ ధర తెరచు తేది & సమయం: 04.06.2024న సా. 04.30 గం.లకు. 7)సంబంధిత అధికారి పేరు & చిరునామా: ఆకుల వెంకటేష్, కమీషనర్, పెద్దపల్లి మునిసిపాలిటీ, జిల్లా. పెద్దపల్లి, మరిన్ని వివరాలకు సంప్రదించండి ఆకుల వెంకటేష్, కమీషనర్, సెల్ నం: 9100902361 మరియు కె.సతీష్ కుమార్, MAE సెల్ నం.: 9490862431.

సం/- కమిషనర్, పెద్దపల్లి మునిసిపాలిటీ

DIPR RO No: 111-PP/CL/ADVT/1/2024-25 తేది:01.06.2024

'వైటీపీఎస్' పనుల అప్పగింతలో
అవకతవకలపై దర్యాప్తు ముమ్మరం

» ప్లాంట్‌ను పరిశీలించిన కమిటీ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి


జస్టిస్ నరసింహారెడ్డి

దామరచర్ల, జూన్ 1: నల్లగొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్మాణ పనుల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తుది నివేదికను ప్రభుత్వానికి అప్పగిస్తానని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. విచారణ కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన శనివారం దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో వైటీపీఎస్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. టెండర్లు పిలవకుండానే కాంట్రాక్టు పనులను అప్పగించారనే అభియోగంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. దీనిపై అప్పటి అధికారులను సమాధానం చెప్పాలని కోరినట్లు తెలిపారు. అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరామన్నారు. వివిధ సంస్థలకు చెందిన పలువురు ముందుకు వచ్చారని, వారి నుంచి త్వరలో వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. పూర్తి విచారణ నివేదికను మూడు నెలల్లో ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. వైటీపీఎస్‌లోని మొదటి యూనిట్ ఆగస్టు నెలలో, రెండో యూనిట్ సెప్టెంబరులో, ఆరు నెలల తర్వాత మిగిలిన యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారని ఆయన చెప్పారు.

రేపే తెలంగాణ లాసెట్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల డిగ్రీతో పాటు ఐదేళ్ల సమీకృత డిగ్రీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన తెలంగాణ లాసెట్- పీజీలాసెట్ పరీక్ష జూన్ 3న సోమవారం జరగనుంది. ఈ పరీక్షకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 68 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడేళ్ల డిగ్రీ లా కోర్సులో ప్రవేశానికి ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల దాకా ఒక సెషన్, ఆ తర్వాత మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 2 గంటల దాకా రెండో సెషన్లలో పరీక్ష జరగనుంది. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీతో పాటు పీజీ లాసెట్‌లో ప్రవేశాల కోసం సాయంత్రం 4 గంటల నుంచి 5:30 గంటల దాకా పరీక్ష జరగనుంది. కాగా, నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. ఆయా పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను http://lawcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విదేశీయులకు పౌరసత్వం కేసు..
మధ్యవర్తి ప్రియా ధర్మలింగం అరెస్టు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి, విదేశీయులకు భారత పౌరసత్వం/పాస్‌పోర్టు ఇప్పించిన కేసులో సీఐడీ అధికారులు కీలక నిందితురాలిని అరెస్టు చేశారు. ఆమెతోపాటు.. మరో ఇద్దరు మహిళలను అరెస్టు చేయడంతో.. ఇప్పటి వరకు ఈ కేసులో పట్టుబడ్డ వారి సంఖ్య 26కు చేరింది. భారత్‌లోకి అక్రమంగా చొరబడ్డ 21 మంది శ్రీలంక దేశస్థులకు తమిళనాడుకు చెందిన మధ్యవర్తి ప్రియా ధర్మలింగం సహకరించారు. ఆమె ఫేక్ పాస్‌పోర్టు గ్యాంగ్‌తో కలిసి.. వీరికి పాస్‌పోర్టులు ఇప్పించారు. ఇలా అడ్డదారిలో భారత పౌరసత్వం పొందినవారంతా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రియా ధర్మలింగంతోపాటు.. చెన్నైలో ప్రైవేటు ఉద్యోగి అయిన వరునియ తిరువన ఉక్కరాసు, జె.సంజికను అరెస్టు చేసినట్లు సీఐడీ చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. ఇప్పటి వరకు 16 మంది పాస్‌పోర్టు ఏజెంట్లు, స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఆరుగురు పోలీసులు, పాస్‌పోర్టు సేవా కేంద్రం ఉద్యోగి ఒకరు, ముగ్గురు శ్రీలంక జాతీయులు అరెస్టయ్యారు. తాజాగా పట్టుబడ్డ ముగ్గురితో కలిపి.. అరెస్టుల సంఖ్య 26కు చేరింది.

మోదీది అత్యంత ద్వేషపూరిత ప్రచారం: ఒవైసీ

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేశప్రధాని నరేంద్రమోదీ చేసిన ఎన్నికల ప్రచారం భారతదేశ చరిత్రలోనే అత్యంత ద్వేషపూరితమైనదని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. దురదృష్టవశాత్తు ఆయన మళ్లీ ప్రధాని అయితే రానున్న కాలంలో ముస్లింలపై ద్వేషం మరింత తీవ్రమవుతుందని ఆయన ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు.

చెన్నుపాటి కిడ్నాప్ కేసులో..
ఇద్దరు నిందితులకు అరెస్టు నుంచి రక్షణ

» ఈ నెల 20 వరకు అరెస్టు చేయొద్దు: హైకోర్టు

క్రియా హెల్త్‌కేర్ ప్రైవేట్ కంపెనీ చీఫ్, వ్యాపారవేత్త చెన్నుపాటి వేణు మాధవ్‌ను అపహరించి, బెదిరించి, బలవంతంగా 40% వాటా షేర్లను బదిలీ చేయించుకున్న కేసులో.. హైకోర్టు ఇద్దరు నిందితులకు అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు సహకారంతో తనను కిడ్నాప్ చేసి, బలవంతంగా షేర్ల బదిలీ చేయించారని వేణుమాధవ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే..! ఈ కేసులో ఏ2గా ఉన్న గోల్డ్‌ఫిష్ కంపెనీ సీఈవో చంద్రశేఖర్ వేగె, ఏ7గా ఉన్న తలసిల్ల రాజశేఖర్‌ను ఈ నెల 20 వరకు అరెస్టు చేయకూడదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులిద్దరూ ఈ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తమను నిర్దోషులుగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేస్తూ.. అప్పటి వరకు నిందితులను అరెస్టు చేయొద్దని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

మానవ అవయవ అక్రమ రవాణా మాఫియా
మాస్టర్‌మైండ్ రాంప్రసాద్ అరెస్ట్

» హైదరాబాద్‌లో పట్టుకున్న కేరళ పోలీసులు

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ అవయవ అక్రమ రవాణా మాఫియాలో మాస్టర్‌మైండ్‌గా ఉన్న రాంప్రసాద్‌ను కేరళ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. విజయవాడకు చెందిన బి.రాంప్రసాద్ అలియాస్ ప్రతాప్ మానవ అవయవ అక్రమ రవాణా ముఠాలో మాస్టర్‌మైండ్ అని ఎర్నాకుళం రూరల్ ఎస్పీ వైభవ్ సక్సేనా తెలిపారు. అతను మొదట తన కిడ్నీ దానం చేసేందుకు ముఠాతో సంప్రదింపులు జరిపాడు. అయితే అనారోగ్య కారణాలతో కిడ్నీ ఇచ్చేందుకు వీలుకాలేదు. ఆ తర్వాత ముఠాతో చేతులు కలిపి అంతర్జాతీయ మానవ అవయవ అక్రమ రవాణాలో సూత్రధారిగా మారాడు. సోషల్ మీడియాలో అవయవ దానం పేరుతో గ్రామీణ ప్రాంత ప్రజల్ని ఆకర్షించి ఇరాన్‌కు తరలించేవాడు. ఇక్కడి నుంచి పంపించే వారిని ఇరాన్‌లో నాసర్ రిసీవ్ చేసుకునేవాడు. అవయవదానం తర్వాత వారికి కొంత మొత్తం చెల్లించి భారత్‌కు తిప్పి పంపేవారు. నాసర్‌ను కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇదివరకే అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వైభవ్ తెలిపారు. నాసర్‌తోపాటు మరో ఇద్దరు కీలక నిందితులనూ అరెస్ట్ చేశామని, అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న రాంప్రసాద్‌ను శనివారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

ఫలితాల రోజు మద్యం దుకాణాలు బంద్

ఎన్నికల ఫలితాలు వెలువడనున్న 4న రాష్ట్రంలోని మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ పాటించాలని పోలీసుశాఖ ఆదేశాలు జారీచేసింది. బార్లు, రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లు, క్లబ్‌లలోనూ మద్యం సరఫరా చేయకూడదని పేర్కొంది.

..రాలేను

(మొదటి పేజీ తరువాయి)

చేసిందనేది దాచేస్తే దాగని సత్యంగా పేర్కొన్నారు. ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీలో విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురిని పొట్టన పెట్టుకున్నదని, తొలిదశ ఉద్యమంలో 369 మంది యువకులను కాల్చి చంపిందని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ఆ పార్టీ మోసాలతో వందల మంది యువకులు ప్రాణత్యాగాలకు పాల్పడినపా ఏనాడూ పశ్చాత్తాపం ప్రకటించలేదని, అమరుల స్థూపం ఆవిష్కరణకు అడ్డుపడి కర్కశంగా వ్యవహరించిందన్నారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి జరిగిన చారిత్రాత్మక ప్రయత్నమే టీఆర్ఎస్ ఆవిర్భావంగా వివరించారు.

సీఎం అయ్యాక జై తెలంగాణ అన్నారా?

వక్రీకరణలు మాని చేసిన తప్పులకు గాను క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీని కేసీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ సీఎం అయ్యాక జై తెలంగాణ అనలేదని, అమరవీరుల స్థూపాన్ని సందర్శించలేదని ఆక్షేపించారు. ఆరు నెలల్లోనే ప్రజా జీవితం అస్తవ్యస్తమైందన్నారు. తాము అన్ని రంగాలకూ 24 గంటల కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ వచ్చాక అప్రకటిత కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్పారని, కృత్రిమ కరువును సృష్టించి, నీళ్లను సముద్రం పాల్జేశారని, మోదీ ప్రభుత్వం గోదావరి నీటినీ తరలించుకుపోయే ప్రణాళికలు వేస్తుంటే ప్రభుత్వం గుడ్లప్పగించి నిల్చుందని, రాజకీయ ప్రయోజనాల కోసం చోద్యం చూస్తున్నదని వ్యాఖ్యానించారు.

హామీల అమలు ఏమైంది?

"వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయి. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన ఒక్క రైతునూ సీఎం పరామర్శించలేదు. సకాలంలో రైతు బంధు ఇవ్వడంలో దారుణంగా విఫలమయ్యారు. డిసెంబరు 9లోగా రుణమాఫీ చెయ్యకపోవడంతో అన్నదాతకు మార్గాలు మూసుకుపోయాయి. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఎప్పుడిస్తారు?" అని కేసీఆర్ నిలదీశారు. వ్యవసాయం తిరిగి సంక్షోభం వైపు పయనిస్తున్నదని, పచ్చి రొట్ట విత్తనాల కోసం రైతులు క్యూ కట్టాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు. సమైక్య రాష్ట్ర పరిస్థితులు పునరావృతం ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఆటో కార్మికులను, రైతు కూలీలకు ఇచ్చిన హామీల సంగతేమిటని, మహాలక్ష్మి పథకం ఏమైందని ప్రశ్నించారు. వృద్ధులకు రూ.4 వేలు ఎప్పుడిస్తారని కేసీఆర్ నిలదీశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల ప్రజలు ట్యాంకర్ల కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితిలోకి వెళ్లారని, డయాగ్నస్టిక్ కేంద్రాలు నిర్వీర్యమయ్యాని, కరెంటు కోతలతో అత్యవసర వైద్య సేవలకు విఘాతం కలుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ ఆస్పత్రి నిర్మాణం కుంటుపడుతోందన్నారు. ఆడపిల్ల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఏమైందో తెలియదు కానీ, కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు రాకపోగా.. ఉన్న పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయన్నారు. ప్రశ్నించే వారిపై భౌతిక దాడులకు దిగుతున్నారని.. ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను హత్య చేసే దుష్ట సంస్కృతిని కాంగ్రెస్ తీసుకొస్తోందని కేసీఆర్ విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోస్టులు పెడితే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.

అమరులకు కేసీఆర్ నివాళి

అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్


తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కేసీఆర్ తదితరులు

కవాడిగూడ/మంగల్‌హట్/అఫ్జల్‌గంజ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను బీఆర్ఎస్ ప్రారంభించింది. దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే..! ఇందులో భాగంగా కేసీఆర్ గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొవ్వొత్తిని చేతబట్టి పార్టీ నాయకులతో కలిసి.. సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభించారు. కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పార్టీ నేతలు పాల్గొని.. అమరవీరుల స్థూపం వరకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ గీతాలను ఆలపించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ మట్టి బిడ్డగా గర్వపడుతున్నా: కేటీఆర్

అమరవీరుల స్థూపం వద్ద కేటీఆర్ ఉద్వేగంగా మాట్లాడారు. "మాజీ సీఎం కేసీఆర్ 24 ఏళ్ల క్రితం టీఆర్ఎస్‌ను ప్రారంభించారు. 2001 ఏప్రిల్ నుంచి 2014 జూన్ వరకు అవిశ్రాంత పోరాటం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. వెనుకడుగు వేయలేదు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలమైంది. ఇక్కడ కనిపిస్తోన్న అందమైన సచివాలయం, అమరవీరుల జ్యోతి, ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం తెలంగాణలో జరిగిన అభివృద్ధికి చిన్న ఉదాహరణ" అని వివరించారు. తెలంగాణ మట్టి బిడ్డగా గర్వపడుతున్నానన్నారు. పదేళ్లు విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని, దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పారు.

అమరుల స్మరించుకోవద్దా..?

అమరుల త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో వారిని స్మరించుకునే అవకాశాన్ని రేవంత్ ప్రభుత్వం కల్పించడం లేదని బాల్క సుమన్, రసమయి ఆరోపించారు. కొవ్వొత్తుల ర్యాలీకి అనుమతినిచ్చిన సర్కారు.. మైకుల వినియోగంపై నిషేధం విధించిందని వాపోయారు. "మైకులను పోలీసులు తీసుకెళ్లి మా గొంతులను ఆపలేరు. అమరుల త్యాగాలను స్మరించుకునేందుకు గాయకుల గొంతులు, ప్రజల కోరస్ చాలు. పోలీసుల తీరు సరైంది కాదు" అని వ్యాఖ్యానించారు. కాగా.. పోలీసులు మైకులను తీసుకెళ్లే సమయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బాల్క సుమన్ తదితరులు వారితో వాగ్వాదానికి దిగారు.

నేటి అర్ధరాత్రి నుంచి
'టోల్' బాదుడు!

హైదరాబాద్-విజయవాడ హైవేలో పెరుగుతున్న టోల్ గేట్ ఫీజు

టోల్ ధరల పట్టికలో ధరలు సవరిస్తున్న జీఎంఆర్ సిబ్బంది



» టోల్ యూజర్ చార్జీ రూ.3 పెంపు

కేతేపల్లి, జూన్ 1: టోల్ ప్లాజాల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేసే టోల్ ఫీజు ధరల పెంపునకు రంగం సిద్ధమైంది. ప్రతీ ఏడాది ఏప్రిల్ 1 నుంచి టోల్ ధరలు 5 శాతం పెంచుతుంటారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ధరల పెంపు ఈసారి తాత్కాలికంగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు పూర్తవ్వడంతో ఈ నెల మూడో తేదీ నుంచి(ఆదివారం అర్ధరాత్రి) నుంచి పెంచిన టోల్ ధరలు అమలులోకి రానున్నాయి. రాష్ట్రంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాల్లో టోల్ చార్జీలను ఆదివారం అర్ధరాత్రి తర్వాత నుంచి పెంచుతున్నారు. హైదరాబాద్- విజయవాడ మార్గంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలను జీఎంఆర్ ఏర్పాటు చేసింది. టోల్‌చార్జీల పెంపును జూన్ 3(సోమవారం) ఉదయం నుంచి అమలు చేస్తున్నామని కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి సతీష్ తెలిపారు. వాహనాల సామర్థ్యం ఆధారంగా ఒక్కో వాహనానికి ఒకవైపు, ఇరువైపుల ప్రయాణానికి కలిపి కనిష్ఠంగా రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.40 మేర చార్జీలు పెరిగాయి. అలాగే టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన స్థానిక వాహనాల నెలవారీ పాసు ధరను రూ.330 నుంచి రూ.340కి పెంచారు. ఇక,పెరిగిన టోల్ ఫీజుల భారాన్ని ఆర్టీసీ ప్రయాణికులపైనే వేస్తోంది. ఆర్టీసీకి చెందిన వివిధ సర్వీసుల్లో ప్రయాణించే ఒక్కో ప్రయాణికుడిపై రూ.3 అదనపు భారం పడనుంది. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యం సవరించిన చార్జీలతో సర్క్యులర్‌ను శుక్రవారమే జారీ చేసింది.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద జూన్ 2 నుంచి పెరగనున్న టోల్‌ఫీజులు

వాహనం పేరు	సింగల్ జర్నీ	రిటర్న్ జర్నీ	నెలవారీ
	(పాత రేటు- కొత్త రేటు రూ.ల్లో)		
కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనం	90-95	135-145	2965-3200
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వాహనాలు	140-150	210- 230	4685- 5055
బస్ లేదా ట్రక్	290- 315	435- 470	9685-10455
హెవీ కన్‌స్ట్రక్షన్, ఎర్త్ మూవింగ్ వాహనాలు	450-485	675-725	14970-16155
పెద్ద వాహనాలు	560-605	845-910	18740-20225

కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద

వాహనం పేరు	సింగల్ జర్నీ	రిటర్న్ జర్నీ	నెలవారీ
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనాలు	125-130	190-195	4225-4335
లైట్ వాణిజ్య, లైట్ వస్తువాహనాలు, మినీ బస్సు	190-195	300-310	6710-6880
బస్సు లేక ట్రక్కు, (రెండు యాక్సిల్స్)	415-430	625-640	13,910-14,265
భారీ నిర్మాణ,మల్టీయాక్సిల్ వాహనాలు	645 -665	970-995	21,570- 22,120
భారీ పరిమాణ వాహనాలు	805- 825	1210-1240	26,840-27,525

పత్తి రైతుల ఆందోళనలపై
ప్రభుత్వం సీరియస్

» ఆదిలాబాద్ జిల్లాలో ఏఈవోపై వేటు

ఆదిలాబాద్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో విత్తనాల కోసం పత్తి రైతుల ఆందోళనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. కొద్ది రోజులుగా పత్తి విత్తనాల కోసం రైతులు ఆందోళనలకు దిగుతుండడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం రాశి-659 విత్తనాలు దొరకడంలేదంటూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పంజాబ్‌చౌరస్తాలో రైతులు రాస్తారోకోకు దిగారు. జిల్లా కేంద్రానికి చెందిన నిఖిల్ ఫెర్టిలైజర్ యజమాని విత్తనాలను ఓ వాహనంలో తరలిస్తుండగా రైతులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోగా దీనిపై విచారణ జరిపిన వ్యవసాయ శాఖాధికారుల నివేదిక ఆధారంగా పోలీసులు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. మరోవైపు విధులపట్ల నిర్లక్ష్యం వహించాడన్న కారణంతో యాపల్‌గూడ క్లస్టర్ ఏఈవో శివచరణ్‌పై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటువేశారు. అయితే జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య నిర్లక్ష్యంతోనే విత్తనాల కొరత ఏర్పడిందంటూ తెలంగాణ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించాలన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు
అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

వరంగల్ క్రైం, జూన్ 1: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం మండలంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఒకర్ని పోలీసులు అరెస్టు చేశారు. మరో గ్రామంలో నిషేధిత గడ్డి మందును అమ్ముతున్న మరో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు సంఘటనల్లో రూ.10లక్షల విలువైన 310 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1.10 లక్షల విలువైన 122 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ వివరాలను వెల్లడించారు.

కాళేశ్వరం బ్యారేజీలను
సందర్శించిన నిపుణుల కమిటీ

» మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పరిశీలన

» వివిధ అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం

» జ్యుడీషియల్ కమిషన్‌కు నివేదిక..!


మేడిగడ్డ బ్యారేజీ వద్ద అధికారులతో నిపుణుల బృందం

మహదేవపూర్/కాటారం(మహదేవపూర్‌రూరల్)/మంథని రూరల్, జూన్ 1: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ శనివారం సందర్శించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని జ్యుడీషియల్ కమిషన్‌కు సాంకేతిక అంశాల్లో సాయమందించేందుకు ఈ కమిటీని వేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ తొలుత మేడిగడ్డ బ్యారేజీపైన బ్రిడ్జి కుంగిపోయిన ప్రాంతంతో పాటు బ్యారేజీ అప్, డౌన్ స్ట్రీమ్‌లలో దెబ్బతిన్న ప్రాంతాలు, మరమ్మతులను క్షుణ్ణంగా పరిశీలించింది. బ్లాక్-7లో కుంగిపోయి బాగా దెబ్బతిన్న పియర్స్‌ను, తెరుచుకోకుండా బిగుసుకుపోయిన గేట్లను, బ్యారేజీ ఆప్రాన్‌ను, పియర్స్ కింది నుంచి నీరు లీకేజీ అవుతున్న తీరును పరిశీలించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు చేపడుతున్న మరమ్మతులను గమనించింది. బ్లాక్-7లో యంత్రాల సాయంతో తెరవడానికి ప్రయత్నించగా బిగుసుకుపోయిన గేట్ల కటింగ్, షీట్ ఫైల్స్ అమరిక, సీసీ బ్లాక్స్ పునరుద్ధరణ, డ్రిల్లింగ్, గ్రౌటింగ్ పనులను నిశితంగా పరిశీలించింది. అనంతరం బ్యారేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పలు విషయాలపై ఆరాతీశారు. అనంతరం అన్నారం బ్యారేజీని సందర్శించి.. అక్కడి సీపేజీలు, బుంగలతో దెబ్బతిన్న 28, 35, 38, 44 నంబర్ల పియర్స్‌ను సభ్యులు పరిశీలించారు. బ్యారేజీ ప్రాంతమంతా కలియతిరిగి పలు అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. సీసీ బ్లాక్‌ల పునరుద్ధరణ, గ్రౌటింగ్ కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. అక్కడి నుంచి సాయంత్రానికి సుందిళ్ల బ్యారేజీని చేరుకొని.. పరిశీలన జరిపారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ డౌన్ స్ట్రీమ్ ప్రాంతంలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ త్వరలో బ్యారేజీల సందర్శనకు రానున్న నేపథ్యంలో నిపుణుల కమిటీ జియో టెక్నికల్, జియాలజికల్ డేటాపై దృష్టి సారించి క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 2 జూన్ 2024



వెండితెరపై హిట్ కాంబినేషన్లకు ఉండే క్రేజే వేరు. ఒక సినిమా సక్సెస్ అయితే ఆ మూవీలోని హీరో, హీరోయిన్ లేదా హీరో, డైరెక్టర్ లేదా డైరెక్టర్, ప్రొడ్యూసర్ కాంబినేషన్‌ను లక్కీ సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. ఆ కాంబో మళ్లీ వెండితెరపైన ఎప్పుడు మ్యాజిక్ చేస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తుంటే.. ఆ క్రేజ్‌ను సినిమా ప్రమోషన్స్‌కు, ఓపెనింగ్స్‌కు ఆపాదించుకొని క్యాష్ చేసుకోవాలని నిర్మాతలు ఇష్టపడుతుంటారు. ప్రస్తుతం థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్న హీరో, డైరెక్టర్ కాంబోలివే.



సూర్యకు జంటగా





బుట్టబొమ్మ పూజాహెగ్డే మళ్లీ సౌత్ సినిమాల్లో రీ ఎంట్రీ ఇస్తోంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా ఓ చిత్రం (సూర్య 44-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది.

ఈ చిత్రంలో పూజాహెగ్దేను కథానాయికగా ఎంపిక చేసినట్లు యూనిట్ శనివారం ప్రకటించింది. గతంలో విజయ్ సరసన 'బీస్ట్' చిత్రంలో పూజాహెగ్డే నటించారు. సూర్యతో కలసి నటించడం ఇదే తొలిసారి. అండమాన్ దీవుల్లో ఆదివారం నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 2 డి ఎంటర్టైన్‌మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

తెలుగులో వరుస అపజయాలు ఎదురవడంతో బాలీవుడ్‌లో కొన్ని సినిమాల్లో ప్రయత్నం చేసినా అవేవీ పూజా కెరీర్‌కు ఊపునివ్వలేదు.

నా కల నిజమైంది



బాలీవుడ్‌లో ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో నటించే అవకాశం దక్కించుకుంది యువ కథానాయిక శర్వారి. దినేష్ విజన్స్ సంస్థ నిర్మించిన హారర్ కామెడీ 'ముంజ్యా' తో పాటు యష్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తున్న స్పై యూనివర్స్‌లో కూడా ఆమె నటిస్తోంది. ఇందులో అలియా భట్‌తో పాటు శర్వారి స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. ఈ రెండు చిత్రాల్లో 'ముంజ్యా' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా శర్వారి మాట్లాడుతూ ' రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో నేను భాగం అయినందుకు ఆనందంగా ఉంది. ఈ స్థాయికి చేరుకోవడానికి నేనెంతో కష్టపడ్డాను. ఇప్పటి వరకూ నేను ఒకే ఒక్క సినిమాలో నటించాను. అయితే టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించి చిత్ర పరిశ్రమ నాకు మంచి అవకాశాలు కల్పించడం థ్రిల్లింగ్‌గా ఉంది. ఆదిత్య చోప్రా రూపొందిస్తున్న స్పై థ్రిల్లర్‌లో నటించడంతో నా కల నెరవేరింది' అని చెప్పింది శర్వారి. ఈ సినిమాలతో పాటు నిఖిల్ అద్వానీ నిర్మిస్తున్న 'వేద'లో కూడా నాకు మంచి అవకాశం లభించింది' అని ఆనందంతో చెప్పిందామె. ఈ సినిమాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకాన్ని శర్వారి వ్యక్తం చేసింది.

హిట్టు కాంబినేషన్ మరోసారి

తిక్కుంది.. లెక్కుంది.. అంతులేని కిక్కుంది

పవన్‌కల్యాణ్‌కు దాదాపు దశాబ్ద కాలం తర్వాత 'గబ్బర్ సింగ్' రూపంలో ఇండస్ట్రీ హిట్ ఇచ్చారు డైరెక్టర్ హరీశ్ శంకర్. 'గబ్బర్ సింగ్' సినిమాతో వసూళ్ల సునామీతో పాటు వెండితెరపైన అభిమానులకు పూనకాలు తెప్పించిన ఈ సినిమాను పవన్ ఫ్యాన్స్ ఇప్పటికీ మర్చిపోలేదు. వింటేజ్ పవన్‌ను అభిమానులకు మళ్లీ గుర్తుచేసిన డైరెక్టర్ హరీశ్, పవన్ అభిమానులకు ఆరాధ్యదైవంగా మారిపోయారు. ఆ సినిమాలోని డైలాగ్ 'నాక్కొంచెం తిక్కుంది..కానీ దానికో లెక్కుంది' లాగా ఈ కాంబోకు కొంచెం తిక్కుంది.. లెక్కుంది.. అంతులేని కిక్కుంది. దాదాపు పుష్కర కాలం తర్వాత ఈ కాంబో మరోసారి అభిమానులను పలకరించనుంది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. తమిళ చిత్రం 'తెరి'కి రీమేక్‌గా పలు మార్పుచేర్పులతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా నుంచి విడుదలైన 'భగత్స్ బ్లేజ్' అనే టీజర్‌లో పవన్ పలికిన పవర్‌ఫుల్ సంభాషణలు సినిమాపై అంచనాలను పదింతలు పెంచేశాయి.

సినీ లవర్స్‌ను ఉర్రూతలూగించేలా..

విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన రివెంజ్ డ్రామా 'రంగస్థలం' సినిమాలో రామ్‌చరణ్‌ను సరికొత్తగా వెండితెరకు పరిచయం చేశారు డైరెక్టర్ సుకుమార్. ఆ సినిమాలోని 'చిట్టిబాబు' పాత్రతో తన నటనా విశ్వరూపం చూపించి.. విమర్శకుల ప్రశంసలతో పాటూ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ను అందుకున్నారు రామ్‌చరణ్. ఆరేళ్ల తర్వాత ఈ కాంబో మరోసారి సినిమా ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు చేతులు కలిపింది. త్వరలోనే 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమా 2025 ద్వితీయార్థంలో ప్రేక్షకులను పలకరించనుంది.

నాలుగోసారి మ్యాజిక్ చేయడానికి...

'జులాయి' సినిమాతో లాజిక్‌తో పాటు మ్యాజికల్ ఎంటర్టైన్‌మెంటును.. 'సన్నాఫ్ సత్యమూర్తి'తో ఫాదర్ సెంటిమెంట్‌తో తెరపైన హత్తుకునే భావోద్వేగాలను పండించి.. 'అల వైకుంఠపురంలో' మూవీతో ఫ్యామిలీ ఆడియెన్స్‌కు మరిచిపోలేని థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌కు చిరునామాగా మారారు అల్లుఅర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ మూడు సినిమాల్లో అల్లుఅర్జున్, నటన, త్రివిక్రమ్ మార్క్ సన్నివేశాలు, సంభాషణలు ఆడియెన్స్ నుంచి కాసుల పంట కురిపించాయి. మాస్, క్లాస్ ప్రేక్షకులను సమానంగా అలరించిన ఈ హిట్ కాంబో నాలుగోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యింది. ప్రస్తుతం 'పుష్ప 2' సినిమా చిత్రీకరణలో ఉన్న అల్లుఅర్జున్.. ఆ సినిమా తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించనున్నారు. 'ఏఏ22' ఈ సినిమా వర్కింగ్ టైటిల్.

థియేటర్లలో పూనకాలు తెప్పించేలా..

'జనతా గ్యారేజ్' సినిమాతో ఎన్టీఆర్‌కు భారీ సక్సెస్‌ను అందివ్వడమే కాకుండా మలయాళంలోను ఆయనకు మంచి ఫ్యాన్ బేస్‌ను తెచ్చిపెట్టారు డైరెక్టర్ కొరటాల శివ. ఈ సినిమాలో ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, ఆయన క్యారెక్టర్ అందరినీ విపరీతంగా ఆకట్టుకున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ సంచలన కాంబో మరోసారి 'దేవర' సినిమాతో థియేటర్లలో మాస్ హంగామా సృష్టించనుంది. అక్టోబర్ 5న పాన్ ఇండియా లెవెల్లో విడుదల కానున్న ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. ఇప్పటికీ విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్, టైటిల్ సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్‌ను క్రియేట్ చేసి థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ఉన్నాయి.

మాస్ జాతర

రవితేజ, హరీశ్ శంకర్ కలయికలో మొదటిసారి 2006లో 'షాక్' సినిమా తెరకెక్కింది. ఈ సినిమా కమర్షియల్ సక్సెస్‌ను అందుకోకపోయినా.. విమర్శకుల నుంచి మంచి ప్రశంసలే పొందింది. ఆ తర్వాత 2011లో కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మిరపకాయ్' సినిమాతో రవితేజ, హరీశ్ శంకర్ జోడీ హిట్టు కొట్టింది. సినిమాలో రవితేజ ఎనర్జీని ఫుల్‌గా వాడుకున్న హరీశ్.. సినిమాలోని కామెడీ, యాక్షన్ సీన్స్‌కు థియేటర్లలో ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించి, విజిల్స్ వేయించారు. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో పదమూడు ఏళ్ల తర్వాత ఈ హిట్ కాంబో రిపీట్ అవుతోంది. ఈ సినిమా థియేటర్లలో 'మిరపకాయ్'లాగే మాస్ జాతరను తిరిగి తెస్తుందని టీమ్ విశ్వాసంతో ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోన్న 'మిస్టర్ బచ్చన్'ను ఈ ఏడాదే రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌తో

మెగాస్టార్ చిరంజీవితో తమిళ దర్శకుడు మోహన్‌రాజా 'గాడ్‌ఫాదర్' సినిమాను తెరకెక్కించారు. ఇది 2019లో పృథ్విరాజ్ సుకుమారన్ డైరెక్షన్‌లో మోహన్‌లాల్ నటించిన మలయాళ సూపర్ హిట్ చిత్రం 'లూసిఫర్'కి రీమేక్ అని తెలిసిందే. ఈ రీమేక్ సినిమా బాక్సాఫీస్ భారీ హిట్‌ను అందుకోలేకపోయినా ఇందులో గ్యాంగ్‌స్టర్‌గా, లోకల్ లీడర్‌గా టూ షేడ్స్‌లో చిరు చేసిన పవర్‌ఫుల్ పర్ఫామెన్స్ అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవలే చిరు మోహన్‌రాజాతో మరో సినిమాను చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మించనున్నారు.





విభిన్న తరహా కథాంశంతో ఓవైపు.. మాసీ అవతార్‌లో మరోవైపు

ప్రస్తుతం నడుస్తోన్న ఈ ట్రెండుకు రెండడుగులు ముందంజలోనే ఉన్నారు నాని. అందరూ ఒక సినిమాను నయా కాంబినేషన్‌లో.. ఇంకో సినిమాను రిపీట్ కాంబినేషన్‌లో చేస్తుంటే .. ఆయన ఒకేసారి తనకు హిట్స్‌ను అందించిన ఇద్దరు డైరెక్టర్స్‌తో వర్క్ చేస్తున్నారు. 2022లో విడుదలై డిఫరెంట్ ఫిల్మ్‌గా మల్టీప్లెక్స్ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న చిత్రం 'అంటే సుందరానికి' ఈ సినిమా డైరెక్టర్‌తో ప్రస్తుతం విభిన్న తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న 'సరిపోదా శనివారం' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఆగస్టు 29న విడుదలవుతోంది. అలాగే 2023లో నాని నటించిన చిత్రం 'దసరా'. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ డైరెక్టర్‌తో ఇంకో సినిమాను ప్రకటించారు నాని. 'నాని 33' వర్కింగ్ టైటిల్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆయన మాసీ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాను 2025 సమ్మర్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.







'ఆకాశం నీ హద్దు రా' ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తో...

తమిళ నటుడు సూర్య నటించిన ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆకాశం నీ హద్దు రా'. డెక్కన్ ఎయిర్‌లైన్స్ వ్యవస్థాపకుడు జి.ఆర్ గోపీనాథ్ జీవితం స్ఫూర్తితో ఫిక్షన్‌ను జోడించి సుధా కొంగర ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రేక్షకుల హృదయాల్ని గెలిచిన ఈ సినిమాను అక్షయ్‌కుమార్ హిందీలోనూ రీమేక్ చేశారు. 'ఆకాశం నీ హద్దు రా' ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తో ప్రస్తుతం సూర్య, సుధాకొంగరతో కలసి మరో సినిమాలో నటిస్తున్నారు. 'సూర్య 43' ఆ సినిమా వర్కింగ్ టైటిల్.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు







ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
షూటింగ్ స్టార్స్	హాలీవుడ్ మూవీ	జూన్ 03
హిట్లర్ అండ్ నాజీస్	వెబ్‌సిరీస్	జూన్ 05
హౌటూ రాబ్ ఎ బ్యాంక్	హాలీవుడ్ మూవీ	జూన్ 05
బడేమియా ఛోటేమియా	హిందీ చిత్రం	జూన్ 06
స్వీట్ టూత్	వెబ్‌సిరీస్	జూన్ 06
హిట్ మాన్	హాలీవుడ్ మూవీ	జూన్ 07
పర్ఫెక్ట్ మాచ్ 2	వెబ్‌సిరీస్	జూన్ 07
అమెజాన్ ప్రైమ్		
మైదాన్	హిందీ చిత్రం	జూన్ 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
గునాహ్	హిందీ సిరీస్	జూన్ 03
క్లిప్ప్‌డ్	వెబ్‌సిరీస్	జూన్ 04
స్టార్‌వార్స్ : ది ఎకోలైట్	వెబ్‌సిరీస్	జూన్ 04
ది లెజెండ్ ఆఫ్ హనుమాన్	హిందీ సిరీస్	జూన్ 05
సోనీ లివ్		
గుల్లక్	హిందీ సిరీస్	జూన్ 07
వర్షన్గల్క్కు శేషం	మలయాళ చిత్రం	జూన్ 07
ఆహా...		
బూమర్ అంకుల్	తమిళ చిత్రం	జూన్ 07
బుక్ మై షో		
ఎబిగైల్	హాలీవుడ్ మూవీ	జూన్ 07
జియో సినిమా		
లాఫ్టర్ షెఫ్	కామెడీ షో	జూన్ 01
బ్లాక్ అవుట్	హిందీ చిత్రం	జూన్ 07

వెంకటేశ్‌కు బ్లాక్ బస్టర్ హిట్



తన తమ్ముడు వెంకటేశ్‌కు ఒక బ్లాక్ బస్టర్ హిట్ ఇవ్వాలని, మాస్ హీరోగా నిలబెట్టాలని నిర్మాత సురేశ్‌బాబు ప్లాన్ చేసి నిర్మించిన భారీ చిత్రం బొబ్బిలి రాజా. సురేశ్ ప్రొడక్షన్స్ బేనరుపై అంతకుముందు ఒకటో రెండో చిత్రాలకు నిర్మాతగా సురేశ్‌బాబు పేరు పెట్టినప్పటికీ వాటి నిర్మాణంలో ఆయన పాత్ర తక్కువే. అయితే సురేశ్ సంస్థ రజతోత్సవ సంవత్సరంలో నిర్మించిన 'బొబ్బిలి రాజా' చిత్ర నిర్మాణ బాధ్యతలు పూర్తిగా సురేశ్‌బాబుకే అప్పగించారు రామానాయుడు. చిత్రకథ ఎన్నుకోవడం దగ్గర్నుంచి తొలికాపీ వచ్చేవరకు ప్రతి దశలోనూ సురేశ్ బాబు ప్రమేయం ఉంది. ఈ చిత్రవిజయం కోసం ఆయన పడిన కష్టం మాటలలో వర్ణించలేనిది.

ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్



హీరో విలేజ్ నుండి సిటీకి వెళ్లి ప్రతీకారం తీర్చుకునే పాయింట్ తో కథ సిద్ధం చేశారు పరుచూరి సోదరులు. అయితే ఇందులో కొత్తదనం ఏమీ లేదనీ, పల్లెటూరు నుంచి ఫారెస్ట్‌కు హీరోను తీసుకెళ్తే అది కొత్తగా ఉంటుందని సూచించారు సురేశ్. ఆ ప్రకారం కథలో మార్పులు చేశారు పరుచూరి సోదరులు. సినిమాలో మొదట వాణిశ్రీ పాత్రను ధనవంతురాలిగా చూపిద్దామనుకున్నారు. అయితే ఆ పాత్ర ను మినిస్టర్ చేస్తే బాగుంటుందని పరుచూరి వెంకటేశ్వర రావు సూచించారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ కనుక ఆమె పాత్రను అటవి శాఖ మంత్రిగా మార్చారు. 'రాష్ట్రాన్నయినా రాసిస్తాను కానీ ఈ పెళ్లికి అంగీకరించను' అనే డైలాగుతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు వాణిశ్రీ.

ఆ ఆంగ్ల సినిమాను కాపీ కొట్టి

ఫారెస్ట్ నేపథ్యంలో 'గాడ్స్ మస్ట్ బీ క్రేజీ' పేరుతో ఓ ఆంగ్ల చిత్రం వచ్చింది. ఇందులో కీలక సన్నివేశాలు కాపీ కొట్టి 'బొబ్బిలి రాజా'లో వాడుకున్నామని సురేశ్‌బాబు ఓపెన్‌గా చెబుతుంటారు.

1990 సెప్టెంబర్ 24న 'బొబ్బిలి రాజా' చిత్రం విడుదలైంది. ఓపెనింగ్స్ బాగున్నాయి కానీ రెండో రోజు నుంచి కలెక్షన్లు డ్రాప్ అయ్యాయి. సినిమా క్లాస్‌గా ఉందనీ, మాస్ ఎలిమెంట్స్ మరిన్ని పెట్టి ఉంటే పెద్ద హిట్ అయి ఉండేదని రామానాయుడు అనడంతో సురేశ్‌బాబు ఆలోచనలో పడ్డారు. క్లాసీ మాస్ పిక్చర్ తీసి తప్పు చేశానా అని ఆయన బాధ పడినా, సినిమా ఆడుతుందనే నమ్మకం ఉండేది. చివరకు ఆయన నమ్మకమే నిజమైంది. రెండో వారం నుంచి 'బొబ్బిలిరాజా' వసూళ్ల ఊపందుకున్నాయి.

మరోసారి జోడీ

జయాపజయాలు మాటెలా ఉన్నా కథానాయికగా రాశీఖన్నాకు అవకాశాలకు కొదవలేదు. అటు టాలీవుడ్‌లో, ఇటు బాలీవుడ్‌లో ఆమెకు పెద్ద హిట్ చిత్రాలేవీ లేవు. కానీ అవకాశాలు మాత్రం ఆమెను వెతుక్కుంటూ వస్తున్నాయి. తాజాగా ఆమె మరో బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. విక్రాంత్ మాసే కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి 'తలాఖోంమే ఏక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బోధ్‌యాన్ రాయ్ చౌధురి దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్ ఖాఖర్ నిర్మాత. అయితే విక్రాంత్‌మాసే, రాశీఖన్నా జంటగా నటిస్తున్న 'సబర్మతి రిపోర్ట్' చిత్రం కూడా ప్రస్తుతం సెట్స్‌పై ఉంది.




నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 2 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్క్రీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరినవారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్ఏటీ/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.



ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్స్‌తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న వారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in



ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.



స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

పీజీ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని యూనిట్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ప్రొడక్ట్స్(సీఎస్ఐఆర్-యూఆర్‌డీఐపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో 12 మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ సెషన్స్, డెయిలీ అసైన్‌మెంట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

మాడ్యూల్స్

- ఇంట్రడక్షన్ టు ఐపీఆర్ అండ్ పేటెంట్స్ అండ్ పేటెంట్ లెజిస్లేషన్
- ఇంటర్నేషనల్ ఫ్రేంవర్క్స్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ అండ్ బేసిక్స్ ఆఫ్ పేటెంట్ సెర్చింగ్
- సెర్చింగ్ ఆన్ పేటెంట్ డేటా బేసెస్
- అండర్‌స్టాండింగ్ డేటాబేస్ ఫీచర్స్
- అడ్వాన్స్‌డ్ పేటెంట్ సెర్చింగ్
- ఇన్ఫర్మేషన్ సెర్చింగ్ ఇన్ వేరియస్ డొమైన్స్
- పేటెంట్ అనలిటిక్స్ అండ్ మాపింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్
- పేటెంట్ ఇన్ఫర్మేషన్ ఫర్ టెక్నాలజీ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ వాల్యుయేషన్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ ఆర్ అండ్ డీ ప్లానింగ్, స్ట్రాటజిక్ పేటెంటింగ్ అండ్ పర్ఫార్మెన్స్ బెంచ్ మార్కింగ్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ స్ట్రాటజీ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/టెక్నాలజీ)/ఎంఫార్మసీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీతోపాటు ఎల్ఎల్‌బీ/మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్/ఎంబీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **వెబ్‌సైట్:** pgdp.urdip.res.in

కేంద్ర శాఖల్లో వివిధ ఉద్యోగాలు

ఖాళీలు: 312

దేశ వ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియలాజికల్ కెమిస్ట్: **4 పోస్టులు**
2. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియలాజిస్ట్: **67 పోస్టులు**
3. సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్: **4 పోస్టులు**
4. స్పెషలిస్ట్ గ్రేడ్-3 అసిస్టెంట్ ప్రొఫెసర్: **132 పోస్టులు**
5. స్పెషలిస్ట్ గ్రేడ్-3: **35 పోస్టులు**
6. డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్: **9 పోస్టులు**
7. అసిస్టెంట్ డైరెక్టర్: **4 పోస్టులు**
8. అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్-2: **46 పోస్టులు**
9. ఇంజనీర్ అండ్ షిప్ సర్వేయర్ కం-డిప్యూటీ డైరెక్టర్ జనరల్: **2 పోస్టులు**
10. ట్రెయినింగ్ ఆఫీసర్: **8 పోస్టులు**
11. అసిస్టెంట్ ప్రొఫెసర్: **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.


ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.25. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 13

వెబ్‌సైట్: https://upsc.gov.in/



జాబ్ కార్నర్

ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో టీచింగ్ పోస్టులు

నోయిడాలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ అడ్‌హక్ బేసిస్ పైన కింద పేర్కొన్న టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. టీజీటీ(హిందీ): **2 పోస్టులు**
2. పీఆర్‌టీ(స్పెషల్ ఎడ్యుకేషన్): **1 పోస్టు**

వయసు: ఫ్రెషర్స్ అయితే 40 సంవత్సరాలు, అనుభవం(4 నుంచి 10 ఏళ్లు) ఉన్న వారు అయితే 57 ఏళ్లు మించకూడదు.



అర్హతలు: అభ్యర్థులు సీబీఎస్ఈ నిబంధనల మేరకు తగిన అర్హతలు కలిగి ఉండాలి. సీఎస్‌బీ/సీటెట్‌లో అర్హత పొంది ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 8

వెబ్‌సైట్: apsnoida.edu.in/

ఎన్ఐటీవీఏఆర్‌లో రీసెర్చ్ అసిస్టెంట్స్

పుణెలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రీసెర్చ్...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. రీసెర్చ్ అసిస్టెంట్: **1 పోస్టు**
2. ల్యాబొరేటరీ టెక్నీషియన్: **1 పోస్టు**
3. డేటా ఎంట్రీ ఆపరేటర్: **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.31,000, ల్యాబొరేటరీ టెక్నీషియన్‌కు రూ.18,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.17,000

వయోపరిమితి: రీసెర్చ్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్ పోస్టులకు 30 ఏళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: జూన్ 14

వేదిక: ఆడిటోరియం ఆఫ్ ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్, రీసెర్చ్ ప్లాట్ నెం.73, జీ-బ్లాక్, భోసరీ, పుణె.

వెబ్‌సైట్: https://www.nariicmr.res.in/

తేజ్‌పూర్ యూనివర్సిటీలో ఖాళీలు

అసోంలోని తేజ్‌పూర్ యూనివర్సిటీ కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 21

పోస్టుల వివరాలు

1. రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
2. ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
3. డిప్యూటీ రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
4. అసిస్టెంట్ రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్): **4 పోస్టులు**
5. అసిస్టెంట్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్): **1 పోస్టు**
7. జూనియర్ అకౌంటెంట్(అడ్మినిస్ట్రేషన్): **2 పోస్టులు**
8. అప్పర్ డివిజన్ క్లర్క్(అడ్మినిస్ట్రేషన్): **1 పోస్టు**
9. లోయర్ డివిజన్ క్లర్క్(అడ్మినిస్ట్రేషన్): **6 పోస్టులు**
10. మల్టీ టాస్కింగ్ స్టాఫ్(అడ్మినిస్ట్రేషన్): **5 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి మాస్టర్స్/బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15

వెబ్‌సైట్: http://www.tezu.ernet.in/

లిటిల్స్




తన దాకా వస్తే గానీ


ఒక అడవిలో రెండు కోతులు ఉండేవి. ఆ రెంటిలో ఒక కోతి మిగతా జంతువులతో స్నేహంగా ఉంటూ తన పనేదో తాను చూసుకునేది. రెండో కోతిచాలా తుంటరిది. అది కనిపించిన జంతువునల్లా ఏడిపిస్తూ వాటి మీద రాళ్లు విసురుతూ, కళ్లలో మట్టి జల్లుతూ,అవి దాచుకున్నఆహారాన్ని దొంగిలిస్తూఉండేది. వ ఇలా చేయడం తప్పు అని మంచికోతి తుంటరి కోతిని మందలిస్తూ తన పనుల వల్ల ఇతర జంతువులు ఎలా బాధపడతాయో చెబుతూ ఉండేది. కానీ తుంటరి కోతి మంచి కోతితో నీది మట్టి బుర్ర, అందుకే ఎలా అందరినీ ఏడిపిస్తూ సరదాగా ఉండవచ్చో, తెలియదు. అందులోఎంత వినోదం ఉందో తెలిస్తే నువ్విలా మాట్లాడవు అంటూ కోపగించుకునేది. అడవిలోని మిగతా జంతువులు ఈరెంటిని మంచికోతి మరియు తుంటరి కోతి అనే పిలిచేవి. తుంటరి కోతికి ఒక పిల్ల ఉండేది. అదంటే తుంటరి కోతికి పంచ ప్రాణాలు.ఒక రోజు తుంటరి కోతి పిల్ల ఎక్కడో తప్పిపోయింది. పిల్ల కనబడకపోయేసరికి తుంటరి కోతి ఎంతో ఆందోళన పడి దిగులుతో ఏడ్చింది. కొంత సేపటి తర్వాత మంచి కోతి తుంటరి కోతి పిల్లను తీసుకొచ్చిఅప్పగించింది. తప్పిపోయిన నా పిల్లను వెతికి తెచ్చినందుకు ధన్యవాదాలు అన్నది తుంటరి కోతి. దానికి మంచికోతి అయ్యో నీ పిల్ల తప్పిపోవడం ఏమిటి నేనే దాన్ని కాసేపు దాచి ఉంచాను అన్నది. ఎందుకలా చేసావు అని అడిగిన తుంటరి కోతితో మంచి కోతి ఇలా అన్నది .నువ్వేగా ఎవరినైనా సరదాగా ఏడిపిస్తే ఎంతో ఆనందం వినోదం వస్తాయని చెప్పావు అదెలా ఉంటుందో చూద్దాం అని నేనే నీ పిల్లను కాసేపు దాచాను కానీ పిల్ల కనిపించక నువ్వు చాలా బెంగ పెట్టుకున్నావు. ఏదైనా తనదాకావస్తే గానీ తెలియదు అంటారు ఇందుకే కాబోలు అన్నది మంచి కోతి.

సరైన నీడ ఏది?





7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 322

			7		5	2		
	8							1
2		4			3		5	
6		7						
	9	3				7	1	
						5		9
	3		2			9		4
4							8	
		1	8		7			

సుడోకు - 321 సమాధానం

1	6	5	7	4	3	2	9	8
8	2	4	6	1	9	3	7	5
7	3	9	5	2	8	4	1	6
4	9	3	2	6	1	5	8	7
2	8	1	3	5	7	6	4	9
6	5	7	9	8	4	1	2	3
9	7	2	4	3	5	8	6	1
5	1	6	8	9	2	7	3	4
3	4	8	1	7	6	9	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.